
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
కడప
గురువారం 3 ఆగస్టు 2017

కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. అయినా.. కరుణచూపి వర్షించడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు ఆకాశం వంక దీనంగా చూస్తున్నారు. మరోమారు కరువుబారిన పడతామేమోనన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పూర్తిస్థాయిలో కరువు సంభవించింది. అలాగే ఈ ఏడాది కూడా కరువు రక్కసి వెంటాడుతోంది. పంట పొలాల్లో పైర్ల సాగు దయనీయంగా ఉంది. మరోపక్క ఉపాధి లేక గ్రామాల్లో కూలీలు దినదినగండంగా గడుపుతున్నారు. ఎటుచూసినా బీడు భూములు నోళ్లు తెరుచుకున్నాయి. వాన జాడ కనిపించక, భూగర్భ జలాలు అడుగంటి నిన్నా మొన్నా సాగైన పంటల దగ్గర నుంచి ఉద్యాన పైర్ల దాకా ఎండుతున్నాయి.

కరువు మేఘాలు



- నోళ్లు తెరుచుకుంటున్న బీళ్లు
- వాన చినుకు పడితేనే ఊరట
- వరుస కరువులతో దిక్కుతోచని స్థితిలో రైతులు
- పంటల సాగులేదు, ఉపాధి లేదు
- ఎటుచూసినా బీడుభూములే



ఆగస్టు వచ్చినా ఇంకా చీనీ చెట్లకు ట్యాంకర్లతో నీటి తడులు

తొండూరు ప్రాంతంలో ఎండుతున్న వేరుశనగ పైరు

జిల్లావ్యాప్తంగా రైతుల ఆందోళన

పులివెందుల కథనం 6లో

కడప డీఎస్పీగా మాసుమ్ బాష



14లో

కడప డీఎస్పీగా షేక్ మాసుమ్‌బాష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా మార్కాపురంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అశోక్‌కుమార్ విజయవాడకు బదిలీ అయ్యారు.

ముగిసిన టీచర్ల బదిలీలు

4,650 మందికి స్థాన చలనం 7లో

16లో

ఏపీజీబీ ఖాతాదారులకు ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు

కలెక్టర్ బాబూరావునాయుడు



బ్యాంకింగ్ డిజిటల్ సేవల పట్ల పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందని కలెక్టర్ బాబూరావునాయుడు, సిండికేట్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్లికార్జునరావు అన్నారు. కడప నగరం మరియాపురంలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-కామర్స్ సదుపాయాలను బుధవారం వారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్పీ బాబూజీ కూడా పాల్గొన్నారు.

మినీ కిట్లలో కనికట్టు

రైతుల పేర్లతో స్వాహా పర్వం

రైతులకు పూర్తి ఉచితంగా అందించాల్సిన విత్తనాల మినీ కిట్లలో జిల్లాలో పలుచోట్ల అధికారులు, డీలర్లు కలిసి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులకు ఇవ్వనప్పటికీ కొంతమంది రైతుల పేర్లతో స్వాహాపర్వానికి తెరలేపుతున్నారు. మినీ కిట్లు తక్కువ రావడం వల్లనే ఎటువంటి ప్రచారం లేకుండా పంపిణీ చేస్తున్నట్లు కొంతమంది వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మినీ కిట్ల విషయమై రైతులకు తెలిస్తే ఎక్కువ మంది వాటికోసం ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉందని కొందరు అధికారులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ రైతులకు అందాల్సిన మినీ కిట్లు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



6లో

అశ్రునయనాలతో గునిపాటి కేశవులు అంతిమయాత్ర





గునిపాటి కేశవులు మృతదేహన్ని చూసేందుకు వైకుంఠరథం వద్ద భారీగా ప్రజలు, అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రి సీఆర్‌సీ, కస్తూరి, విశ్వేశ్వరనాయుడు, వెంకటేశ్వరరాజు

ఓబులవారిపల్లె : మంగంపేట మాజీ సర్పంచX , సీనియర్ తెలుగుదేశం నాయకుడు గునిపాటి కేశవులు మృతదేహానికి బంధువులు, కార్యకర్తలు కన్నీటి పర్యంతంతో అంతిమయాత్ర నిర్వహించారు. వైకంఠరథంలో రైల్వేకోడూరు పట్టణంలోని తన నివాసం నుంచి మంగంపేటలోని గునిపాటి ఘాట్ వరకు గునిపాటి యువసేన సుమారు 500 మోటారు సైకిళ్ళ ర్యాలీతో అంతిమయాత్ర నిర్వహించారు. రైల్వేకోడూరు నుంచి మంగంపేట వరకు ప్రధాన రహదారి కూడళ్లలో అభిమానులు, కార్యకర్తలు బారులు తీరారు. వైకుంఠరథంలోని కేశవులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతంలో వీడ్కోలు పలికారు. రైల్వేకోడూరు నుంచి శ్మశాన ఘాట్‌కు గునిపాటి మృతదేహం చేరుకునేందుకు సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. మంగంపేట గ్రామంతో పాటు చుట్టుపక్కల నుంచి అంత్యక్రియలకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. తెలుగుదేశం పార్టీ రైల్వేకోడూరు ఇనX చార్జి కస్తూరి విశ్వనాధనాయుడు, మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్‌రాయులు అంత్యక్రియలు ముగిసేంత వరకు దగ్గరే ఉన్నారు. తన తండ్రి మరణాన్ని తట్టుకోలేక కుమార్తెలు, కుమారులు సొమ్మసిల్లిపోయారు. బంధువులు, రక్తసంబంధీకులను ఓదార్చుతూ సమీప బంధువులైన గల్లా శ్రీనివాసులు, కల్లాచలపతి, అనుమలగుండం చంద్రమోహనX , గునిపాటి దాయాదులు గునిపాటి అంత్యక్రియలు దగ్గరుండి నిర్వహించారు. సమాధి వద్ద అంత్యక్రియలు జరిగేటప్పుడు గునిపాటి తనయుడు మండల ఉపాధ్యక్షులు గునిపాటి చెన్నరాయుడు, గునిపాటి కిరణ్‌కుమార్ సమాధి వద్ద సొమ్మసిల్లడంతో పలువురు గొల్లుమన్నారు. నాలుగు గంటల పాటు వైకుంఠరథంలో జరిగిన గునిపాటి కేశవులు అంతిమయాత్రలో రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి, విజయదుర్గా ఆటోమొబైల్స్ అధినేత దుర్గా మల్లికార్జునరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, ఏఎస్‌ఆర్ గ్రూప్స్ అధినేతలు శివరాయుడు, అతికారి సుబ్బారెడ్డి, ఇందీవరనాయుడు, మండలాధ్యక్షులు వెంకటేశ్వరరాజు, గునిపాటి యువసేన నాయకులు గల్లా చలపతి, మామిళ్ళ రాధాకృష్ణ, అనుమలగుండం శివశంకర్, జడ్పీటీసీ రమణయ్య, సీనియర్ దేశం పార్టీ నాయకులు కోడూరు జనార్ధననాయుడు, పారిశ్రామిక వేత్త గుత్తిరెడ్డి హరినాద్‌రెడ్డి, కౌలూరు శ్రీనివాసులరెడ్డితో పాటు నియోజకవర్గంలోని సర్పంచX లు, ఎంపీటీసీలతో పాటు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌కు నీరు తెచ్చే విషయంలో

ప్రభుత్వం నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పోరుమామిళ్ల : బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుకు నీరు తెచ్చే విషయంలో ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం కమ్మవారిపల్లెలో వైసీపీ నాయకులు కవలకూరి రమణ స్వగృహంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది బ్రహ్మంసాగర్‌కు నీరు తెచ్చే విషయంలో అనేకసార్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. బ్రహ్మంసాగర్‌లో పూర్తిగా నీరు ఉండాలంటే వెలుగోడు దగ్గర 0.18 కిలోమీటర్ల కాలువ అధ్వానంగా ఉందని, దాని మరమ్మతులు పూర్తి చేస్తే 5 వేల క్యూసెక్కుల నీరు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. త్వరలో నంద్యాలలో జరిగే ఉపఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికే ప్రజలు పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సీఎం బాష, కాశినాయన వైసీపీ నాయకులు నల్లేరు విశ్వనాథ్‌రెడ్డి, బి.కోడూరు వైసీపీ నాయకులు యోగానందరెడ్డి, చిత్తా రవిప్రకాష్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల నిర్వాసితుల్లా మీరూ కాకూడదు

- సర్వే చేస్తేనే ఆధారం ఏర్పడుతుంది
- గండికోట నిర్వాసితులతో జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు




తాళ్లప్రొద్దుటూరులో మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు, ఎర్రగుడి గ్రామాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొండాపురం : సోమశిల నిర్వాసితుల లాగా గండికోట ముంపువాసులు కూడా కాకూడదన్నది తన అభిమతమని జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు తెలిపారు. రెండోవిడత ముంపు గ్రామాలైన తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి, గ్రామస్థులతో బుధవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. గండికోట ప్రాజెక్టు కింద సర్వం కోల్పోయిన మీరు త్యాగమూర్తులని అందులో సందేహం అవసరం లేదన్నారు. కాకపోతే ప్రభుత్వానికి కొన్ని నిబంధనలు ఉంటాయని, వాటిని అనుసరించాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా తోడ్పాటునందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండో విడత ముంపు గ్రామాల్లో సర్వే చేయించుకుంటేనే ఎంతమందికి లబ్ధిచేకూరాలన్న విషయం ప్రభుత్వానికి సమగ్ర సమాచారం అందించే వీలుంటుందన్నారు. సర్వే చేయించుకోకుండా డిమాండ్లు అడిగితే ప్రయోజనం ఉండదని కలెక్టర్ తెలిపారు. 1972 నుంచి సోమశిల ముంపువాసులు ఇలాగే చేయడం వలన వారు ఇప్పటి వరకు పూర్తిగా పరిహారాన్ని అందుకోలేకపోతున్నారన్నారు. పోలవరం ముంపు గ్రామాల్లో తాను ఇంటింటికి వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకున్నానన్నారు. గండికోట ముంపువాసులకు కూడా ఎలాంటి అన్యాయం జరగకుండా చూసే బాధ్యత నాపై ఉందని, సర్వే చేయించుకోవాలని కలెక్టర్ గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. స్పెషల్ కలెక్టర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మొదటి విడత 14 ముంపు గ్రామాల మాదిరిగానే రెండో విడత ముంపు గ్రామాల్లో కూడా మొట్టమొదట సర్వే చేయించుకోవాలని తర్వాతనే డిమాండ్లను అడిగే అవకాశం ఉంటుందన్నారు. పరిహారం పెంపు కటాఫ్ డేట్ ఇలాంటి అన్ని సమస్యలు కూడా సర్వే చేయించుకున్న తర్వాతనే అడిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. జమ్మలమడుగు ఆర్డీఓ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గండికోట నిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సామాజిక ఆర్థిక సర్వే చేయించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికి ఏయే సౌకర్యాలు అవసరం అవుతాయో తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్వేత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యల వెల్లువ : రెండో విడత ముంపు గ్రామాలైన తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి గ్రామాలలో కలెక్టర్‌కు పలు సమస్యలను నిర్వాసితులు లేవనెత్తారు. మొదటి విడత ముంపు గ్రామాల మాదిరి కాకుండా రెండో విడత ముంపు గ్రామాలకు ప్రత్యేక జీవో విడుదల చేయాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.6.75 లక్షల ప్రత్యేక ప్యాకేజీని పెంచాలన్నారు. మైనర్ పిల్లలకు కూడా పునరావాసం కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పునరావాసం కోసం ఇస్తున్న 5 సెంట్ల స్థలాన్ని 10 సెంట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎక్కువ మంది ఈ ప్రాంతంలో పాడి పరిశ్రమపైన ఆధారపడి జీవిస్తున్నారని, వారికి కనీసం అర్ధ ఎకరానైనా భూమిని ఇవ్వాలన్నారు. ముంపువాసులకు ఉద్యోగావకాశాలను కల్పించాలని, పరిశ్రమలను ఏర్పాటు చేయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మరికొన్ని డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తమ డిమాండ్లపైన సానుకూలంగా స్పందించి ఆదుకుంటేనే తాము సర్వే చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని నిర్వాసితులు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తల్లిలాంటివి

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను




కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను, హాజరైన సీడీపీఓలు

కడప, అర్బన్: పుట్టబోయే బిడ్డ మొదలు కొని పెరిగి పెద్దయ్యే వరకు ఆలనా పాలనా చూసేది తల్లిలాంటి తల్లి అయిన అంగన్‌వాడీ కేంద్రమేనని ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బాను అన్నారు. కలెక్టరేట్ లోని డీఆర్‌డీఏ సమావేశ భవనంలో బుధవారం సీడీపీఓలకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై మహిళా సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సీడీపీఓలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఇంటి పనులు, కార్యాలయ పనులు కూడా చేసి శక్తిశాలిగా నిరూపించుకుంటున్నారన్నారు. చిన్న పిల్లలకు, గర్భిణులకు సకాలంలో మందులు, పౌష్టికాహారం అందే విధంగా సీడీపీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. క్రింది స్థాయి సూపర్‌వైజర్‌లు సరిగ్గా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ పాఠశాలలను దీటుగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వం కూడా ముందుకు వస్తుందన్నారు. కడప జిల్లాలో ముస్లిం మైనార్టీల జనాభా ఎక్కువగా ఉందని ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌ను కోరామన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి భవిష్యత్తులో ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో ఉర్దూ టీచర్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. కడప నగరంలో ప్రతి డివిజన్ లో ఒక ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రం కోసం కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, ఐరన్ ట్యాబ్‌లెట్‌లు అందిస్తామన్నారు. భవిష్యత్తులో క్యాల్షియం ట్యాబ్లెట్లు కూడా అందిస్తామన్నారు. సీడీపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి వారికి ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలో చూసి, మతాశిశు మరణాలను తగ్గించాలన్నారు. అన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల అక్రమరవాణా, బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ మమత, ఏపీడీ శ్రీదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శివప్రసాద్‌రెడ్డి, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఆ బియ్యం బస్తాలు ఎవరివి ?



గోపవరం: జిల్లా సరిహద్దు ప్రాంతం పీపీకుంట సమీప అటవీప్రాంతంలో జాతీయ రహదారి పక్కన గుట్టలు గుట్టలుగా కనుగొన్న బియ్యం బస్తాలు ఎవరేశారో, ఎప్పుడు వేశారో తెలియదుబుధవారం ఉదయం పలువురు విషయాన్ని ఎస్ఐ హేమాద్రికి తెలియపరిచారు. దీంతో ఆయన వారి సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ 30 బియ్యం బస్తాల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే కొందరు ఆ దారిన వెళుతూ కొన్ని బస్తాలు తీసుకువెళ్లినట్లు తెలిసింది. సుమారు 70 బస్తాలకుపైగానే అక్కడక్కడ రోడ్డువెంట వదిలిసినట్లు స్థానికులు చెబుతున్నారు. వీటిని పరిశీలిస్తే తడిసిపోయి పనికిరాకుండా ఉన్నట్లు తెలిసింది. వీటిని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే ఈ బియ్యం బస్తాలు అటవీప్రాంతానికి దగ్గరలో ఎందుకు వేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

సికెదిన్నె: రాయచోటి రోడ్డులోని బుగ్గలేటిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్‌షఫివుల్లా (24) మినీ వ్యాన్ డ్రైవర్ మరణించినట్లు ఎస్ఐ హేమకుమార్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు మేరకు కడప నుంచి రాయచోటి వెళుతున్న సిమెంట్‌లారీని బెంగుళూరు నుంచి కడపకు వస్తున్న మినీవ్యాను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్రాక్షలోడు తీసుకువస్తున్న మినీవ్యాన్ డ్రైవర్ షఫీవుల్లా తీవ్రంగా గాయపడడంతో అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ప్రమాదంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో మినీవ్యాన్ సిమెంటులారీ ముందుభాగం పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఇద్దరు లారీ దొంగలు అరెస్ట్

మైదుకూరు రూరల్: ఎర్రచందనం అక్రమరవాణా చేసేందుకు లారీని దొంగలించి చివరికి మైదుకూరు పోలీసులకు దొరికారు. వివరాల్లోకి వెళితే... పోలీసులు తెలిపిన సమాచారం మేరకు బెంగుళూరుకు చెందిన మునిరాజ్ విశ్వజిత్ లారీని దొంగలించి పారిపోబోతున్నారు. కాగా స్థానిక బైపాస్ రోడ్డు వద్ద హోటల్లో భోజనం చేస్తుండగా గమనించిన మైదుకూరు పోలీసులు అతన్ని పాత నేరసునిగా గుర్తించారు. గతంలో కూడా నేర చరిత్ర కలిగి ఉన్నాడని తెలుసుకుని విచారించగా విశ్వజిత్ లారీ దొంగలించి తీసుకెళుతున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. అతనికి సహకరించిన సంపంగి.సంజన్నను నంద్యాలలోని నూనెపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లారీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీ.ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఐ.రామక్రిష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లారీ, నిందితులతో రూరల్ సీఐ వెంకటేశ్వర్లు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు




సుమో ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన బైకులు, మృతి చెందిన పందికాళ్ళ హరి

పెనగలూరు: కడిమేవారిపల్లె సమీప రాజంపేట-చిట్వేలి రహదారిపై మోటారు బైకులు, టాటాసుమో ఢీకొన్న సంఘటనలో చిట్వేలి మండలం తిమ్మయ్యగారిపల్లె దళితవాడ వాసి పందికాళ్ళ హరి(28) అక్కడికక్కడే మృతి చెందగా ఇదే సంఘటనలో అతని బావమరుదులు ఇసూర హరి(30), జోరేపల్లె మోహన్ (25) తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన వివరాల్లోకెళితే....

తిమ్మయ్యగారిపల్లె దళితవాడకు చెందిన పందికాళ్ళ హరి నెల కిందట కువైట్ నుంచి ఇంటికి వచ్చాడు. ఇంటికి ప్రహరీ నిర్మిస్తూ కూలీలకు డబ్బు ఇచ్చేందుకు ఏటీఎం వద్దకు బావమరుదులతో కలిసి రెండు బైకులలో చక్రంపేటకు వచ్చాడు. డబ్బు డ్రా చేసుకుని తిరిగి తిమ్మయ్యగారిపల్లెకు బావమరుదులతో కలిసి బయలు దేరాడు. ఇదే సమయంలో చిట్వేలి వైపు నుంచి ఏపీ02ఏబీ8871నెంబరు సుమో కడిమేవారిపల్లె సమీపంలో బైకును ఢీకొంది. అంతేకాకుండా వెనుకగా వస్తున్న మరో బైకును ఢీకొని వారిని సుమారు 50మీటర్ల దూరం ఈడ్చుకెళ్ళింది. దీంతో ముందు బైకులో ప్రయాణిస్తున్న పందికాళ్ల హరి దుర్మరణం చెందగా మరో బైకులో వస్తున్న ఇసూర హరి, జోరేపల్లె మోహన్ కు తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుపక్కన పొలాల్లో పనిచేస్తున్న రైతులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పెనగలూరు పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని ఇన్‌చార్జి ఎస్ఐనరసయ్య అధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఏడేళ్ళ హరిణి, నాలుగేళ్ళ సూర్య పిల్లలున్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పెనగలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి ఫైరింగ్‌లో ప్రవల్లిక ప్రతిభ



ప్రవల్లికకు బహుమతి అందిస్తున్న కమాండింగ్ అధికారి కల్నల్, ప్రిన్సిపాల్

పులివెందుల టౌన్: స్థానిక లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థి ని ప్రవల్లిక రాష్ట్రస్థాయి ఫైరింగ్‌లో మొదటిస్థానం సాధించినట్లు ఎన్‌సీసీ అధికారి రాజమోహన్ రెడ్డి తెలిపారు. బీకాం కంప్యూటర్స్ తృతీయ సంవత్సరం విద్యార్థిని ప్రవల్లిక జూలై 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో జరిగిన టీఎస్సీ-ఐ4 సీ క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్ రాష్ట్రస్థాయి ఫైరింగ్‌లో ప్రతిభ చూపింది. ఇందుకు 30వ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అంబరిస్ గులియా, కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ విద్యార్థినికి బహుమతి ప్రధానం చేశారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న మౌనిక ఎన్‌సీసీ క్యాడెట్ ఆప్టికల్స్‌లో మంచి ప్రతిభ కనబరిచినందుకు బహుమతిని అందజేశారు. విద్యార్థినిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడం పట్ల కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మైలవరం: బోదుపల్లె సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బుధవారం మధ్యాహ్నం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. జమ్మలమడుగు రూరల్ సీఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, తలమంచిపట్నం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు 55 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు ఉంటుందని, శరీరం నల్లగా తయారై గడ్డం పెరిగిందన్నారు. బోదుపల్లె నుంచి రైల్వే గేటు వైపు వెళుతున్న మార్గంలో మృతదేహం పడి ఉందని, కరెంటు తీగెలు తగిలి చనిపోయి ఉంటే ఎవరైనా ఇక్కడ మృతదేహాన్ని పడవేశారా లేక వయస్సు భారమై ఎండ తీవ్రతకు చనిపోయాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రూరల్ సీఐ మాట్లాడుతూ మృతదేహాన్ని సంఘటనా స్థలంలో పరిశీలించి జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, పోస్టుమార్టం రిపోర్టు వస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు. తలమంచిపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

వెంకయ్యనాయుడును కలిసిన పోతుగుంట రమేష్



రాజంపేట టౌన్ : ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడును ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు బుధవారం న్యూఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపారు. ముందుగా పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని నిలిచి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి వెంకయ్యనాయుడు ఎంతో కృషి చేశారన్నారు.

కోడూరు ఆర్టీసీ బస్టాండుకు సొబగులు

● రూ.10లక్షలతో ఫర్నీచర్‌తోపాటు బస్టాండు ఆవరణ సుందరీకరణ ● ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



బస్టాండులో ప్రయాణికులకోసం ఏర్పాటుచేసిన కుర్చీలు



బస్టాండులో క్యాంటిన్ ఏర్పాటుచేసిన దృశ్యం



బస్టాండు ఆవరణలో నాటిన మొక్కలు



బస్టాండులో ప్రయాణీకుల సందడి

రైల్వేకోడూరు

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుకు మంచి రోజులొచ్చాయి. నిన్నా, మొన్నటి వరకు నిరుపయోగంగా ఉండిన ఆర్టీసీ బస్టాండును బాగుచేయాలని, ఇక్కడికి బస్సులు నడపాలని ప్రజలు ఇటు ప్రజాప్రతినిధులకు, అధికారులకు చాలాకాలంగా విన్నవించారు. అయితే ఆర్టీసీ మేనేజింగ్‌డైరెక్టర్ మాలకొండయ్య రైల్వేకోడూరు ఆర్టీసీబస్టాండును పరిశీలించి వెంటనే ఆర్టీసీబస్టాండును ప్రయాణికుల సౌకర్యార్థం అభివృద్ధికి పరచాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఆర్టీసీబస్టాండు ముందుభాగంలో దుమ్మూధూళీలేయకుండా మొదటనిధులు ఏర్పాటుచేశారు. బస్టాండు ముందుభాగంలో తారురోడ్డు ఏర్పాటుచేశారు. నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకునివచ్చారు. బస్టాండుచుట్టు పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రీనరీకోసం మొక్కలునాటారు. రంగులుపూశారు. బస్టాండులోపల కుర్చీలు ఏర్పాటుచేశారు. క్యాంటిన్‌ఏర్పాటుచేశారు.

బస్టాండులో మెరుగైన వసతులకు కృషి

ఆర్టీసీ బస్టాండులో మెరుగైన వసతులు ఇంకా కల్పిస్తామని కంట్రోలర్ స్వామిదాసు ఆంధ్రజ్యోతికి వివరించారు. ఆర్టీసీ బస్టాండుపైకప్పు రిపేరుకు జిల్లాఉన్నతాధికారులకు విన్నవించామని, బస్టాండు అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. గతేడాది సెప్టెంబర్‌నెల ఆర్డనరి బస్సులు నడుస్తున్నాయి. గతనెల నుంచి ఎక్స్‌ప్రెస్‌బస్సులు నడిపిస్తున్నారు. రోజుకు సుమారుగా 300నుంచి 400మంది ఆర్టీసీబస్టాండుకు వచ్చి బస్సులు ఎక్కుతున్నారని కంట్రోలర్ తెలిపారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు.

-స్వామిదాసు, కోడూరు ఆర్టీసీకంట్రోలర్

ఎంఆర్‌పీఎస్ నేతల వినూత్న నిరసన



అరగుండు చేయించుకుంటూ నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాజంపేట : ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణమాదిగ పిలుపు మేరకు రాజంపేటలో ఎంఆర్‌పీ ఎస్ నాయకులు బుధవారం అరగుండుతో వినూత్న నిరసన చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకుల దీక్ష 14వ రోజుకు చేరింది. ముందుగా నాయకులు అరగుండుతో దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నేత వెలగచెర్ల శివయ్యమాదిగ మాట్లాడుతూ అధికార పక్షాలు వర్గీకరణ గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మాదిగలను అణచివేయాలనే ధోరణిని ప్రభుత్వాలు విడనాడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ఎంఆర్‌పీ ఎస్ నాయకుడు వెంకటేష్‌మాదిగ, పట్టణా ధ్యక్షుడు తాడిపత్రి తిరుపాలు, నియోజకవర్గ యువసేన అధ్యక్షుడు పెంచలయ్యమాదిగ, విద్యార్థి సమైక్య అధ్యక్షులు మురళీమాదిగ, సుబ్బరాయుడుమాదిగ, రామచంద్ర, ముని కృష్ణ, సురేష్, పెంచలయ్య, శివ, మహేష్, కాకా, వినోద్‌కుమార్, బాలాజీ, మోసయ్య, సునీల్, శంకర్, బి.రామ్, నారాయణ, రమణయ్య, సుబ్బయ్య, మనోహర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

రాజంపేట

సమద్ :నిన్నుకోరి
సుదర్శన్ :నాకు నేనే తోపు తురుము
పీవై : ఫిదా
బీఎస్: డిజె
(దువ్వాడ జగన్నాథమ్)
ఎన్‌ఎస్‌ఆర్:గౌతమ్‌నంద

రైతు సమస్యలు పరిష్కరించాలి : ఆర్డీవో





మాట్లాడుతున్న రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం, హాజరైన వీఆర్వోలు

రాజంపేట : రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభల్లో రైతుల సమస్యలను విచారించి వెంటనే పరిష్కరించాలని రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. బుధవారం రాజంపేట ఆర్డీవో సభాభవనంలో 34గ్రామాల వీఆర్వోలకు, రైతు సేవలో రెవెన్యూ శాఖలో ఎలా చర్యలు తీసుకోవాలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాలలో దండోరా, గ్రామసభలు నిర్వహించామని, అలాగే అక్కడున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కా రానికి కృషి చేయాలన్నారు. భూమి రికార్డులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ రిజిష్టర్లు, సమస్యలు తెలుసుకొని ఆన్‌లైన్ చేయడానికి కావాల్సిన సదుపాయాలు, ఇంటి స్థలాలకు గల అర్జీలు, ఏవైనా సమస్యలు ఉంటే అన్నింటిని పరిష్కరింపచేసేలా చూడాలని ఆయన వీఆర్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పక్కా గృహాల అర్హుల సర్వే

వీరబల్లి: ప్రభుత్వం చేపట్టిన బీయంజీ పల్స్ సర్వేలో పక్కాగృహాల కోసం అందజేసిన దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని మట్లి, తాటిగుంపల్లె పంచాయతీల్లో హౌసింగ్ ఏఈ లక్ష్మణ్‌స్వామిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలకు మట్లి సర్పంచ్ కొల్లి వెంకట్రమణనాయుడు, తాటిగుంటపల్లె సర్పంచ్ పుష్పావతి, ఎంపీడీవో జనార్ధన్‌రావు, ఆర్‌ఐ వంశీధర్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఎంపీటీసీలు, టీడీపీ నేత నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. పల్స్‌సర్వేలో దరఖాస్తులను పరిశీలించి వారికి గృహం ఉన్నదా? లేదా? అని గుర్తించి అవసరమైతే అర్హులైన వారికి గృహాన్ని మంజూరు చేసే విధంగా తీర్మానించారు. గురువారం గుర్రప్పగారిపల్లెలో, శుక్రవారం వంగిమళ్ల, దిగువరాచపల్లె పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



గ్రామ సభలో దరఖాస్తులు పరిశీలిస్తున్న దృశ్యం

కలుషిత ప్రసాదం వల్లే అతిసారం

● గంగపేరూరులో ఉచిత వైద్యశిబిరం ● 35మంది బాధితులకు వైద్య చికిత్సలు

ఒంటిమిట్ట : మండలంలోని గంగపేరూరులో అతిసారం విజృంభించడానికి కలుషిత ప్రసాదమే కారణమని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు వారు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. 'గంగపేరూరులో విజృంభిస్తున్న అతిసారం - 50మందికి పైగా అస్వస్థత' అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో స్పందించిన వైద్యాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలోని ఆరోగ్య సిబ్బంది బుధవారం గంగపేరూరులో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్ళి అతిసారం ప్రబలడానికి గల కారణాలను ఆరా తీశారు. అనంతరం 50 మందికి పైగా రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అలాగే రక్తపూతలు తీసి మందులు అందజేశారు. ఇక వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న 35మంది బాధితులకు శిబిరంలో సెలైనX బాటిళ్ళు ఎక్కించి వైద్యంచేశారు. నాగుల పుట్టకు సమర్పించిన ప్రసాదం తయారీలో బల్లి పడిందని, ఆ ప్రసాదాన్ని గ్రామస్తులు తినడం వల్లే అతిసార ప్రబలడానికి కారణమైనట్లు గ్రామస్తుల ద్వారా వైద్యసిబ్బంది నిర్ధారించారు. ఈ మేరకు వారు డీఎంహెచX వో కార్యాలయానికి నివేదిక పంపారు. గురువారం వరకు గంగపేరూరులో వైద్యశిబిరం కొనసాగించి బాధితులకు వైద్యసేవలు అందించి అతిసారను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు.


గంగపేరూరులో అతిసార బాధితురాలికి సెలైన్ ఎక్కిస్తున్న వైద్యులు

బాధితులను పరామర్శించిన అధికారులు

గంగపేరూరులో అతిసారంతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీవో వెంకటప్రసాద్, ఈవోపీఆర్‌డి సుబ్బరాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మనX గడ్డం జనార్ధనX రెడ్డి, సర్పంచX కట్టా నారాయణలు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించి అతిసారం కట్టడి చేయాలని వారు వైద్యసిబ్బందికి సూచించారు.

కార్యక్రమంలో పీహెచX ఎనX ఉమా మహేశ్వరి, సీహెచX వో నాగరాజు, సూపర్‌వైజర్‌లు మహబూబ్‌బాషా, పద్మావతి, ల్యాబ్‌టెక్నీషియనX రమణ, ఏఎనX ఎం పద్మావతితో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 నాణేలపై తగ్గని వదంతులు

● తిరస్కరిస్తున్న వ్యాపారులు ● అపోహలు నమ్మవద్దంటున్న బ్యాంకర్లు



ఒంటిమిట్ట : పది రూపాయల నాణేలు చెల్లవంటూ వస్తున్న వదంతులు ఆగడంలేదు. ముఖ్యంగా చిల్లర వ్యాపారుల దగ్గర నుంచి సాదాసీదా వ్యాపారుల వరకు వాటిని తీసుకోకుండా తిరస్కరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బ్యాంకర్లు రూ.10 నాణేలు లెక్కించడం వీలుకాక ఖాతాదారుల నుంచి తీసుకోకుండా తిరస్కరిస్తుండడంతో ఈ పరిస్థితి దావానంలా తయారైంది. రూ.10 నాణెం అంటేనే వామ్మో మాకొద్దంటూ ఎవ్వరూ తీసుకోవడంలేదు. గత ఏడాది నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు సమయంలో పది రూపాయల నాణెలు కూడా రద్దు అవుతాయని సోషల్‌మీడియాలో ప్రచారం జరిగింది. పది నాణెలను బ్యాంకులకు తీసుకెళితే మార్పిడి చెల్లదని తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో దుకాణాలు, విద్యుతX చెల్లింపులు, హోటళ్ళు, రేషనX డీలర్లు, ఆటో డ్రైవర్లు, పెట్రోల్ బంకుల్లో కూడా పది రూపాయల నాణెలు చెల్లడం లేదని, వేరే నోట్లు ఇవ్వాలని అంటుండటంతో ప్రజలు బిక్క మోహం వేస్తున్నారు. పెద్ద నోట్లకు కూడా చిల్లర దొరక్క అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 10రూపాయల నాణేలు చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.10నాణేలు చెల్లుతాయి

ఈ విషయమై ఒంటిమిట్ట ఎస్‌బీఐ మేనేజర్ వెంకట్రావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా 10రూపాయల నాణేలు చెల్లుతాయని దీనిపై ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మవద్దని స్పష్టం చేశారు. అన్ని దుకాణా దారులు కూడా నాణెలను తీసుకోవచ్చన్నారు. తమ ఎస్‌బీఐ శాఖలో పది రూపాయల నాణెలను ఖాతాదారులు వారి అకౌంట్లలో జమచేసి తిరిగి నోట్ల ద్వారా తీసుకోవచ్చన్నారు.

- వెంకట్రావు, ఎస్‌బీఐ మేనేజర్, ఒంటిమిట్ట

రామయ్యను దర్శించుకున్న బ్యాంకు ఉన్నతాధికారులు



ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని బుధవారం సిండికేట్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీహెచX ఎస్ఎస్ మల్లికార్జునరావు దంపతులు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మనX ఎ.వెంకటరెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం వారు ఏకశిలా రామున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి ప్రధాన అర్చకులు వీణారాఘవచార్యుల ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం ఆలయ శిల్పసందను వీక్షించి ముగ్దులయ్యారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకుడు లక్ష్మీనాగరాజు, రాజంపేట సిండికేట్ బ్యాంక్ ఆర్ఎం ఓబయ్య, మేనేజర్ శ్రీనివాసనX , ఒంటిమిట్ట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కె.రంగనాయకులు, ఆలయ మాజీ చైర్మనX నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

ఒంటిమిట్ట : మండలంలోని 11గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని రాజంపేట డ్వామా ఏపీడీ కృష్ణయ్య సూచించారు. మండల పరిషతX సభాభవనంలో బుధవారం ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లకు జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షా భావ పరిస్థితుల వల్ల వ్యవసా య పనులు తక్కువగా జరుగుతున్నాయన్నారు. అందువల్ల జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని చెప్పారు. అలాగే ఉపాధి పనులు, కూలీల వివరాలను ఆనX లైనX తో పాటు రిజిష్టర్లలో నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటప్రసాద్, ఏపీవో పార్థసారధి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

వీరబల్లి: మండల పరిధిలోని మట్లి గ్రామంలో మాండవ్యనది ఒడ్డున శ్రీసీతారాముల ఆలయం వద్ద బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించి సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయం శ్రీకృష్ణదేవరాయుల కాలంలోని మట్లి రాజుల కాలం నాటిదని తెలిపారు. ఆలయం పురాతనం కావడంతో గ్రామ ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆలయాన్ని నూతనంగా నిర్మించాలని, ఆలయ అభివృద్ధి కోసం రూ.5 లక్షల చందాలు కేటాయించారు. దీంతో దేవాదాయశాఖ రూ.20 లక్షలను ఆలయ పునర్నిర్మాణానికి అందజేసింది. ఆ నిధులతో ఆలయాన్ని నిర్మించారు. అయినప్పటికీ నిధులు కొరత రావడంతో తిరిగి గ్రామస్తులు రూ.10 లక్షలు చందాలు కేటాయించుకున్నారు. మొత్తం ఆలయ అభివృద్ధికి రూ.35 లక్షలు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, మండల ప్రజలు పాల్గొన్నారు. వారందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రామయ్య సన్నిధిలో దివ్యదర్శనం భక్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని బుధవారం గుంటూరు జిల్లా బాపట్ల ప్రాంతానికి చెందిన 200మంది దివ్యదర్శనం భక్తులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఏకశిల రామున్ని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలోని శిల్పసంపదను వీక్షించారు. ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యుల ద్వారా ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ఆలయం తరపున అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ప్రజలు కోరితే విగ్రహాన్ని అక్కడే ఉంచుతాం..


విగ్రహాన్ని పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

నందలూరు : పాటూరు తిమ్మప్ప చెరువులో బయల్పడిన పురాతన విష్ణుమూర్తి విగ్రహాన్ని ప్రజలు కోరితే అక్కడే ఉంచుతామని తిరుపతికి చెందిన పురావస్తు శాఖ టెక్నికల్ అసిస్టెంట్ శివకుమార్, జానX కమాలాకర్‌లు తెలిపారు. బుధవారం వారు విష్ణుమూర్తి విగ్రహాన్ని పరిశీలించి మాట్లాడుతూ ఈ విగ్రహం 16, 17వ శతాబ్దాల కాలానికి చెంది ఉంటుందన్నారు. విగ్రహం శిల్పకలను బట్టి విజయనగర శైలి ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు. ఈ విగ్రహం 4అడుగులు 16అంగుళాలు(136సెంటీమీటర్లు) ఉందన్నారు. దెబ్బతిన్న విగ్రహాలను జలసమాధి చేస్తారని, ఈ విగ్రహం దెబ్బతిన లేదన్నారు. పాటూరు గ్రామ ప్రజలు విగ్రహాన్ని త మకు అప్పగిస్తే ఆలయం నిర్మిస్తామన్నారు. ఎర్రిపాపయ్యగారిపల్లె ప్రజలు సైతం విగ్రహాన్ని తమకు అందజేస్తే ఆలయం నిర్మిస్తామన్నారు. కానీ పా టూరు చెరువు వద్దనే ఆలయం నిర్మిస్తామనండంతో ఎర్రిపాపయ్యగారిపల్లె ప్రజలు అభిప్రాయాన్ని మార్చుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, వీఆర్వో హరి, మాజీ సర్పంచX జగనX మోహనX రెడ్డి, గ్రామ ప్రజలు శంకర్ శ్రీనివాసులు, శివశంకర్‌రాజు, నరసింహారెడ్డిలు పాల్గొన్నారు.

కరువు మేఘాలు



పులివెందుల వద్ద బీడుగా ఉన్న పంట పొలం

పులివెందుల : జిల్లాలో ఈ ఏడాది కూడా కరువు రక్కసి పంజా విసిరే సూచనలు కన్పిస్తున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో చెప్పుకోదగిన వర్షాలు కురవలేదు. వాగులు, వంకలు ప్రవహించే స్థాయిలో వర్షాలు కురవకపోవడం భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీరు రాక చీనీతోటల రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. అలాగే అడపాదడపా కురిసిన వర్షానికి అదును వచ్చిందని పదును సరిగా కాకపోయినా అక్కడక్కడ పైర్లను సాగు చేశారు. కానీ ఈ పంటల పరిస్థితి కడుదయనీయంగా ఉంది. వర్షాలు లేక మొలిచిన మొక్క మొలిచినట్లే ఉంది. మరో పక్క ఈదురుగాలులకు చిగురుటాకు కాస్తా ఎగిరిపోతోంది.

జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణం దయనీయంగా ఉంది. వేరుశనగ జిల్లాలో దాదాపు 5 వేల హెక్టార్లలో సాగైంది. అలాగే పత్తి మరో 10 వేల హెక్టార్లలో సాగైనట్లు తెలుస్తోంది. ఈ పంటలు ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. నిన్నామొన్నా సాగుచేసిన పంటల పరిస్థితి ఇలావుంటే గత యేడాది నుంచి ఇప్పటి వరకు జిల్లాలో చెప్పుకునే స్థాయిలో వాగులు, వంకలు ప్రవహించే విధంగా వర్షాలు కురవలేదనే చెప్పాలి. దీనితో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో వందల ఎకరాల్లో చీనీతోటలు ఎండిపోయాయి. ఫిబ్రవరి, మార్చి మాసాల నుంచి రైతులు లక్షలు ఖర్చుచేసి చీనీ తోటలకు ట్యాంకర్లతో నీరందిస్తున్నారు. కానీ నేటికి చెప్పుకునే స్థాయిలో వర్షాలు కురవక, భూగర్భ జలాలు పెరగక లక్షల రూపాయలు వెచ్చించి ట్యాంకర్లతో నీరు అందించలేక రైతులు చీనీతోటలపై ఆశలు వదులుకుంటున్నారు. ఆగస్టు వస్తున్నా ట్యాంకర్లతో నీరు తోలుకునే దౌర్భాగ్య స్థితి ఇప్పటి వరకు ఏ ఏడాదిలో సంభవించలేదని గ్రామాల్లో ఉన్న వృద్ధులు సైతం చెబుతున్నారు. ఒక్కసారైనా పెద్ద వర్షం కురిసి ట్యాంకర్లతో నీరు తోలుకునే పరిస్థితి నుంచి గట్టెక్కుతూ వచ్చామని కానీ ఈ ఏడాది మాత్రం పూర్తిగా విరుద్ధంగా ఉందని రైతులు అంటున్నారు. జూన్ 25 నుంచి జూలై 30 వరకు ఖరీఫ్‌లో పైర్లు సాగుచేసేందుకు మంచి అదునుగా రైతులు భావిస్తారు. కానీ ఈ ఏడాది అదునులో వర్షాలు లేవు. దీనితో పంటల సాగు సాగలేదు. జిల్లా అంతటా పంటల సాగు చూస్తే 20 వేల హెక్టార్లలోపే అని అధికారిక లెక్క. వర్షాలు సమృద్ధిగా కురిసి ఉంటే ఈ సమయానికి పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతుండేవి. ఎటుచూసినా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. వర్షపు చినుకు కోసం బీడు భూములు నోళ్ల తెరుచుకున్నాయి. జిల్లాలో వరుసగా రెండో ఏడాది కూడా కరువుఛాయలు తీవ్రస్థాయిలో కనిపిస్తున్నాయి. పంటల సాగు లేకపోవడంతో పొలాల్లో పనుల్లేక అటు రైతులు, రైతు కూలీలు ఇళ్లవద్దే ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కూలీలకు ఉపాధి లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఉపాధి అందుతూ వచ్చింది. కానీ ఈ సమయంలో పొలం పనులు ఉండాల్సి ఉన్నా వర్షాలు లేకపోవడంతో పొలం పనులు లేక కూలీలకు పనుల్లేవు. ఏదిఏమైనా జిల్లా మరో ఏడాది కరువు రక్కసికోరల్లో చిక్కుకునే ప్రమాదం కనిపిస్తోంది.

కుష్టువ్యాధి ఉందంటూ అవమానం

● ఊరొదిలి వెళ్లిన మహిళ ● కోడూరు స్టేషన్‌లో కుమార్తె ఫిర్యాదు





పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వెంకటసుబ్బమ్మ కుమార్తె శ్రావణి, (ఇన్‌సెట్లో) మనస్థాపంతో ఊరు వదలివెళ్లిన వెంకటసుబ్బమ్మ (ఫైల్)

రైల్వేకోడూరు: కుష్టువ్యాధి ఉందని అవహేళన చేయడంతో పాటు అవమానంగా మాట్లాడారని ఓ మహిళ ఊరు వదిలివెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై ఆమె కుమార్తె రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. చిట్వేలి మండలం తుమ్మకొండ గ్రామానికి చెందిన పుల్లగంటి వెంకటసుబ్బమ్మ, గంగయ్య దంపతులు రైల్వేకోడూరు పట్టణంలోని పగడాలపల్లె కాలనీలో నివాసముంటున్నారు. రెండేళ్ల కిందట నిప్పట్లు చేస్తుండగా వెంకటసుబ్బమ్మ చేతి వేళ్లు కాలిపోయాయి. దీంతో చూపరులకు తెలియకుండా చీరకొంగును అడ్డంగా పెట్టుకుని ఇంటి పనులు చేసుకుంటుంది. ఇరుగుపొరుగు వారు ప్రతిరోజు కుష్టు వ్యాధి సోకిందంటూ సూటిపోటి మాటలు మాట్లాడుతున్నారని కుటుంబ సభ్యులకు చెప్పింది. అనుకుంటే అనుకోనీలే... అని కుటుంబ సభ్యులు వెంకటసుబ్బమ్మకు సర్ది చెప్పారు. కాలనీలో అందరూ అవహేళనగా మాట్లాడడంతో తీవ్ర మనస్థాపానికి గురై వెంకటసుబ్బమ్మ ఊరువదిలి వెళ్లిపోయిందని ఆమె కుమార్తె శ్రావణి బుధవారం కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా శ్రావణి మీడియాతో మాట్లాడుతూ తనతల్లికి కుష్టువ్యాధి ఉందని అవమానంగా, హేళన చేసి మాట్లాడడంతో కనిపించకుండా పోయిందని, బతికి ఉందా, ఎటైనా వెళ్లిపోయిందా అనేది అంతుపట్టకుండా ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సమగ్రంగా పగడాలపల్లె మహిళలను విచారించారు. ఫిర్యాదు పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


మినీ కిట్లలో కనికట్టు

ప్రొద్దుటూరు: ప్రతి సీజన్‌లో ప్రధానంగా సాగయ్యే పంటలకు సంబంధించిన విత్తనాలను చిరుసంచులతో వ్యవసాయశాఖ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం కొంతమేర పూర్తి ఉచితంగా విత్తనాలను పంపిణీ చేస్తుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2,800 మినీ కిట్లను జిల్లాకు కేటాయించారు. ఇందులో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం ద్వారా పెసర, మినుము, కంది, అదే విధంగా నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్‌సీడ్స్ ఆయిల్‌పామ్ పథకం ద్వారా వేరుశనగ విత్తనకాయలను మంజూరు చేశారు 2,100 కిట్లు వేరుశనగ విత్తనకాయలను జిల్లాలోనే పలు మండలాలకు కేటాయించారు. ఇందులో కమలాపురం డివిజన్‌లోని కమలాపురం మండలానికి 80, వల్లూరుకు 80, వీఎన్‌పల్లికి వంద, ఎర్రగుంట్లకు 90, రాయచోటి డివిజన్‌లోని రాయచోటికి వంద, సంబేపల్లెకు 150, టి.సుండుపల్లెకు 100, చిన్నమండెంకు 100, లక్కిరెడ్డిపల్లె డివిజన్‌లోని లక్కిరెడ్డిపల్లెకు 75, చక్రాయపేటకు 100, రామాపురంకు 100, వీరబల్లెకు 75, గాలివీడుకు 175, పులివెందుల డివిజన్‌లో పులివెందులకు 75, లింగాలకు వంద, వేముల 125, వేంపల్లెకు 150, ముద్దనూరు డివిజన్‌లోని ముద్దనూరుకు 100 ప్యాకెట్ల చొప్పున కేటాయించారు. వీటిని ఆయా మండల పరిధిలోని చిన్న, సన్నకారు రైతులకు పూర్తి ఉచితంగా అందజేసి పంటలను సాగు చేయించాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపై ఉంది. పలు చోట్ల ఈ విత్తన కాయలు దారి మళ్లినట్లు వినిపిస్తోంది. పూర్తి ఉచితం కాబట్టి రైతులకు కాకుండా కొన్ని చోట్ల డీలర్లు, నాయకులు కలిసి పంచుకున్నట్లు తెలుస్తోంది. రికార్డు పరంగా రైతులకు సంబంధించిన పత్రాలు మాత్రం సమకూర్చుతున్నట్లు సమాచారం. కానీ ఆ రైతుకు మినీకిట్లు పంపిణీ చేయనట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఏటా ప్రధానమైన పంటలకు సంబంధించి చిరు సంచులను రైతులకు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం కేటాయిస్తున్నప్పటికీ ఈ విషయం పెద్దగా ఎవ్వరికి తెలియజేయనివ్వకుండా అనుకూలమైన రైతులకు, పెత్తనం చెలాయించే నాయకులకు అందజేస్తున్నట్లు సమాచారం.

పెసలు, మినుములు

ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా సాగు చేసే వేరుశనగతోపాటు వర్షాధారంగా వేసే పంటల్లో పెసర, మినుము కూడా జిల్లాలో రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ పంటలకు సంబంధించి 95 కిట్లను కేటాయించారు. ఇందులో పెసర విత్తనాల కిట్లను పెద్దముడియం మండలానికి 10, జమ్మలమడుగుకు పది, మైలవరం 10, పులివెందుల 10, వేముల 10, వేంపల్లె 10, లింగాల 10, సంబేపల్లె 10, లక్కిరెడ్డి పల్లె మండలానికి అయిదు కేటాయించారు. మినుములకు సంబంధించి 96 కిట్లు మంజూరు కాగా ఖాజీపేటకు 5, కమలాపురానికి 10, వల్లూరుకు 5, వీఎన్‌పల్లెకు 10, ఎర్రగుంట్లకు 10, ప్రొద్దుటూరుకు 10, మైదుకూరుకు 10, చాపాడుకు 10, దువ్వూరుకు 10, రాజుపాళెంకు 16 కిట్లను కేటాయించారు. కందులు 100 కిట్లు మంజూరు కాగా రాయచోటికి 5, సంబేపల్లెకు 10, టి.సుండుపల్లె 5, చిన్నమండెం 5, లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, రామాపురం, వీరబల్లి, పోరుమామిళ్ల, బి.మఠం మండలాలకు అయిదు కిట్ల చొప్పున కేటాయించారు. గాలివీడు మండలానికి 15, కాశినాయనకు 10, కలసపాడు మండలానికి 10 కేటాయించారు. అయితే... ఈ మినీ కిట్లు రైతులకు సక్రమంగా పంపిణీ జరిగాయా లేదా అనే అంశంపై వ్యవసాయ శాఖ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేకపోలేదు.

మినీ లోకం



ముదిరాజ్ కులాన్ని బీసీ 'ఏ' లో చేర్చాలి

● ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

కడప, మారుతీనగర్ : రాష్ట్రంలో మిగతా వర్గాలకన్నా అన్ని రంగాల్లో వెనుకబడి వున్న ముదిరాజ్ కులస్థులు సుమారు 30 లక్షలపై చిలుకు వున్నారని, వీరిని బీసీ-ఏలో చేర్చాలని ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా.. సామాజికంగా వెనుకబడి వున్న తమ వర్గీయుల అభివృద్ధి కోసం బీసీ కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన్ని బీసీ కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, అదే తరహాలో తమకు కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ఐదు ఎకరాల స్థలం కేటాయించినట్లు కడప జిల్లా కేంద్రంలో ముదిరాజ్ భవనం కోసం యాభై సెంట్లు స్థలం కేటాయించాలన్నారు. ముఖ్యంగా రాజకీయంగా ముదిరాజ్‌లకు సరైన న్యాయం జరగలేదని నామినేటెడ్ పదవుల భర్తీలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించి రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లేని పక్షంలో పాలక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముదిరాజ్‌లను ఏకం చేసి ఉద్యమం బాట పడతామని హెచ్చరించారు.

సమావేశంలో ఏపీ రాష్ట్ర ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.లక్ష్మీనరసయ్య, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కందుల నరసింహులు, జిల్లా అధ్యక్షులు పెండ్లిమర్రి నరసింహులు, కె.చలపతి, నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీల పర్వం

• 4650 మందికి స్థానచలనం • రెండు నెలల పాటు కుంటుపడిన విద్యా పర్యవేక్షణ

కడప, ఎర్రముక్కపల్లె : ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ బుధవారం ముగిసింది. ఈనెల 21న ప్రారంభమైన బదిలీల ప్రక్రియ 13 రోజుల పాటు సాగింది. విద్యాశాఖ వైఫల్యం కారణంగా ఈ ఏడాది బదిలీల కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. ఎన్నడూలేని విధంగా రోజుకో షెడ్యూల్ పుట్టుకొస్తూ ఉపాధ్యాయులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. గత నెల షెడ్యూల్ విడుదల చేసినా పలు కారణాలతో వాయిదా వేస్తూ వచ్చారు. ఉపాధ్యాయుల ప్రాధాన్యతా పాయింట్ల విషయంలో రోజుకో రకంగా ఉత్తర్వులు రావడంతో ఎప్పకటిప్పుడు బదిలీ షెడ్యూల్ మార్పులు చేయాల్సి వచ్చింది. వెబ్ విధానాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకించడంతో ప్రభుత్వం దిగి వచ్చి ఆన్ లైన్ కౌన్సెలింగ్ నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులకు బదిలీలు జరిగాయి. 17 సబ్జెక్టులలో 6759 మంది దరఖాస్తు చేసుకున్నారు. జూలై 29వ తేదీకి 16 సబ్జెక్టులు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఎస్‌జీటీల కౌన్సెలింగ్ ప్రారంభమై బుధవారం రాత్రికి పూర్తి చేశారు. గ్రాడ్-2 ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీఈటీ, లాంగ్వేజి పండిట్లు స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజి) స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజి) సంబంధించి 3220 మంది దరఖాస్తు చేసుకోగా 2339 మందికి బదిలీలు జరిగాయి. అలాగే ఎస్‌జీటీలకు సంబంధించి 3513 మంది దరఖాస్తు చేసుకోగా 2311 మంది బదిలీలు జరిగాయి.



బదిలీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

బదిలీ అయిన వారి వివరాలు

సబ్జెక్టు	దరఖాస్తులు	బదిలీ అయిన వారు
ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం	1123	50
గ్రేడ్2 హెచ్ ఎం	133	90
స్కూల్ అసిస్టెంట్ గణితం (తెలుగు)	445	352
పిజికల్‌సైన్స్	376	291
బైలాజికల్‌సైన్స్	339	254
సోషల్ స్టడీస్	328	222
ఫిజికల్ డైరెక్టర్	52	50
గణితం (ఉర్దూ)	23	15
ఫిజికల్ సైన్స్	20	18
బైలాజికల్ సైన్స్	15	10
సోషల్ స్టడీస్	29	26
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)	142	119
స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)	6	5
స్కూల్ అసిస్టెంట్ (హింది)	104	74
స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)	419	350
స్కూల్ అసిస్టెంట్ (పీఈటీ)	156	118
స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)	7	4
లాంగ్వేజి పండిట్ (తెలుగు)	272	160
లాంగ్వేజి పండిట్ (ఉర్దూ)	16	14
లాంగ్వేజి పండిట్ (హిందీ)	226	117
ఎస్‌జీటీ	3513	2311
మొత్తం	**6733**	**4650**

ఆరోపణలు : ధృవపత్రాలపై సమగ్ర పరిశీలన లేకుండాపోయింది. చాలా వరకు ప్రాధాన్యత పాయింట్ల కోసం ఉపాధ్యాయులు తప్పుడు ధృవపత్రాలు సమర్పించారని ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రాస్థాయిలో ఎంఈవోలకు అప్పగించడంతో ఇటువంటి పరిస్థితి జరిగినట్లు తెలుస్తోంది.

• సాంకేతిక సమస్యలు అవరోధంగా నిలిచాయి. ఆన్ లైన్ తెరుచుకోకపోవడం, సర్వర్ మొరాయించడం, సీనియార్టీ జాబితా గంట ముందుగా విడుదల చేయడంతో రాత్రి వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

• తప్పనిసరి బదిలీ కావాల్సిన ఉపాధ్యాయులకు క్లియర్ వేకెన్సీ లేకపోవడంతో పూలింగ్‌లో ఉండాల్సి వస్తుంది. జిల్లా వ్యాప్తంగా 175 మంది ఉన్నారు.

• బదిలీల్లో జరిగిన వారికి ఐరిష్, బయోమెట్రిక్ ద్వారా ఉత్తర్వులు ఇవ్వాలి. యంత్రాలు మొరాయించడంతో మధ్యలోనే నిలిచిపోయాయి.

విద్యార్థులకు దూరమైన విద్య: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి విద్యార్థులకు విద్య దూరమైంది. పాఠశాలలపై పర్యవేక్షణ కుంటుపడింది. ఉపాధ్యాయులు బోధన పక్కన పెట్టి బదిలీలపై దృష్టి సారించారు. దీంతో పాఠశాల పనితీరు అధ్వానంగా మారింది.

ప్రశాంతగా బదిలీల కౌన్సిలింగ్ : బుధవారం ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. బదిలీల ప్రక్రియను ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు.

విద్యాశాఖ సేవలు అభినందనీయం : ఆర్జేడీ

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ సజావుగా పూర్తి చేయడం జరిగింది. దీనికి సారధ్యం వహించిన జిల్లా విద్యాశాఖాధికారి శైలజ ఆమెకు సహకరించిన అధికారులు జిలానీబాష, నాగమునిరెడ్డి, ఏడీ వరలక్ష్మి, ఎంఈవోలు, నారాయణ, సివి ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, జాఫర్‌సాదిక్‌తో పాటు డీఈవో కార్యాలయం సిబ్బందిని ఆయన అభినందించారు. అయితే ఎస్‌జీటీలకు సంబంధించి నాలుగు పాఠశాలల్లో ఐదు పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయని జనరేట్ అవుతుందన్నారు. అందులో తమ ప్రమేయం ఉండదన్నారు. సిబ్బంది ఎంతో సహనంతో సహకరించారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే పలు ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆర్జేడీ, డీఈవో సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా

ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సహాయ సహకార సొసైటీల చైర్మన్ పాలిశెట్టి

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వం ద్వారా మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను వారికి నేరుగా అందేందుకు నా వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సహాయ సహకార సొసైటీల చైర్మన్ పాలిశెట్టి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అంతకు ముందు వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మైదుకూరు బెస్త సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బోలా శ్రీనివాసులు, బి.మఠం బెస్త సంఘం ప్రధాన కార్యదర్శి సోమయ్య, బి.మఠం వీరబ్రహ్మేంద్రస్వామి బెస్త సంఘం కమిటీ సభ్యుల అధ్యక్షతనలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాలిశెట్టి మాట్లాడుతూ మత్స్యకారులు చేపలు పట్టడం ద్వారా వచ్చే సంపాదనతో జీవనం సాగించేందుకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అలాగే వారి పిల్లలను కూడా పైస్థాయి చదువులను చదివించుకోవడానికి స్థోమత లేని పేదలు ఎంతో మంది ఉన్నారన్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతామన్నారు. జాతీయ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులు ప్రస్తుతం జీవనం సాగించేందుకు వారి వృత్తినైన చేపలు పట్టడం ఒక్కటే కాకుండా మండలాల్లో చెరువులు లేనిచోట్ల ప్రభుత్వమే వారికి జీవనం సాగించేందుకు ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టి వారికి ఉపాధిని కల్పించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలుపుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉండే సొసైటీలు, సంఘం సభ్యులు ఐక్యంగా వచ్చినప్పుడే అభివృద్ధిని సాధించుకోవచ్చని ఆయన తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కాప్ చైర్మన్ పాలిశెట్టి, వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో పాలిశెట్టి, తదితరులు

రెడ్డెయ్యను ఇతర జిల్లాకు పంపండి


బి.మఠంలో మత్స్య శాఖ అధికారిగా ఉన్న రెడ్డెయ్యను కడప జిల్లాకు కాకుండా ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని బి.మఠం మత్స్యశాఖ సంఘం సభ్యులు రాష్ట్ర చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.మఠం సంఘం సభ్యులు ఆయనతో మాట్లాడుతూ రెడ్డెయ్య నెలలో రెండు రోజులైనా కార్యాలయానికి రావడం లేదని, ఇక్కడ ఉండే చేప పిల్లల అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయడం లేదని, సంఘం సభ్యుల అభివృద్ధికి ఏరోజు ప్రభుత్వ పథకాలను అందించిన దాఖలాలు లేవని, సొసైటీ సభ్యుల అనుమతులు లేకుండా ఒక్కడే కార్యాలయంలో సొంతంగానే పనులను చేసుకుంటూ బిల్లులను స్వాహా చేస్తున్నాడని, ఇటువంటి అధికారి మాకు వద్దని, వెంటనే వేరే అధికారిని బి.మఠానికి నియమించాలని బి.మఠం కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సొసైటీ సభ్యులు నారాయణ, శ్రీనివాసులు, లక్ష్మీనరసింహ, బి.మఠం సంఘం సభ్యులు శ్రీరాములు, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సోమయ్య, బోలా శ్రీనివాసులు, గజ్జల వెంకటసుబ్బయ్య, కేశవ, వెంకటయ్య, అన్ని మండలాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన అరటి ధరలు



రాజంపేట మండలం ఆకేపాడు ప్రాంతంలో విస్తారంగా పండిన అరటి తోటలు

రాజంపేట: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి రైతులు ఈ ఏడాది పక్కాగా బాగుపడ్డారనే చెప్పవచ్చు. ఎందుకంటే ఆది నుంచి అరటి రైతులకు ఈ ఏడాది బాగా గిట్టుబాటు ధరలు కలిగి ఉన్నాయి. ప్రస్తుతం కిలో అరటి ధర రూ.17 ఉంది. ఇది మేలు రకం. అత్యంత తగ్గురకం కాయలైనా రూ.15 ఉంది. ఒక గెల 20 నుంచి 27 కేజీల వరకు బరువు వస్తుంది. గెలకు రూ.400 గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ విధంగా ఒక ఎకరాకు 1200 చెట్లు నాటగా అందులో పక్కాగా 1000 చెట్లకు మంచి కాపు వస్తుంది. ఈ ధరలు ఉంటే ఎకరాకు రూ.4లక్షల ఆదాయం వస్తే 70 వేలు ఖర్చు పోనూ 3.30 లక్షలు మిగులుతుంది. సరాసరిన తీసుకుంటే ఎన్ని ఖర్చులు పోయినా కనీస ఆదాయం రెండు లక్షలు తగ్గదు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో కనీసం 20 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేసి ఉన్నారు. ప్రస్తుతం ఈ వ్యాపారం 300 కోట్ల వరకు జరుగుతోంది. రూ.100 కోట్లు ఖర్చులు పోయినా రూ.200 కోట్లు రైతులకు లాభం వస్తోంది. ఏదేమైనా ఇది ఈ ప్రాంత అరటి రైతులకు ఎంతో శుభపరిణామం. ప్రస్తుతం ఈ కాయలను బెంగుళూరు, ఢిల్లీ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒక ఎకరా పొలంలో 1200 చెట్లు నాటగా 9 నెలల నుంచి 11 నెలల వరకు అరటి గెలలు కాపుకు వచ్చి కోతకు వస్తాయి. ఆ సమయంలోనే ఈ వ్యాపారం జరుగుతుంది. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, ఓబుల వారిపల్లె, పుల్లంపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈ పంటను విస్తారంగా సాగు చేశారు. సరాసరి ప్రతి రోజూ 30 లారీలకు తక్కువ లేకుండా రైల్వేకోడూరు నుంచి ఎగుమతి అవుతుంటాయి. ఇక అరటి తోటలకు రాజంపేట మండలంలోని ఆకేపాడు చుట్టుపక్కల 7గ్రామాలు పెట్టింది పేరు. ఇక్కడ ఏకంగా 10వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తారు. ఇక్కడ రైతులకు ప్రధాన జీవనాధారం అరటిపంటే.. అరటికి ఆకేపాడు ప్రాంతం పెట్టింది పేరు. అరటి సాగుకు ఇక్కడి నేలలు ఎంతో అనుకూలిస్తాయి. అందువల్ల ప్రతి రైతు ఒక ఎకరా నుంచి 100 ఎకరాల వరకు సాగు చేసిన వారు ఉన్నారు. లక్ష నుంచి రూ.రెండు కోట్ల వరకు అరటిపంట ద్వారానే లాభాలు గడించిన రైతులు ఇక్కడున్నారు. ఇందువల్ల ఈ ప్రాంత రైతులు అరటిపంటను సాగు చేసి భారీ లాభాలను ఆర్జించారు. ప్రధానంగా జి9వ రకం, పుల్లపాటి రకం, స్పిక్‌రకం ఇలా అనేక కొత్త వంగడాల పిలకలను తెచ్చి ఈ పంటను సాగు చేస్తున్నారు. సాగుకు 60 వేల వరకు ఖర్చు చేసినా అమిత లాభాలు వస్తుండటంతో అరటి రైతుల ఇళ్లల్లో సిరులు కురిపిస్తున్నాయి. దీంతో అరటి రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. వరుస కరువులతో అల్లాడిపోతూ గిట్టుబాటు ధర రాక పండించిన పంటకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అలమటించే అన్నదాతకు అరటిపంట బాగా కలిసివచ్చింది. అందువల్ల ఈ ప్రాంత రైతులు భారీగా అరటి పంటలను సాగు చేస్తున్నారు.



ఆకేపాడు ప్రాంతంలో పెద్దసైజులో ఉన్న అరటిగెలలు

అంగన్వాడీల్లో బొమ్మల కొలువు



కూరగాయల బొమ్మలతో రంగు రంగుల చిత్రాలు



బొమ్మలతో ఎబిసిడీలు



అంగన్ వాడీలో గర్భవతులకు, బాలింతలకు లభించే గుడ్లు

● చిన్నారులకు రంగురంగుల బొమ్మలతో అక్షరాభ్యాసం

ప్రొద్దుటూరు టౌన్: అంగన్వాడీ కేంద్రాలు బలోపేతానికి చిన్నారుల కోసం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడంతో అంగన్వాడీ సెంటర్ల రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు అనుబంధంగా అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీని ప్రారంభించారు. పాఠ్యపుస్తకాలను చిన్నారులకు పంపిణీ చేశారు. పట్టణంలో ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 196 సెంటర్లు ఉండగా మూడు సెంటర్లను కలిపి ఒక సెంటర్‌గా ఏర్పాటు చేసి ఇంగ్లీషుమీడియం బోధిస్తున్నారు. ప్రస్తుతం 75 సెంటర్లను 25 సెంటర్లుగా ప్రీ స్కూల్స్‌గా ఏర్పాటు చేశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సెంటర్లలో చిన్నారులను ఆకర్షించే విధంగా జంతువులు, పక్షుల బొమ్మలు, ఎ, బి, సి డిలు, 1, 2 అంకెలు, రంగుల్లో చిత్రించారు. ఆట బొమ్మలను కూడా ఏర్పాటు చేయడంతో చిన్నారుల మదిని దోచుకుంటున్నాయి. రంగు రంగుల ఆహ్లాదకర వాతావరణంలో చిన్నపిల్లలు, ఆడుతూ పాడుతూ రెయిమ్స్ నేర్చుకుంటూ ఇంగ్లీషు నేర్చుకుంటున్నారు.



బోర్డు చుట్టూ రంగు రంగుల చిత్రాలు



గోడలపై ఆకర్షణీయమైన పెయింటింగ్ బొమ్మలు

గర్భ నిరోధానికి సూదిమందు



> మీరు కొత్తగా పెళ్లయిన దంపతులా ? కొంతకాలం పిల్లలు వద్దనుకుంటున్నారా ? దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి 'కాంట్రాసెప్టివ్' ఇంజెక్షన్ ఒకటి చేయించుకోండి. మూడు నెలల వరకు గర్భం వస్తుందన్న భయం ఉండదు. పిల్లలు కావాలంటే ఇంజెక్షన్ తీసుకోవడం మానేయండి. వెంటనే మీరు గర్భం ధరిస్తారు. ఇదీ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కొత్త నినాదం.

కడప, కోటిరెడ్డిసర్కిల్: కొత్తగా పెళ్లై కొంత కాలం పిల్లలు వద్దనుకునే వారికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సరికొత్త విధానాన్ని తీసుకొచ్చింది. దగ్గరలోని పీహెచ్‌సీలో గర్భ నిరోధానికి సంబంధించి సూది మందు తీసుకునే అవకాశం కల్పించింది. పిల్లలు వద్దనుకునే మహిళ కాంట్రాసెప్టివ్ ఇంజక్షన్ ఒక్కటి వేయించుకుంటే మూడు నెలల వరకు గర్భం దాల్చదు. పిల్లలు కావాలనుకుంటే ఇంజక్షన్ తీసుకోవడం ఆపివేయాలి. అనంతరం గర్భం ధరించే వీలుంటుంది. దీనిపై ఆశా కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించే యత్నం జరుగుతోంది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రజారోగ్య వ్యవస్థలో తొలిసారిగా గర్భ నిరోధక ఇంజక్షన్‌ను ప్రారంభించింది. ఈ ఇంజక్షన్ తుంటికి లేదా చేతి కండరాలకు చేస్తారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వివాహిత మహిళలు ఈ ఇంజక్షన్లు వినియోగించుకోవచ్చు.

ఆరోగ్య కేంద్రాలకు సరఫరా..

గర్భ నిరోధక ఇంజక్షన్లు తొలి దశలో గుంటూరు జిల్లాలో అమలుకు శ్రీకారం చుట్టారు. అనంతరం దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టనున్న ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ఆశా కార్యకర్తలతో ప్రచార కార్యక్రమాలు చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇందుకోసం ఫ్యామిలీ ప్లానింగ్ లాజెస్టిక్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అనే కంప్యూటర్ వ్యవస్థను వినియోగించనున్నారు. దీనివల్ల జిల్లాలో గర్భనిరోధక సాధనాల ఆవశ్యకత ఏ మేరకు ఉంది.. గర్భ నిరోధక మాత్రలు, ఇంజక్షన్లు, ఏ ప్రాంతానికి అధికంగా పంపిణీ చేస్తున్నారనే అంశం తెలుసుకోవచ్చు.

జనాభా నియంత్రణకు ఆరో సాధనం..

ఇప్పటివరకు ప్రజారోగ్య వ్యవస్థలో కండోమ్‌లు, గర్భ నిరోధక మాత్రలు, ఐయూడీ వంటి తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులతో పాటు మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్, పురుషులకు వేసెక్టమీ ఆపరేషన్ వంటి శాశ్వత కుటుంబ నియంత్రణకు సంబంధించి 5 రకాల పద్ధతులు అమలులో ఉన్నాయి. కాగా ఆరో సాధనంగా గర్భ నిరోధక ఇంజక్షన్లు ప్రవేశపెట్టారు. బిడ్డకు బిడ్డకు దూరం ఉంచేందుకు (స్పేసింగ్ పద్ధతి) ఎంతగానో ఉపయోగపడతాయని వైద్యవర్గాలు భావిస్తున్నాయి. ఇది అమలైతే 30 శాతం మాతృ మరణాలు, 10 శాతం శిశు మరణాలు నిరోధించవచ్చని వైద్యవర్గాల ద్వారా తెలుస్తోంది.

జిల్లాలో కు.ని 76 శాతం..

కుటుంబ నియంత్రణలో ఈ ఏడాది జిల్లా లక్ష్యం 17 వేలు కాగా ఇప్పటి వరకు నాలుగు నెలల్లో 76 శాతానికి చేరుకున్నాం. జిల్లాలో మొత్తం ఫెర్టిలిటీ రేట్ 1.8 ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఇదే నిష్పత్తి ఉంది. గర్భ నిరోధక ఇంజక్షన్లు రానున్నాయనే విషయాన్ని ఇటీవల రాష్ట్ర రాజధానిలో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. అన్ని జిల్లాలకు ఏ విధంగా అమలు చేస్తారో అదే విధంగా కడప జిల్లాలో చేపట్టేందుకు శాఖా పరంగా చర్యలు తీసుకుంటాం.

- వంగిటి జార్జ్, జిల్లా గణాంకాధికారి, కుటుంబ నియంత్రణ శాఖ, కడప

కడుపు కొడుతున్నారు...!

● నిబంధనల పేరుతో కేసులు ● రవాణా, పోలీస్ శాఖల పరస్పర దాడులు
● జీవనోపాధి కోల్పోతున్న ఆటోవాలాలు

చిన్నమండెం: ఉద్యోగాల భర్తీ ఊసేలేదు... నిరుద్యోగ భృతి ఇవ్వనేలేదు... స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకొని బతుకుదెరువు కోసం ఆటోలు పెట్టుకొని జీవిస్తుంటే పోలీస్ రవాణా శాఖ అధికారులు నిబంధనల పేరుతో కేసులు నమోదు చేస్తూ కడుపు కొడుతున్నారు. ఇలాగైతే తాము ఎట్లా బతకాలంటున్నారు ఆటోవాలాలు. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో వేచి చూసి వయస్సు దాటిపోతుండటంతో కొందరు నిరుద్యోగులు జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కొంటున్నారు. ఆ క్రమంలో కొందరు ఆటోలను ఏర్పాటు చేసుకొని తమ కుటుంబాలను పోషించుకొంటున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి తనిఖీలు ముమ్మరం చేశారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముప్పేట దాడి చేస్తున్నారు. ప్రతి రోజు ప్రధాన రహదారుల నుంచి గ్రామీణ రహదారుల వరకు ఎక్కడో ఒక చోట తనిఖీలు చేస్తూనే ఉన్నారు. కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. అధికారుల దాడులతో బెంబేలెత్తిన ఆటోవాలాలు స్టాండులకే పరిమితమవుతున్నారు. లక్షల అప్పు చేసి తెచ్చిన ఆటోలకు కంతులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కుటుంబ పోషణ భారమై అల్లాడి పోతున్నారు. తమ దుస్థితిని దృష్టిలో ఉంచుకొని కాస్త పట్టు విడుపులతో అధికారులు ఉండాలంటున్నారు. కేసులు నమోదు చేసి ఆటోలను సీజ్ చేసి కడుపు కొట్టొద్దని కోరుతున్నారు. తనిఖీలు మొదలైనప్పటి నుంచి ఒక్క చిన్నమండెం స్టేషన్ పరిధిలోనే 19 ఆటోలు సీజ్ చేశారు.



చిన్నమండెం స్టేషన్‌లో సీజ్ చేసి ఉంచిన ఆటోలు

ఘనంగా భైరవేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో భైరవేశ్వరస్వామి మూల విరాట్

సుండుపల్లె

మండలంలోని భైరవగుట్ట వద్ద శ్రీ భైరవేశ్వర, గణపతి, సుబ్రమణ్య స్వామి, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా వేదపండితులచే కంకణధారణ, ప్రధాన కలశ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, నవగ్రహ కలశ ప్రతిష్ఠ, క్షీరాధివాసం, మహామంగళహారతి నిర్వహించారు. బుధవారం దేవతా ప్రతిష్ఠ, కలశప్రతిష్ఠ, గోదర్శనం, ధ్వజారోహణం, జ్వాలాదర్శనం ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ధర్మకర్త బద్రి రాజగోపాల్, ఆలయ కమిటీ, చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ధ్వజారోహణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



హోమం చేస్తున్న వేద పండితులు

'ఫోర్బ్స్' ప్రపంచ ధనవంతుల జాబితాలో తొలిస్థానం ఎవరిది?



ఎస్.మహిపాల్ రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 'మ్యాన్ బుకర్ ప్రైజ్-2017' ఎంపిక జాబితాలో నిలిచిన భారత రచయిత్రి అరుంధతిరాయ్ రచించిన పుస్తకం?
ఎ) ద షేప్ ఆఫ్ ద బీస్ట్
బి) ద చెక్‌బుక్ అండ్ ద క్రుయిజ్ మిస్సైల్
సి) ద మినిస్ట్రి ఆఫ్ అట్ మోస్ట్ హ్యాపీనెస్
డి) బ్రోకెన్ రిపబ్లిక్
2. ప్రధాని రేడియో ప్రసంగాలను పొందుపరుస్తూ ఇటీవల వెలువడిన 'మన్ కి బాత్ ఎ సోషల్ రెవల్యూషన్ ఆన్ రేడియో'ను రచించింది?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) ఎ.సూర్యప్రకాశ్
సి) కె.సి.మాథుర్ డి) రాజేష్ జైన్
3. మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం?
ఎ) ఆగస్టు 2 బి) జూలై 30
సి) జూలై 25 డి) ఆగస్టు 8

4. డిఆర్‌డిఒ రూపొందించిన తొలి స్వదేశీ మానవరహిత యుద్ధ ట్యాంక్?
ఎ) వైజయంతి
బి) మిథుల
సి) మంత్ర
డి) ఫారన్



5. డిఆర్‌డిఒకు సంబంధించి సరైనది?
ఎ) డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్
బి) స్థాపన - 1958 సి) డైరెక్టర్ - క్రిస్టోఫర్
డి) పైవన్నీ
6. ప్రపంచ బ్యాడ్మింటన్ సంఘం ఇటీవల ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో పురుషుల విభాగంలో అత్యుత్తమంగా 8వ ర్యాంక్ ఎవరిది?
ఎ) సాయిప్రణీత్ బి) పారుపల్లి కశ్యప్
సి) కిదాంబి శ్రీకాంత్ డి) అజయ్ జయరాం
7. ప్రపంచ బ్యాడ్మింటన్ సంఘం ఇటీవల ప్రకటించిన మహిళల ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 5వ ర్యాంక్ పొందినది?
ఎ) సైనా నెహ్వాల్ బి) సయాలి గోఖలే
సి) పి.వి.సింధు డి) గుత్తా జ్వాలా
8. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరిగా ఆలపించాలని ఇటీవల ఏ హైకోర్టు తీర్పునిచ్చింది?
ఎ) మద్రాస్ హైకోర్టు బి) అలహాబాద్ హైకోర్టు
సి) కేరళ హైకోర్టు డి) ముంబై హైకోర్టు
9. ఆసియా నోబెల్‌గా పరిగణించే రామన్ మెగసెసె అవార్డుకు సంబంధించిన సరైనది?
ఎ) 1958 నుంచి ప్రదానం బి) విభాగాలు - 6
సి) తొలి భారత గ్రహీత - ఆచార్య వినోబా భావే (1958) డి) పైవన్నీ
10. అండర్ 19 ఆసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు 2018లో ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఇండోనేషియా బి) ఇండియా
సి) ఫిలిప్పీన్స్ డి) సింగపూర్
11. ఇటీవల మరణించిన ఎన్.ధరంసింగ్ ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
ఎ) పంజాబ్ బి) హర్యానా సి) కర్ణాటక డి) మహారాష్ట్ర
12. దేశంలోనే తొలిసారిగా 'ఆన్ గో' అనే మొబైల్ ఆధారిత టికెట్ వ్యవస్థను ప్రవేశపెట్టిన మెట్రో రైలు?
ఎ) కోల్‌కతా మెట్రో బి) ఢిల్లీ మెట్రో
సి) బెంగళూరు మెట్రో డి) ముంబై మెట్రో
13. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజి ఇటీవల 'India Quake' అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. సిస్మోలసిజి అంటే?
ఎ) భూకంపాల అధ్యయన శాస్త్రం
బి) మృత్తిక అధ్యయన శాస్త్రం
సి) వాతావరణ అధ్యయన శాస్త్రం
డి) జనాభా అధ్యయన శాస్త్రం
14. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం?
ఎ) జూలై 29 బి) జూలై 30
సి) జూలై 28 డి) ఆగస్టు 7
15. ఆసియాభివృద్ధి బ్యాంక్ గవర్నర్స్ బోర్డుకు భారత తరపున ఇటీవల ఎవరు నామినేట్ అయ్యారు?
ఎ) శక్తికాంత్ దాస్
బి) సుభాష్ చంద్రగార్గ్
సి) అమితాబ్ కాంత్
డి) అరవింద్ సుబ్రమణియం
16. ఆసియాభివృద్ధి బ్యాంక్‌కు సంబంధించి సరైనది?
ఎ) స్థాపన - 1966
బి) ప్రధాన కార్యాలయం - మనీలా (ఫిలిప్పీన్స్)
సి) సభ్య దేశాలు - 67
డి) పైవన్నీ
17. కార్గిల్ విజయానికి గుర్తుగా జూలై 26న విజయ్‌దివస్‌గా నిర్వహిస్తారు. అయితే కార్గిల్ విజయం కోసం సైన్యం చేపట్టిన కార్యక్రమం?
ఎ) ఆపరేషన్ పరాక్రమ్ బి) ఆపరేషన్ విజయ్
సి) ఆపరేషన్ రాహత్
డి) ఆపరేషన్ సంకటమోచన్
18. బెంగాల్ ప్రభుత్వం అందించే 'మహానాయక్ సమ్మాన్-2017' అవార్డు గ్రహీత?
ఎ) శరద్ పవార్ బి) విరాట్ కోహ్లి
సి) శకుంతల బారువ డి) లతా మంగేష్కర్
19. 'ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2021'కి ఆతిథ్యం ఇవ్వనున్న దేశం?
ఎ) క్యూబా బి) ఇండియా సి) మంగోలియా డి) టర్కీ

జికె అండ్ కరెంట్ అఫైర్స్

20. దేశంలోనే తొలిసారిగా ప్రైవేటు రంగ సంస్థ రిలయన్స్ నిర్మించిన గస్తీ నౌకలు?
ఎ) భారతి, కోకిల బి) శచి, శృతి
సి) భారతి, సింధు డి) సింధు, సాగరిక
21. 'CANDI' అనే పేరుతో బెంగళూరు కేంద్రంగా తొలి డిజిటల్ బ్యాంకింగ్ శాఖను ప్రారంభించింది?
ఎ) బ్యాంక్ ఆఫ్ ఇండియా బి) కర్ణాటక బ్యాంక్
సి) కెనరా బ్యాంక్ డి) ఇండియన్ బ్యాంక్
22. కాంబోడియాలోని ఆంగ్‌కోర్‌వాట్ వంటి సాంస్కృతిక కేంద్రాల పరిరక్షణకు చేసిన కృషికి 2017లో 'రామన్ మెగసెసె' అవార్డు పొందింది?
ఎ) గిత్సె షణ్ముగం(శ్రీలంక)
బి) టోనిటౌ(సింగపూర్)
సి) లిలియ లె డిమ(ఫిలిప్పీన్స్)
డి) యొషియాకి ఇషిజావ(జపాన్)

23. యాక్సిస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా తిరిగి నియామకమైనవారు?
ఎ) పి.ఎస్.జయకుమార్
బి) దీనబంధు మహాపాత్ర
సి) జైకుమార్ నర్గ
డి) శిఖాశర్మ



24. తీర ప్రాంత ప్రజలు, వర్గాలకు అన్ని రకాల సమాచారం, సలహాలు అందించడానికి కేంద్రం ప్రారంభించిన సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు?
ఎ) సేతు సముద్రం బి) సాగరవాసి
సి) సాగరిక డి) సాగర సహాయ్
25. సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ట్రాక్‌ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
సి) ఆంధ్రప్రదేశ్ డి) త్రిపుర
26. ఇటీవల మండే స్వభావం గల ఐస్(మిథేన్ హైడ్రేట్) నుంచి విజయవంతంగా సహజ వాయువును వేరు చేసిన దేశం?
ఎ) జపాన్ బి) కెనడా సి) రష్యా డి) చైనా
27. పనామ పత్రాల లీకేజీ నేపథ్యంలో పదవి కోల్పోయిన పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఏ పార్టీకి చెందినవాడు?
ఎ) పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ
బి) తెహ్రిక్-ఎ-ఇన్సాఫ్
సి) పాకిస్థాన్ ముస్లిం లీగ్
డి) అవామి నేషనల్ పార్టీ
28. 2017 జూలై 27న ట్రాన్స్ జెండర్లు మిలటరీలో పనిచేయడానికి అనర్హులుగా ప్రకటించిన దేశం?
ఎ) ఫ్రాన్స్ బి) నైజీరియా
సి) అమెరికా డి) బొలీవియా
29. దేశ అత్యున్నత న్యాయమూర్తులను ఏ ఇతర సంస్థలతో సంప్రదించకుండానే నియమించే అధికారం అధ్యక్షుడికి అప్పగిస్తూ రాజ్యాంగాన్ని సవరించిన దేశం?
ఎ) బొలీవియా బి) జింబాబ్వే
సి) ఫిలిప్పీన్స్ డి) సింగపూర్
30. ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థల నుంచి పూర్తిగా విముక్తి పొందినట్లు ప్రకటించిన దేశం?
ఎ) కొలంబియా బి) సోమాలియా
సి) సిరియా డి) బొలీవియా
31. 2017 జూలై 27న 'సిమోర్గ్' అనే ఉపగ్రహ ఆధారిత రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన దేశం?
ఎ) ఉత్తర కొరియా బి) ఇరాన్
సి) పాలస్తీన డి) ఇజ్రాయెల్
32. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017 ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 8 వరకు ఏ వ్యాధుల కోసం ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది?
ఎ) తట్టు, రూబెల్లా బి) తట్టు, హెపటైటిస్
సి) రుబెల్లా, పోలియో డి) తట్టు, టెటానస్
33. హంగేరియన్ ఫార్ములా వన్ గ్రాండ్‌ప్రి-2017 విజేత?
ఎ) లూయిస్ హామిల్టన్ బి) రైకోనెన్
సి) సెబాస్టియన్ వెటెల్ డి) బొట్టాస్
34. ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనను ఇటీవల ప్రారంభించిన దేశం?
ఎ) ఇండియా బి) చైనా సి) స్విట్జర్లాండ్ డి) జర్మనీ
35. ఇటీవల చైనాలోని ఫుజియల్ ప్రావిన్స్‌లో విధ్వంసం సృష్టించిన టైఫూన్?
ఎ) హైటాంగ్ బి) నొమురా
సి) తుయుయు డి) ఇయాంగ్

36. 'ఫోర్బ్స్' ప్రపంచ ధనవంతుల జాబితాలో తొలిస్థానంలో ఎవరిది?
ఎ) బిల్‌గేట్స్(మైక్రోసాఫ్ట్)
బి) జెఫ్ బెజోస్ (అమెజాన్)
సి) వారన్ బఫెట్ (వాల్‌మార్ట్)
డి) అజీం ప్రేమ్‌జీ(విప్రో)



37. ఆహార పదార్థాలు, పానియాల్లో ద్రవ నైట్రోజన్ కలపడంపై నిషేధం విధించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) హర్యానా
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్
38. ప్రపంచంలోనే 100 శాతం 'గ్రీన్ రైల్వే'గా ఇటీవల గుర్తింపు పొందినది?
ఎ) చెన్నై మెట్రో రైల్వే
బి) బెంగళూరు మెట్రో రైల్వే
సి) కోల్‌కత మెట్రో రైల్వే డి) ఢిల్లీ మెట్రో రైల్వే
39. 2017 జూలై 27, 28 తేదీల్లో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రత సలహాదారుల సమావేశాన్ని నిర్వహించిన నగరం?
ఎ) సోచి(రష్యా) బి) ఫోర్టలెజా(బ్రెజిల్)
సి) బీజింగ్(చైనా) డి) డర్బన్ (దక్షిణాఫ్రికా)
40. 'హంబంటోటా' పోర్టులో 70 శాతం వాటాను ఏ దేశానికి విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయించింది?
ఎ) ఫిలిప్పీన్ బి) ఇండియా సి) జపాన్ డి) చైనా

సమాధానాలు

		13) ఎ	20) బి	27) సి	34) సి
		14) డి	21) సి	28) సి	35) ఎ
1) సి	7) సి	15) బి	22) డి	29) బి	36) బి
2) డి	8) ఎ	16) డి	23) డి	30) డి	37) బి
3) బి	9) డి	17) బి	24) బి	31) బి	38) డి
4) సి	10) ఎ	18) సి	25) బి	32) ఎ	39) సి
5) డి	11) సి	19) బి	26) డి	33) సి	40) డి
6) సి	12) డి				

ఉద్యోగాలు

ఇండియన్ నేవీ



కేరళ ఎజిమలాలోని ఇండియన్ నేవీ- ఎగ్జిక్యూటివ్& టెక్నికల్ బ్రాంచ్ ల్లో షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్స్, నేవల్ ఆర్మమెంట్ ఇన్ స్పెక్టరేట్ కేడర్‌లో పర్మనెంట్ కమిషన్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకోసం ఇంజనీర్స్ నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టులకు సంబంధించిన కోర్సు 2018 జూన్ నుంచి ప్రారంభమవుతుంది.
ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ విభాగాలు: జనరల్ సర్వీస్/ హైడ్రోగ్రఫీ
టెక్నికల్ బ్రాంచ్ విభాగాలు: జనరల్ సర్వీస్/ నేవల్ ఆర్కిటెక్చర్
వయసు: అభ్యర్థులు 1993 జూలై 2 నుంచి 1999 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
అర్హత: 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఇంటిగ్రేటెడ్ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది చదువుతున్నవారు కూడా అర్హులే
ఎంపిక: అకడమిక్ మెరిట్, సర్వీస్ సెలెక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బి) ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ కేంద్రాలు: బెంగళూరు/ భోపాల్/ కోయంబత్తూరు, విశాఖపట్నం
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 5 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

జిటిబిహెచ్

న్యూఢిల్లీలోని గురు తేజ్ బహదూర్ హాస్పిటల్ (జిటిబిహెచ్)- **జూనియర్ రెసిడెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 176(జనరల్ వర్గానికి 90, ఎస్సీలకు 26, ఎస్టీలకు 13, ఒబిసిలకు 47 పోస్టులను కేటాయించారు)
అర్హత: ఎంబిబిఎస్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఢిల్లీ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి. దరఖాస్తు తేదీకి రెండేళ్ల ముందు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అనర్హులు.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు
ఎంపికైన అభ్యర్థుల లిస్టు విడుదల: ఆగస్టు 19న
దరఖాస్తు ఫీజు: రూ.500
దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ: ఆగస్టు 8
చిరునామా: Medical Director, GTB Hospital, Delhi
వెబ్‌సైట్: http://www.delhi.gov.in


రాజ్యసభ సెక్రటేరియెట్


రాజ్యసభ సెక్రటేరియెట్ - కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 115
పోస్టులు - ఖాళీలు: పార్లమెంటరీ ఇంటర్‌ప్రిటర్ (ఇంగ్లీష్ / తెలుగు 1, ఒడియా 1), అసిస్టెంట్ లెజిస్లేటివ్ / కమిటీ / ప్రోటోకాల్/ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ 20, స్టెనోగ్రాఫర్ (ఇంగ్లీష్) 11, సెక్యూరిటీ అసిస్టెంట్(గ్రేడ్ 2) 21, సెక్రటేరియెట్ అసిస్టెంట్ (ఇంగ్లీష్ 30, హిందీ 7, ఉర్దు 2), ట్రాన్స్‌లేటర్ 19, ప్రూఫ్ రీడర్ 3)
అర్హత: డిగ్రీ/ సంబంధిత విభాగంలో పీజీ పూర్తిచేసి ఉండాలి. నిమిషానికి 40 ఇంగ్లీష్/ హిందీ పదాల టైపింగ్.
వయసు: పోస్టును అనుసరించి దరఖాస్తు నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
ప్రొబెషన్: రెండేళ్లు
ఎంపిక: ప్రిలిమినరీ & మెయిన్ ఎగ్జామ్స్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ద్వారా
ప్రిలిమినరీ ఎగ్జామ్ సెంటర్లు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
దరఖాస్తు ఫీజు: రూ.300
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 18
వెబ్‌సైట్: www.rajyasabha.nic.in

What is the ratio between the speed..

QUANTITATIVE APTITUDE

Direction (1-5) Study the following line graph carefully and answer the given question. The first line graph shows the total distance travelled by 5 different trains on Monday, while the second graph shows the corresponding time taken to cover that distance.





1. If the average speed of Train L on Monday and Tuesday is 75 km/hr, while the time of travelling is same on both the days, then find the total distance travelled by Train L on Tuesday.
(1) 290 km (2) 240 km (3) 280 km (4) 250 km
(5) None of these
2. What is the ratio between the speed of Train M and Train O on Monday ?
(1) 4 : 5 (2) 3 : 4 (3) 2 : 3 (4) 3 : 5
(5) None of these
3. The speed of the slowest Train is **approximately** what percent of the speed of fastest Train on Monday?
(1) 48% (2) 54% (3) 60% (4) 64%
(5) None of these
4. If the speed of Train M is decreased by 25% on Tuesday and of Train L increases by 20% on Tuesday, then speed of Train M on Tuesday is **approximetely** what percentage of speed of Train L on Tuesday ?
(1) 62% (2) 64% (3) 68% (4) 66%
(5) None of these
5. If the distance travelled by Train O is increased by $11\frac{1}{9}$% km on Tuesday, while the time of travelling of Train O on Tuesday is 4 hrs, then find the speed of Train O on Tuesday.
(1) 72 km/hr (2) 90 km/hr
(3) 112.5 km/hr (4) 100 km/hr
(5) None of these
6. Sohan bought a Mobile and a Laptop for ₹ 78,000. He sold the Mobile at a gain of 25% and the Laptop at a loss of 15% and thereby gaining 5% on the whole transaction, then find the cost price of Mobile.
(1) ₹ 39,000 (2) ₹ 34,000 (3) ₹ 30,000
(4) ₹ 38,000 (5) None of these
7. A and B started a business with the investments in the ratio of 5 : 3 respectively. After 6 months from the start of the business, C joined them and the respective ratio between the investments of B and C is 2 : 3. If the annual profit earned by them is ₹ 12,300, what is the difference between B's share and C's share in the profit ?
(1) ₹ 900 (2) ₹ 800 (3) ₹ 600 (4) ₹ 400 (5) ₹ 700
8. A group of 30 men, working 4 hours a day can do a piece of work in 10 days. Find the number of days in which another group of 45 men working 8 hrs a day can do twice the work. Assume that 2 men of the first group do as much work in 2 hours as 4 men of the second group do in 1 hr.
(1) $6\frac{1}{3}$ days (2) $6\frac{2}{3}$ days (3) $5\frac{5}{6}$ days
(4) $3\frac{1}{6}$ days (5) None of these
9. Javed borrowed some money at the rate of 7% per annum for the first three years, 9% per annum for the next six years and 10% per annum for the period beyond nine years. If the total interest paid by him at the end of fifteen years is ₹ 4050, how much money did he borrow?(if simple interest be reckoned)
(1) ₹ 2800 (2) ₹ 3600 (3) ₹ 3000 (4) ₹ 3500
(5) None of these
10. The average marks of 100 students were found to be 40. Later on it was discovered that a score of 53 was misread as 83. Find the correct average corresponding to the correct score.



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's Special

(1) 38.7 (2) 39 (3) 39.7 (4) 41
(5) None of these

Direction (11-15) : In the following question two equations I and II are given. Solve the equations and answer the questions.

Give Answer if

(1) $a > b$ (2) $a \geq b$
(3) $a < b$ (4) $a \leq b$
(5) $a = b$ or the relationship can't be established

11. I. $a(a+7) = 30$ II. $b = \left(\frac{400}{36}\right)^{\frac{1}{2}}$
12. I. $6a^2 - 32a + 42 = 0$
II. $6b^2 + 25b + 21 = 0$
13. I. $5a^{15}\left(a^{-12}\right) = 640$ II. $\frac{1}{24}b^{13} = \frac{1}{192}b^{15}$
14. I. $20a^2 - 108a + 144 = 0$
II. $25b^2 - 90b + 72 = 0$
15. I. $9a^2 + 81a + 162 = 0$
II. $7b^2 - 7b - 84 = 0$

Hints & Solutions

(1-5) :

1. (3) speed of Train L on Monday
$= \frac{245}{3.5} = 70$ km /hr
∴ speed of Train L on Tuesday
= 2 × 75 − 70 = 80 km/hr
∴ Required distance travalled by Train L on tuesday
= 80 × 3.5 = 280 km
2. (1) Required ratio
$= \frac{180}{2.5} : \frac{405}{4.5} = 72 : 90 = 4 : 5$
3. (2) Speed of Train L = $\frac{245}{3.5}$
= 70 km/hr
Speed of Train M = $\frac{180}{2.5}$
= 72 km/hr
Speed of Train N = $\frac{285}{5}$
= 57 km/hr
Speed of Train O = $\frac{405}{4.5}$
= 90 km/hr
Speed of Train P = $\frac{315}{3}$
= 105 km/hr
Required % = $\left(\frac{57}{105}\times 100\right)$%
= 54.28% » 54%
4. (2) Speed of Train M on Monday
= 72 km/hr
Speed of Train M on Tuesday
$= 72 \times \frac{75}{100} = 54$ km/hr
Speed of Train L on Monday
= 70 km/hr
Speed of Train L on Tuesday
$= 70 \times \frac{120}{100} = 84$ km/hr
Required% = $\left(\frac{54}{89}\times 100\right)$%
= 64.28% » 64%
5. (3) Distance travelled by Train O on Tuesday
$= 405 \times \frac{1000}{9\times 100} = 450$ km
Required Speed
$= \frac{450}{4} = 112.5$ km/hr
6. (1) By Alligation method

Mobile + 25%		Laptop − 15%
	+5%	
[5−(−15)] = 20%		[25 −5)] = 20%

Required ratio = 1 : 1
C.P of mobile = $\frac{78000}{2} \times 1$
= ₹ 39,000
7. (1) A : B = 5 : 3 = 10 : 6
B : C = 2 : 3 = 6 : 9
A : B : C = 10 : 6 : 9
Ratio of profit
= 10 × 12 : 6 × 12 : 9 × 6
= 20 : 12 : 9
Required difference = $\frac{12300}{41} \times 3$
= ₹ 900
8. (2) Let in first group a man can do x unit in 1 hr and in second group a man can do y unit in 1 hr.
ATQ,
$z \times x \times 2 = 4 \times y \times 1$
$\Rightarrow x = y$
2 × 30 × 4 × 10 = 45 × 8 × d
(Here d = days)
$d = \frac{2\times 30\times 4\times 10}{45\times 8}$
$= 6\frac{2}{3}$ day
9. (3) Let the borrowed sum be ₹ x.
ATQ, $\frac{x\times 7\times 3}{100} + \frac{5\times 9\times 6}{100} + \frac{5\times 10\times 6}{100}$
= 4050
$\Rightarrow 0.21x + 0.54x + 0.60x = 4050$
$\Rightarrow x = \frac{4050}{1.35} =$ ₹ 3,000
10. (3) Average marks of 100 students = 40
Total marks = 40 × 100 = 4000
Required correct average
$= \frac{4000-(83-53)}{100} = \frac{3970}{100} = 39.7$

(11-15):

11. (3) I. $a(a+7) = 30$
$\Rightarrow a^2 + 7a - 30 = 0$
$\Rightarrow a^2 + 10a - 3a - 30 = 0$
$\Rightarrow a(a+10) - 3(a+10) = 0$
$\Rightarrow (a-3)(a+10) = 0$
$\Rightarrow a = 3, -10$
II. $b = \left(\frac{400}{36}\right)^{\frac{1}{2}}$
$\Rightarrow b = \frac{20}{6} = \frac{10}{3}$
Clearly, $a < b$
12. (1) I. $6a^2 - 32a + 42 = 0$
$\Rightarrow 6a^2 - 18a - 14a + 42 = 0$
$\Rightarrow 6a(a-3) - 14(a-3) = 0$
$\Rightarrow (6a-14)(a-3) = 0$
$\Rightarrow a = \frac{14}{6}, 3$
II. $6b^2 + 25b + 21 = 0$
$\Rightarrow 6b^2 + 18b + 7b + 21 = 0$
$\Rightarrow 6b(b+3) + 7(b+3) = 0$
$\Rightarrow (6b+7)(b+3) = 0$
$\Rightarrow b = \frac{-7}{6}, -3$ clearly $a > b$
13. (4) I. $5a^{15}(a^{-12}) = 640$
$\Rightarrow a^{15} \times a^{-12} = \frac{640}{5}$
$\Rightarrow a^3 = 128 \Rightarrow a = 4\sqrt{2}$
II. $\frac{1}{24}b^{13} = \frac{1}{142}b^{15}$
$\Rightarrow \frac{b^{15}}{b^{13}} = \frac{192}{24} \Rightarrow b^2 = 8$
$\Rightarrow b = +2\sqrt{2}, -2\sqrt{2}$
Clearly, $a > b$
14. (2) I. $20a^2 - 108a + 144 = 0$
$\Rightarrow 5a^2 - 27a + 36 = 0$
$\Rightarrow 5a^2 - 15a - 12a + 36 = 0$
$\Rightarrow 5a(a-3) - 12(a-3) = 0$
$\Rightarrow (5a-12)(a-3) = 0$
$\Rightarrow a = \frac{12}{5}, 3$
II. $25b^2 - 90b + 72 = 0$
$\Rightarrow 25b^2 - 60b - 30b + 72 = 0$
$\Rightarrow 5b(5b-12) - 6(5b-12) = 0$
$\Rightarrow (5b-6)(5b-12) = 0$
$\Rightarrow b = \frac{6}{5}, \frac{12}{5}$
Clearly = $a \geq b$
15. (4) I. $9a^2 + 81a + 162 = 0$
$\Rightarrow 9a^2 + 54a + 27a + 162 = 0$
$\Rightarrow 9a(a+6) + 27(a+b) = 0$
$\Rightarrow (9a+27)(a+6) = 0$
$\Rightarrow a = -\frac{27}{9}, -6 = -3, -6$
II. $7b^2 - 7b - 84 = 0$
$\Rightarrow b^2 - b - 12 = 0$
$\Rightarrow b^2 - 4b + 3b - 12 = 0$
$\Rightarrow b(b-4) + 3(b-4) = 0$
$\Rightarrow (b+3)(b-4) = 0$
$\Rightarrow b = -3, 4$
Clearly, $a \leq b$

అడ్మిషన్స్

ఎన్ఐఇఎల్ఐటి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ ఐఇఎల్ఐటి)- కింది కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: పీజీ డిప్లొమా(క్లౌడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ)
కాల వ్యవధి: 24 వారాలు
కోర్సుల ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి
కోర్సు: జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా
విభాగం: బిగ్ డేటా అనలిటిక్స్
కాల వ్యవధి: 16 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి
విభాగాలు: ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1/ ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్/ జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్
కాల వ్యవధి: 12 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 11 నుంచి
వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

కాకతీయ విశ్వవిద్యాలయం

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్యా కేంద్రం- **డిగ్రీ కోర్సుల్లో** ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: బిఏ/ బికాం(జనరల్/ కంప్యూటర్స్)
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు డైరెక్ట్ అడ్మిషన్ ఉంటుంది. ఎటువంటి విద్యార్హత లేని అభ్యర్థులు యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది.
వయసు: 18 ఏళ్లు నిండి ఉండాలి
యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష: సెప్టెంబరు 10
దరఖాస్తు ఫీజు: రూ.200
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్ లోడ్ చేసుకొని నింపి దగ్గరలోని స్టడీ సెంటర్‌లో సమర్పించాలి.
దరఖాస్తు చేరడానికి ఆఖరు తేదీ: సెప్టెంబరు 1
వెబ్‌సైట్: www.sdlceku.co.in

ఐఐఎఫ్‌టి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి)- ఎంబిఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు వ్యవధి: రెండేళ్లు
క్యాంపస్‌లు: న్యూఢిల్లీ, కోల్‌కతా, కాకినాడ (ఆంధ్రప్రదేశ్)
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మూడేళ్ల డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఆఖరు ఏడాది చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
ఎంపిక: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, రైటింగ్ స్కిల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విదేశీ అభ్యర్థులకు జిమ్యాట్ స్కోరు, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశం కల్పిస్తారు.
రాత పరీక్ష: నవంబరు 26న
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 8
విదేశీ విద్యార్థులు జిమ్యాట్ స్కోరు సబ్మిట్ చేసేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 15
వెబ్‌సైట్: www.iift.edu

ఉద్యోగాలు

ఎన్ఐఇపిఐడి

నెల్లూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చ్యువల్ డిజెబిలిటీస్(ఎన్ ఐఇపిఐడి)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్స్(మెడికల్ పిఎంఆర్/ స్పెషల్ ఎడ్యుకేషన్), ప్రోస్థటిస్ట్& ఆర్థోటిస్ట్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, అకౌంటెంట్, ఓరియంటేషన్ & మొబైల్ ఇన్‌స్ట్రక్టర్
దరఖాస్తు సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.niepid.nic.in

ఈ పాస్ ద్వారానే ఎరువులు పంపిణీ



చిట్వేలి : మండలంలోని రైతులకు బుధవారం నుంచి ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువుల పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలో ఉన్న 5ఎరువుల దుకాణాలకు ఇప్పటికే ఈ పాస్‌యంత్రాలను అందజేసినట్లు ఏవో తెలిపారు. మన గ్రోమోర్ దుకాణంలో ఈ పాస్ విధానం ద్వారా ఎరువుల పంపిణీని బుధవారం లాంచనంగా ప్రారంభించారు. ఎరువులు అవసరమైన రైతులు ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి ఈ విధానం ద్వారా అసలు ధరలకే ఎరువులు పొందవచ్చన్నారు.

ఉరుస్తున్న గ్రామపంచాయతీ భవనం

● ఆదాయం ఉన్నా పట్టించుకోని పాలకులు ● పాడవుతున్న రికార్డులు ఆందోళనలో అధికారులు, సిబ్బంది

రైల్వేకోడూరు: నియోజకవర్గంలోనే రైల్వేకోడూరు మేజర్ గ్రామ పంచాయతీ. 2011 జనాభా లెక్కలప్రకారం ఇక్కడ 32,725 మంది జనాభా ఉన్నారు. ఆదాయంకూడా ఎక్కువగానే వస్తుంది. పంచాయతీలో మొత్తం 20వార్డులున్నాయి. తాగునీరు, ఇంటిపన్ను, స్టాంపుడ్యూటీలు తదితర వాటి ద్వారా పంచాయతీకి పుష్కలంగా నిధులందుతున్నాయి. ఇదికాకుండా 13,14వ ఆర్థికసంఘం నిధులొస్తుంటాయి. అయితే అన్నీ ఉన్నా అల్లుడినోట్లో.. అనే సామెతలాగా పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబుకమ్ములు బయటకు వచ్చి దర్శనమిస్తున్నాయి. భవనం ఎప్పుడు కూలుతుందోనని అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. దీనిగురించి గ్రామ పంచాయతీ పాలకులు కాని ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...పంచాయతీకి నీటిపన్ను రూపంలో రూ.5లక్షలు, ఇంటిపన్ను రూపంలో రూ.33లక్షలు, స్టాంప్‌డ్యూటీ రూ.16లక్షలు, లైసెన్సుద్వారా రూ.1.30లక్షలు, బిల్డింగ్ ఫీజు ద్వారా రూ.2.5లక్షలు తదితరాలు ఆదాయంగా వస్తున్నాయి. అయితే పంచాయతీ కార్యాలయం దెబ్బతినడంతో కార్యాలయంలోని చాలా రికార్డులు పాడౌతున్నాయి. దీంతో అధికారులు తీవ్రఇబ్బందులుపడుతున్నారు. రికార్డులు దాచిపెట్టడానికి వీలులేకుండా పోతుందని భవనాల పైకప్పు పెచ్చులూడుతున్నాయి. రోడ్డుకు తగ్గుగా ఉండడంతో వర్షాకాలంలో వర్షపునీరు లోపలికి ప్రవేశిస్తోందని సిబ్బంది వాపోతున్నారు. గతేడాది డిసెంబర్‌లో కురిసిన భారీవర్షాలకు పంచాయతీభవనాల్లోకి వర్షపునీరు రావడంతో అధికారులు, సిబ్బందితో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పరిస్థితిని స్వయంగా ప్రజాప్రతినిధులు పరిశీలించినా ఫలితంలేదని ప్రజలు అంటున్నారు. సుమారు 20సెంట్ల స్థలంలో కార్యాలయాలు ఉన్నాయి. సభాభవనంకూడా అంతంతమాత్రంగానే ఉంది. కార్యాలయం కూడా అధికారులకు సరిపోవడంలేదని సిబ్బంది అంటున్నారు. మండలపరిషత్, తహసీల్దార్ తదితర కార్యాలయాలు అన్నివసతులతో ఉన్నాయి. నూతనంగానే నిర్మించారు. అయితే పంచాయతీలో ఆదాయం కోట్లువస్తున్నా కార్యాలయాలకోసం నిధులు కేటాయించడంలో విఫలమౌతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రూ.కోటి నిధులు కేటాయిస్తే భవనాలు సుందరంగా తయారు చేసుకోవచ్చనని ప్రజలు అంటున్నారు.



రైల్వేకోడూరులోని పంచాయతీ భవనం



భవనంలో స్లాబుకమ్ములు లేచినదృశ్యం

గ్రామకార్యదర్శి ఏమంటున్నారంటే

కోడూరు గ్రామకార్యదర్శి శివశంకర్‌రాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రెండు సంవత్సరాలక్రితం రూ.1.20కోట్లతో భవనాలనిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపాం. గతంలో కురిసినభారీవర్షాలకు రికార్డులు తడిసిపోయాయని, పైపెచ్చులూడుతున్నాయన్నారు. త్వరలో మున్సిపాలిటీ అవుతుందని అప్పుడు కొత్తభవనాలు వస్తాయని ఆయన వివరించారు.

రూ.1.72లక్షలతో పంట పొలాలకు లింక్‌రోడ్లు



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయుడు

పుల్లంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని 5మండలాల్లో 1.72లక్షలతో రైతులు పంటను మార్కెట్‌కు సులభంగా తరలించుకునేందుకు పంట పొలాలకు లింక్‌రోడ్లను వేయనున్నట్లు రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు పేర్కొన్నారు. బుధవారం పుత్తనవారిపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 52లక్షల రూపాయలతో ఉపాధి హామీతో పంట పొలాలకు రోడ్లు వేసేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. రూ.1.20 కోట్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. వచ్చే నెలలో ఈ రోడ్లకు కూడా అనుమతి వస్తుందన్నారు. నియోజకవర్గంలోని 5మండలాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి 1500 పశువులకు చికిత్సలు, 1000గొర్రెలకు, మేకలకు టీకాలు వేయడం జరిగిందన్నారు. రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. గత ఏడాది రూ.1.40కోట్లు పన్నులు వసూలు చేయాలని లక్ష్యం ఉండగా రూ.1.52కోట్లు రాబట్టామన్నారు. ఈ ఏడాది రూ.1.55కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించగా నాలుగు నెలలకే రూ.1.13కోట్లు రాబట్టడం జరిగిందన్నారు. మరో రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులలో మౌలిక వసతులు కల్పించి ఆధునీకరించేందుకు కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు.

పోలీసుల అదుపులో ఎర్ర స్మగ్లర్..?

పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీకి చెందిన ఓ ఎర్రచందనం స్మగ్లర్ పుల్లంపేట పోలీసు అదుపులో ఉన్నట్లు సమాచారం. మంగళవారం రాత్రి ఇతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ స్మగ్లర్ కొల్లంగంగిరెడ్డికి ముఖ్యఅనుచరుడు కావడం ఎప్పటి నుంచో పోలీసులు కన్నుగప్పి తప్పించుకుంటూ వచ్చాడు. మంగళవారం ఎట్టకేలకు పోలీసులు వలపన్ని అతడిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన స్మగ్లర్‌కొల్లం గంగిరెడ్డికి అత్యంత ముఖ్యమైన అనుచరుడు కావడం, మండలంలో పలువురికి అతనితో సంబంధాలు ఉండటంతో ఇప్పటికే కొందరిలో వణుకుపుడుతోంది. పట్టుబడిన స్మగ్లర్ నుంచి ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి, ఎవరెవరు ఫోన్ చేశారు అనే విషయాలను ఇప్పటికే రాబట్టినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం తమిళ కూలీలు వత్తలూరు అడవుల్లో చొరబడటం, ఎస్ఆర్‌పాలెం చెక్‌పోస్టు వద్ద దొంగలు పట్టుబడటం చూస్తే ఈ ప్రాంతంలో స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతుందని తెలుస్తోంది. పోలీసులు ఎంత నిఘా పెట్టినా స్మగ్లర్ మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నారు. గతంలో స్మగ్లర్లకు సహకరించిన కొందరు వ్యక్తులు దర్జాగా తిరుగుతుండటం వల్లే స్మగ్లింగ్ కావడం లేదని విమర్శలున్నాయి. గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు ఎవరెవరు సహకరిస్తున్నారు, వారందరి పేర్లు ప్రస్తుతం కొల్లం గంగిరెడ్డి ముఖ్య అనుచరుడు పట్టుబడటంతో తెలిసే అవకాశం ఉంది.

పోలీసుల అదుపులో తమిళతంబీలు?

రైల్వేకోడూరు: పోలీసుల అదుపులో తమిళఎర్రకూలీలు సుమారుగా 20మంది ఉన్నట్లు సమాచారం. ఇటీవల పోలీసులు, టాస్క్‌ఫోర్సు, అటవీశాఖాధికారులు వేర్వేరుగా ముమ్మరంగా తనిఖీలుచేశారు. తమిళకూలీలు కొన్నిరోజులుగా అడవిలో మకాం పెట్టినట్లు పోలీసులు గుర్తించారని, వారిని బాలపల్లెచెక్‌పోస్టువద్ద పట్టుకునిఎర్రచందనందుంగలు కూడా స్వాధీనంచేసుకున్నట్లు తెలిసింది. ముమ్మరంగా పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. జిల్లాస్థాయి అధికారులు ఆదేశాలమేరకు తమిళకూలీలను రహస్యంగా ప్రాంతంలో పెట్టి బుధవారం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిసింది.

సినిమాగైడ్

రైల్వేకోడూరు

లక్ష్మీప్యారడైజ్:నిన్నుకోరి
సిద్దేశ్వర : ఫిదా
ఏఎస్ఆర్ :వాసుకి
శ్రీకృష్ణ : గౌతంనంద
లవ: దువ్వాడజగన్నాథం(డీజే)

10న ఇంటర్వ్యూలు

చిట్వేలి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో మస్తాన్ వలీ తెలిపారు. ఆన్‌లైన్‌లో దర ఖాస్తులు చేసుకున్న వారు ఉదయం 10.30గంటలకు సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

మద్యం దుకాణదారులమధ్య వివాదం





ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనచేస్తున్న బాబు, పోలీసులకు వివరాలు తెలుపుతున్న దృశ్యం

రైల్వేకోడూరు: పట్టణంలో మద్యందుకాణాలపై రాజకీయజోక్యం ఎక్కువైంది. ఒత్తిడి తట్టుకోలేని అధికారులు చేతులెత్తేస్తున్నారు. రెండు మద్యందుకాణాలదారులమధ్య వివాదం బుధవారం తారాస్థాయికి చేరుకుంది. మద్యందుకాణం నిర్వహిస్తున్న బాబు ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఎదురుగా తమకు న్యాయంచేయాలని డిమాండుచేస్తు అర్ధనగ్నంగా ప్రదర్శన చేశాడు. బాధితుడి కథనం మేరకు...రైల్వేకోడూరు పట్టణంలోని బస్టాండుకు సమీపంలో మొదట ఒక్క మద్యందుకాణాన్ని లైసెన్సుదారుడు పండ్రాసురేష్ ఏర్పాటుచేశారు. తర్వాత సుగావాసిబాబు మరొకటి ఏర్పాటుచేసుకున్నారు. బాబు మద్యం దుకాణం కంటే ముందుకు సురేష్ దుకాణం జరుపుకుంటున్నాడని స్థానిక ఎక్సైజ్‌శాఖాధికారి శివసాగర్‌కు విన్నవించాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరింది. చివరకు ఎక్సైజ్‌శాఖాధికారులవద్ద పంచాయితీ వెళ్లింది. అధికారులు మాత్రం చట్టప్రకారంగానే దుకాణాలు ఏర్పాటుచేస్తున్నామని, ఎలాంటి ఒత్తుడులులేవని తెలిపారు.

మామిడిలో కొమ్మల కత్తిరింపులతో అధిక దిగుబడులు

పుల్లంపేట : మామిడి తోటలను సాగు చేసిన రైతులు సకాలంలో కొమ్మలను కత్తిరించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారి రేణుకాప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పుత్తనవారిపల్లెలో విజయమోహన్ రెడ్డి మామిడితోటలో కొమ్మలు కత్తిరించడంలో ఆయన మెళుకువలను తెలియజేశారు. కొమ్మల కత్తిరింపులకు సరైన పద్ధతిలో చేపడితే లాభాలు పొందవచ్చునన్నారు. మామిడిలో వచ్చే బూజు తెగులు నివారణకు ఒక లీటర్ నీటిలో రెండు గ్రాముల అసిటేట్‌ను లేదా ఒక లీటర్ నీటిలో ఒక ఎంఎల్ డైక్లోరోవాస్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి విష్ణుపాల్గొన్నారు.

కువైట్‌లో ఓబులవారిపల్లె వాసి మృతి



మురళీక్రిష్ణ (ఫైల్‌ఫొటో)

కడప, ఎర్రముక్కపల్లె : రైల్వేకోడూరు ఓబులవారిపల్లెకు చెందిన టి.మురళీక్రిష్ణ కువైట్‌లో మృతి చెందారు. మృతదేహాన్ని భారత్‌కు పంపించేందుకు కువైట్‌కు చెందిన వైఎస్ఆర్‌సీపీ సేవాదళ్ ఇన్‌ చార్జి గోవిందరాజు భారత్ రాయబారి కార్యాలయంలో ఇమిగ్రేషన్ పనులు పూర్తి చేసి భారత్‌కు తరలించే ఏర్పాటు చేసినట్లు గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ తెలిపారు. మృతదేహాన్ని చెన్నై నుంచి స్వగ్రామానికి తరలించేందుకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే కువైట్‌లో మృతదేహానికి వైఎస్ఆర్‌సీపీ సభ్యులు సందర్శించి నివాళులర్పించారు.

అంగన్ వాడీ సెంటర్లు కుదింపు వద్దు



రాజంపేటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సిద్దవటం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాజంపేట టౌన్ : అంగన్ వాడీలను లక్ష్యానికి విరుద్ధంగా మున్సిపల్ పట్టణాల్లో 3126అంగన్ వాడీ సెంటర్లను 1026సెంటర్లుగా కుదించాలన్న నిర్ణయం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ సమక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్, అంగన్ వాడీ యూనియన్ నాయకురాళ్ళు మాట్లాడుతూ అంగన్ వాడీ సెంటర్లు కుదించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అంగన్ వాడీ సెంటర్లలో కేవలం ఫ్రీస్కూల్స్ కోసం ఏర్పాటు చేశారని, ఫ్రీస్కూల్స్‌తో పాటు ఆ సెంటర్ పరిధిలో పిల్లలు బడికి అలవాటు చేయడానికి అనేక సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్ళు ఎన్ .శంకరమ్మ, ఎస్.అమరావతి, ఎం.ఈశ్వరమ్మ, ఎం.విజయ, టి.శ్యామల, వీఆర్వే సంఘం మండలాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సభ్యులు శివయ్య, ప్రకాష్, నరసింహులు, నరసింహ అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కార్యకర్తల సమస్యలపై నిరసన

సిద్దవటం : సిద్దవటం ప్రాజెక్టు పరిధిలోనున్న ఒంటిమిట్ట సిద్దవటం అంగన్ వాడీ కార్యకర్తల సమస్యలపై బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్ వాడీ కార్యర్తలు నిరసన తెలుపుతూ జూలై 1వ తేదీ నుంచి అన్న అమృత హస్తం ప్రారంభమైందని, గర్భవతులు, బాలింతలు, అంగన్ వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయడం లేదన్నారు. రేషన్ సక్రమంగా లేనందున ఎవరు భోజనానికి అంగీకరించడం లేదన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలకు మే, జూన్ , జూలై నెలలకు సంబందించి గౌరవ వేతనం, టీఏ, డీఏలు ఆగస్టు 2016 నుంచి 2017సంవత్సరం జూన్ నెల వరకు మంజూరు కాలేదన్నారు. సంబందిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

నేడు ఆలయ భూముల వేలం పాట

పెనగలూరు : పెనగలూరు దేవాలయాలకు సంబందించిన భూములకు గురువారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కౌలుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పెనగలూరు మండల దేవాదాయ శాఖ ఇన్ చార్జి ఎ.శ్రీనివాసులు తెలిపారు. పెనగలూరులోని వేణుగోపాలస్వామి, నందీశ్వరుడు, కోదండరామస్వామి, రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, యల్లమ్మ దేవస్థానాలకు సంబందించిన భూములకు వేలం పాట నిర్వహించనున్నామన్నారు. వేణుగోపాలస్వామి దేవాలయానికి సంబందించిన 13సర్వేనెంబర్లలో 9.44ఎకరాల భూములను వేలంపాట నిర్వహిస్తామన్నారు. అలాగే నందీశ్వరస్వామి దేవాలయానికి సంబందించిన 5సర్వేనెంబర్లలో 3.73ఎకరాలు వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే పుల్లంపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబందించిన పెనగలూరు గ్రామంలోని మూడు సర్వే నెంబర్లలో 3.16ఎకరాల భూములను కూడా వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. రామలింగేశ్వరస్వామికి సంబందించిన 515సర్వేనెంబర్ 82సెంట్లు, కోదండరామస్వామి దేవాలయానికి సంబందించిన రెండు సర్వేనెంబర్లలో 89సెంట్లు, అలాగే యల్లమ్మ దేవాలయానికి సంబందించిన 47సెంట్ల భూమిని కూడా వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఉర్దూస్కూలు తనిఖీ చేసిన ఎంఈఓ

రైల్వేకోడూరు: స్థానిక కొత్తబజారువీధిలో ఉన్న ఉర్దూస్కూలును బుధవారం స్థానిక విద్యాశాఖాధికారి పోతురాజురామయ్య తనిఖీచేశారు. తనిఖీల్లో మూడురోజులుగా పిల్లలు స్కూలుకు రావడంలేదని ఆయన మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉర్దూస్కూలులో 10మంది ముస్లింపిల్లలు ఉన్నారని, మూడురోజులుగా స్కూలుకు రావడంలేదని, పాఠశాల ఉపాధ్యాయురాలు జబీరున్నీసా అధికారికి తెలిపింది. విద్యాశాఖాధికారి ఆరాతీశారు. రంగనాయకులపేట, రాఘవరాజపరం ప్రాంతాల్లో ఉన్న మదరసల్లో ముస్లింపిల్లలు వెళుతున్నారని ఉర్దూస్కూలు ఉపాధ్యాయురాలు తెలిపిందన్నారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ఉన్న మదరసలకు ప్రభుత్వం అనుమతిలేదన్నారు. వాటిపై చర్యలు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని, ఉర్దూస్కూలు ఉపాధ్యాయురాలును ఎక్కడికైనా బదిలీచేయాలని జిల్లావిద్యాశాఖాధికారులకు నివేదికలు పంపుతామని మండలవిద్యాశాఖాధికారి తెలిపారు.

ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకోవాలి

నందలూరు : అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ గృహాల కోసం ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో మల్లీశ్వరి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దీని కోసం గురువారం నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 3వ తేదీ ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఎర్రచెరువుపల్లె గ్రామ పంచాయతీకి సంబందించి, మధ్యాహ్నం 2గంటల నుంచి నల్లతిమ్మయ్యగారిపల్లె ప్రాధమికోన్నత పాఠశాలలో 4 తేదీ ఉదయం లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మధ్యాహ్నం టి.వి.పురం ప్రాధమిక పాఠశాల, 5న ఉదయం పొత్తపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మధ్యాహ్నం నూకినేనిపల్లె ప్రాధమికోన్నత పాఠశాల, 8న ఉదయం టంగుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయం లో మధ్యాహ్నం కుందానెల్లూరు ప్రాధమిక పాఠశాల, 9న ఆడపూరు ప్రాధమిక పాఠశాల, నందలూరు షాదీఖానా, 10న పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

మీజిల్స్, రూబెల్లా వ్యాధుల

నివారణకు టీకా తప్పనిసరి

ఆంధ్రజ్యోతితో ప్రభుత్వాస్పత్రి వైద్య విస్తరణాధికారి ఎస్ఎస్ దాస్, సెల్‌నెం.9440941263



ఇంటర్వ్యూ

రైల్వేకోడూరు: మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పక వేయించుకోవాలని రైల్వే కోడూరు ప్రభుత్వాస్పత్రి వైద్య ఆరోగ్యవిస్తరణాధికారి ఎస్ఎస్‌దాస్ తెలిపారు. అనాఫిలిస్ ఆడదోమలవల్ల మలేరియా జ్వరాలు వస్తాయని ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. మలేరియా జ్వరానికి సకాలంలో చికిత్సలు చేయించుకుంటే నయం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో మలేరియా జ్వరాలకు మందులున్నాయని గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రశ్న: మీజిల్స్, రూబెల్లా వ్యాధి లక్షణాలెలాఉంటాయి?

జవాబు: ఈవ్యాధులు వైరస్‌వల్ల వస్తాయి. శరీరంపై దద్దుర్లు, జ్వరం, జలుబు, దగ్గు, కళ్లుఎర్రబారడం ఉంటాయి. వెంటనే వైద్యులను సంప్రదించి వ్యాక్సిన్‌వేయించుకోవాలి. మీజిల్స్ వ్యాధి అంటే న్యుమోనియా, అతిసారం, ఇతర ప్రాణాంతకరమైన సమస్యలు ఉంటాయి. రూబెల్లాఅంటే అంధత్వం, వినికిడిలోపాలు, బుద్ధిమాంద్యం, పుట్టుకతోనే గుండె సంబంధింత వ్యాధులు వస్తాయన్నారు.

ప్రశ్న: మీజిల్స్, రూబెల్లా వ్యాధులపై అవగాహనకల్పిస్తున్నారా?

జవాబు: స్కూల్సు, గ్రామీణప్రాంతాల విద్యార్థులకు, అధికారులకు, అంగన్వాడీకార్యాకర్తలకు, ఆశావర్కర్లుకు తదితరులకు అవగాహనకల్పించాం. 9నెలలబిడ్డనుంచి 15ఏళ్లవయస్సు కలిగిన వారు ఎంఆర్ వ్యాక్సిన్‌వేయించుకోవాలి.

ప్రశ్న: మలేరియాలో ఎన్నిరకాలు ఉన్నాయి?

జవాబు: మలేరియా, ఓవెల్, లైవాక్స్, ఫాల్సిఫారం ఉన్నా యి. రైల్వేకోడూరు ప్రాంతంలో మాత్రం లైవాక్, ఫాల్సిఫారమ్ మాత్రమే ఉన్నాయి.

ప్రశ్న: వ్యాధినివారణ ఎలాచేస్తారు?

జవాబు: ఆరోగ్యసిబ్బంది ద్వారా మాస్టర్‌ప్లాన్‌తో లైవాక్స్‌కు ప్రైమాక్విన్ అనేమందును 14రోజులపాటు ఉపయోగిస్తే నయమౌతుంది. ఫాల్సిఫారమ్ వస్తే 3రోజులపాటు ఏసీటీ మందులు ఉపయోగించితే నయమవుతుంది.

ప్రశ్న: గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేకచర్యలుతీసుకుంటున్నారా?

జవాబు: పైరత్నం, అబేట్, డీడీటీ అనేమందులు మురికి ప్రాంతాల్లో స్ప్రేచేయించి లార్వాలను చంపివేయడం జరుగుతుంది.

ప్రశ్న: ప్రజలకు అవగహనాలు కల్పిస్తున్నారా?

జవాబు: ప్రతిఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు దోమతెరలు ఉపయోగించాలి. ఇంటిపరిసరాల పరిశుభ్రత పాటించాలని చెబుతున్నాం.

ప్రశ్న: డ్రైడేపాటిస్తున్నారా?

జవాబు: ప్రతిశుక్రవారం డ్రైడేపాటిస్తున్నాం. ముందుజాగ్రత్తచర్యగా జ్వరాలు వచ్చినవారికి రక్తపూతలు సేకరించి వ్యాధినిర్ధారణ చేస్తాం.

ప్రశ్న: మలేరియావ్యాధి ఎంతమందికి వచ్చింది?

జవాబు: 2016లో 45మందికి మలేరియా జ్వరాలు రావడంతో వైద్యసేవలు అందించి నయంచేశాం.

పెనగలూరులో 47.3మి.మీ. వర్షపాతం



ఇండ్లూరు సజ్జచేనులో నిలచి ఉన్నవర్షపు నీరు

పెనగలూరు : మండలంలో భారీ వర్షం కురిసింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 47.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఇదిఇలా ఉండగా వర్షాన్ని నమ్ముకొని ఆరుతడి పంటలు పెట్టినరైతులకు ఈ వర్షం ఎంతో ఊరటకలిగించింది. సుమారు రెండు నెలల నుంచి మండలంలో వర్షం కురిసినప్పుడల్లా ఎక్కువ మోతాదులో సజ్జ పంటను సాగు చేశారు. ఈ పంట వర్షం పదునుల ఆధారంగా సాగుచేయడంతో కొన్ని చోట్ల రెండు నెలలు, మరికొన్ని చోట్ల ఒకటిన్నర్ర నెల, కొన్ని చోట్ల నెల, మరికొన్ని ప్రాంతాల్లో 20, 10 రోజుల పైర్లుగా ఉన్నాయి. ఇక ఈ వారంలో కానీ వర్షాలు కురవకపోతే పెట్టిన పంటలు పశుగ్రాసానికి కూడా పనికిరావు అనుకుంటున్న తరుణంలో మంగళవారం కురిసిన భారీ వర్షం అన్ని రకాల పైర్లకు, పండ్లతోటలకు ఎంతో మేలు చేసింది. మండల కేంద్రంతో పాటు నారాయణనెల్లూరు, ఓబిలి, సిద్దవరం, ఇండ్లూరు, సాతుపల్లె, వెలగచెర్ల, కొండూరు, ఈటుమాపురం, దామనచెర్ల గ్రామాల్లో భారీ వర్షం నమోదైంది. ఏదేమైనప్పటికీ భారీ వర్షం వల్ల రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూలీలను పెంచి లక్ష్యాలు పూర్తి చేయాలి

రైల్వేకోడూరురూరల్ : గ్రామీణ ప్రాంతాలలో వివిధ అభివృద్ధిపనులు చేపట్టి కూలీల సంఖ్యను పెంచి ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీడి వర ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధిహామీపథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర సహాయకులకు ఇచ్చిన లక్ష్యాలను అధిక మించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామాంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్ల్ గోపాల క్రిష్ణారెడ్డి, గోవింద్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పల్స్ సర్వేలో వివరాలు సమోదు చేసుకోండి

రైల్వేకోడూరురూరల్ : ఇటీవల నిర్వమించిన పల్స్ సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారి కుటుంబవివరాలను ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో నమోదు చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో సంజీవరావు సూచించారు. బుధవారం మండలంలోని అనంతరాజుపేట, బొజ్జవారిపల్లె, ఉర్లగట్టుపోడు గ్రామాల్లో యంపీడీవో సంజీవరావు ఆధ్వర్యంలో ఓ బృందం, అదేవిధంగా తహసీల్దారు చెంగ్రాయుడు, హౌశింగ్ శాఖ ఏఈల ఆధ్వర్యంలో మరో బృందం మండలంలోని ఓబనపల్లె, చియ్యవరం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 9



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ప్రియతములతో చర్చలు, ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. సన్నిహితుల నుంచి మెయిల్స్, సందేశాలు అందుకుంటారు. పొదుపు పథకాలు, పెట్టుబడులకు ప్రణాళికలు రూపొందిస్తారు. విద్యార్థులకు శుభప్రదం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. గతించిన వ్యక్తులను స్మరించుకుంటారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి అనుకూలం.



మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. వేడుకల్లో పాల్గొంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు ఫలిస్తాయి. కొత్త స్నేహాలు, పరిచయాలు ఆనందం కలిగిస్తాయి.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): పరిశ్రమలు, వ్యవసాయరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆస్పత్రులు, హోటల్, ఔషధ రంగా వారు లాభాలు ఆర్జిస్తారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం లభిస్తుంది.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. చిన్నారుల విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. సాంకేతిక కోర్సుల్లో చేరే వారికి అనుకూల సమయం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): నిత్యావసరాలు, నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాల వారికి ప్రోత్సహకరం. కుటుంబ వ్యవహారాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. సంస్మరణల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో ఇల్లు సందడిగా ఉంటుంది.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతములతో చర్చలు, ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. పెట్టుబడులకు సంబంధించి కీలక సమాచారం సేకరిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, ఉద్యోగాల్లో ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. అదనపు సౌకర్యాలు అందుకుంటారు. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లకు అవకాశం ఉంది. శ్రమకు తగిన ప్రతిఫలం అందుకుంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): లక్ష్య సాధన కోసం కొత్త పథకాలు రూపొందిస్తారు. సమావేశాలు, బృందకార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఉన్నత విద్యా విషయాల్లో ఒక నిర్ణయానికి వస్తారు. వేడుకల్లో పాల్గొంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): స్నేహానుబంధాలు బలపడతాయి. బంధుమిత్రులతో వేడుకల్లో ఉల్లాసంగా గడుపుతారు. పెట్టుబడులు లాభిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోళ్లు చేస్తారు. లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వైద్యం, హోటల్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాల వారికి ప్రోత్సాహకరం. ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మహిళా హక్కులను కాలరాయవద్దు

బాలురతో సమానంగా బాలికలను చూడండి ● మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను

కడప, అర్బన్ : మహిళల హక్కులను కాలరాయవద్దని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బాను అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై వివక్ష కుటుంబంలో నుంచే మొదలవుతున్నారన్నారు. తల్లిదండ్రులు బాలురతో సమానంగా బాలికలను చూడాలని పిలుపునిచ్చారు. కాగా బుధవారం ఆర్ట్సుకాలేజీ, మహిళా డిగ్రీ కళాశాల ఉజ్వల, స్వధార్ హోమ్‌లను పరిశీలించి అక్కడ ఆశ్రమం పొందుతున్న వృద్ధురాళ్లతో వారి పరిస్థితులను ఆరాతీశామన్నారు. ఆర్తీహోమ్‌ను పరిశీలించామని అక్కడ ఆడపిల్లలకు, మగ పిల్లలకు వేరు వేరు ఆశ్రమం కలిగించమన్నారు. కడప పర్యటనలో అన్ని చోట్ల అన్ని రకాలుగా సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారు. అన్న అమృతహస్తం పథకం ద్వారా గర్భిణీలకు, బాలింతల సౌకర్యార్థం టేబుళ్లు వేసి వారికి పౌష్టికాహారం అందించడం ఆనందదాయకమన్నారు. అదే చిత్తూరులో గర్భిణీలకు కిందకూర్చోబెట్టి భోజనం అందిస్తున్నారని చాలా ఇబ్బందిగా వుందని గర్భిణీల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్ చార్జి మమత, ఏపీడీ శ్రీదేవి, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లెలశ్రీవాణి, డీసీపీవో శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను

స్టెప్ ఆధ్వర్యంలో లోగో పోటీలు

కడప, ప్రకాష్‌నగర్ : ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టెప్ ఆధ్వర్యంలో లోగో తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈవో మమత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15నుంచి 29 సంవత్సరాలలోపు ఔత్సాహిక యువతీ యువకులు, యూత్ క్లబ్ మెంబర్లు ఎన్ జీవోలు ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, లోగోలను తయారుచేసి పంపాలన్నారు. అలాగే వాటితో పాటు వ్యక్తిగత బయోడేటాను జతచేసి స్టెప్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కార్యాలయానికి, డీబ్లాక్ కొత్త కలెక్టరేట్‌కు ఈ నెల 9వ తేదీలోగా పంపించాలని కోరారు.

ప్రజలకు అన్నివేళలా అందుబాటులో వుంటా

కడప డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షేక్ మాసుమ్‌బాష



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ మాసుమ్‌బాష

కడప, క్రైం : ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో వుంటూ వారికి సేవ చేస్తానని కడప నూతన డీఎస్పీ షేక్ మాసుమ్‌బాష పేర్కొన్నారు. కడప డీఎస్పీగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐ స్థాయి నుంచి డీఎస్పీ వరకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సత్వర న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు నిజం చెప్పి న్యాయం పొందగలరన్నారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు కడప సబ్‌డివిజన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. మట్కా, జూదం, బెట్టింగ్, వ్యభిచారం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కిందిస్థాయి పరిధిలో న్యాయం జరగని వారు నేరుగా తనకే ఫిర్యాదు చేస్తే చట్టపరిధిలో వున్న వాటికి న్యాయం చేస్తామన్నారు. ఈయన కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన వారు. మొదట 2003లో ప్రభుత్వ ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2005లో డీఎస్సీ పరీక్ష రాసి హైస్కూల్ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యాడు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గ్రూప్-1లో ఉత్తీర్ణత సాధించి డీఎస్పీగా 2012లో షేక్ మాసుమ్‌బాష ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఏసీబీలో ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం మార్కాపురం అటాచ్డ్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ముందుగా కడప డీఎస్పీగా పనిచేసిన ఈజీ అశోక్‌కుమార్ డీఎస్పీగా వచ్చిన షేక్ మాసుమ్‌బాషను స్వాగతించి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కడప డీఎస్పీని పలువురు ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కాగా డీఎస్పీ అశోక్ కుమార్ విజయవాడ వీఆర్ బదిలీపై వెళ్లారు.

నూతన వాహనాలను ప్రారంభించిన ఎస్పీ

కడప, క్రైం : రాష్ట్ర పోలీసుశాఖ జిల్లాకు నూతనంగా నాలుగు వాహనాలను కేటాయించింది. బుధవారం జిల్లాపోలీసు కార్యాలయంలో నాలుగు వాహనాలకు ఎస్పీ అట్టాడ బాబూజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకు రాష్ట్ర పోలీసుశాఖ నాలుగు వాహనాలు కేటాయించారని, ఒక వాహనం రాయచోటి పోలీసుస్టేషన్ కు, మరో వాహనం మొబైల్ వాహనం, కడపచిన్నచౌకు మరో మొబైల్ వాహనం కేటాయించారన్నారు. కడప-మైదుకూరు, మైదుకూరు-జమ్మలమడుగు మార్గంలో రోడ్డు భద్రతకు నిర్దేశించిన వాహనాలను కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషినల్ ఎస్పీ రిషికేశవరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ మురళీధర్, ఆర్ఐ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.




నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ బాబూజీ

9న కడప మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

కడప, సెవెన్‌రోడ్స్ : కడప వ్యవసాయ మార్కెట్ కమిటీకి నియమించిన నూతన పాలకవర్గం ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రమాణస్వీకారం చేయనుంది. బుధవారం చైర్మన్ గా నియమితులైన ఇందిరెడ్డి శివారెడ్డి నేతృత్వంలో వైస్ చైర్మన్ గంధం మోహన్ బాబు సహా 13 మంది డైరెక్టర్లు కడపలో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కాగా ఈప్రమాణ స్వీకారానికి ఇన్ చార్జి మంత్రి సోమిరెడ్డి, మంత్రి ఆదినారాయణరెడ్డి సహా పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కమలాపురం పార్టీ ఇన్ ఛార్జి పుత్తానరసింహారెడ్డి, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యే అవకాశం వుంది.

ఎడ్యుకేషన్ లో బ్రహ్మయ్యకు డాక్టరేట్



కడప, ఎర్రముక్కపల్లె : గెజిటెడ్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వల్లూరు బ్రహ్మయ్యకు కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందజేసినట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ. పి. నాగేశ్వరరావు తెలిపారు. బ్రహ్మయ్య ఎడ్యుకేషన్ విభాగంలో ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ మేథిమెటికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్ ఆన్ మేథమేటిక్స్ అఛీవ్‌మెంట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథం ద్రావిడ విశ్వవిద్యాలయానికి సమర్పించారని చెప్పారు. ఎడ్యుకేషన్ విభాగం అసోసియేట్ ప్రొ.ఎం.టి.వి.నాగరాజు గైడ్‌గా వ్యవహరించారు. డా.బ్రహ్మయ్య రాసిన పరిశోధనలు వ్యవసాయ పలు జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. కేరళ రాష్ట్రంలోని ప్రత్యేక అవసరాల గల పిల్లలకు సంబంధించిన విద్య విషయాలు అధ్యయనం అవానీ న్యూఢిల్లీలో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ జాతీయ స్థాయి కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున హాజరయ్యారు.

తిరుమల సమాచారం

తిరుమలకు వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ముందస్తుగా కడప టీటీడీ దేవస్థాన ఈ-దర్శన్ ద్వారా దర్శనం టిక్కెట్లు, వసతి (రూములు) పొందవచ్చు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు అందిన సమాచారం మేరకు తిరుమలలో వసతి, దర్శనం టిక్కెట్ల ఖాళీలు ఇలా వున్నాయి.

● **రూ.300 దర్శనం టిక్కెట్లు**

ఆగస్టు 16న 450, 18న 20, 20న 790, 21న 1280, 22న 1820 టిక్కెట్లు ఖాళీగా వున్నాయి.

● **రూ.50 రూములు**

ఆగస్టు 24న 62 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.100 రూములు**

సెప్టెంబర్ 12న 26, 13న 48, 14న 87, 18న 38, 19న 126 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.500 రూములు**

సెప్టెంబర్ 12న 26, 13న 48, 14న 40, 18న 52, 19న 51 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.200 రూములు**

(శ్రీనివాసం) తిరుపతిలో

ఆగస్టు 23న 16, 24న 11, 28న 10, 29న 8, 31న 27 గదులు ఖాళీగా ఉన్నాయి.

● టీటీడీ కల్యాణమండపాలు బుకింగ్ చేసుకునేందుకు సంప్రదించాల్సిన నెంబరు 9059948220.

టీటీడీ కార్యాలయం పనిచేయు వేళలు

● ప్రతి మంగళవారం సెలవు

● సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వర కు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఆ సమయంలో దర్శనం టిక్కెట్లతో పాటు వసతి కోసం రూములను బుక్ చేసుకోవచ్చు.

గమనిక : ఈదర్శన టిక్కెట్లకు వచ్చే వారు గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలి ఆధార్, రేషన్ కార్డు, ఓటర్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స తదితర ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.

డిజిటల్ సేవలపై ఖాతాదారులకు అవగాహన

ఏపీజీబీ ఖాతాదారులకు ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు : కలెక్టర్ బాబూరావునాయుడు

కడప, ఐటీఐసర్కిల్ : బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకొని డిజిటల్ సేవలు విస్తృతమయ్యాయి. వీటిపట్ల ఖాతాదారులు అవగాహన లేక సేవలను వినియోగించుకోలేకపోతున్నారని డిజిటల్‌సేవల పట్ల పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందని కలెక్టర్ బాబూరావునాయుడు, సిండికేట్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ ఎస్ఎస్ మల్లికార్జునరావు తెలిపారు. కడప నగరం మరియాపురంలో గల ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-కామర్స్ సదుపాయాలను బుధవారం వారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ-కామర్స్ సదుపాయం గల మొదటి బ్యాంకు ఏపీజీబీ

వాణిజ్య బ్యాంకులకు దీటుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఈ-కామర్స్ సదుపాయాలు కల్పిస్తున్న మొదటి గ్రామీణ బ్యాంకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కావడం ఎంతో గర్వించదగ్గ విషయమని సిండికేట్ బ్యాంకు ఈడీ మల్లికార్జునరావు కొనియాడారు. ఏపీజీబీ తమ ఖాతాదారులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నందుకు బ్యాంకు చైర్మన్ వెంకటరెడ్డిని అభినందించారు. ఏపీజీబీ 532 శాఖలతో కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించి మొత్తం వ్యాపారం రూ.22.168 కోట్లకు చేరుకోవడం సంతోషదాయకమన్నారు. ఏపీజీబీలో అకౌంట్ కలిగిన ప్రతి ఖాతాదారుడికి కోరిన వెంటనే ఏటీఎం, డెబిట్ కార్డులను అందించడానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేశామని ఏపీజీబీ చైర్మన్ వెంకటరెడ్డి అన్నారు.



ఈ-కామర్స్ సేవలను ప్రారంభించేందుకు వస్తున్న కలెక్టర్, తదితరులు

తమ బ్యాంకు ఏటీఎంతో దేశవ్యాప్తంగా సిండికేట్ బ్యాంకు వారి 4400 ఏటీఎంలలో ఎక్కడైనా నగదు తీసుకునే సదుపాయం కలదని అందువల్ల ఏపీజీబీ ఖాతాదారులు ఏటీఎం డెబిట్‌కార్డులను పొందేందుకు తమ శాఖలలో తక్షణం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ బ్యాంకు జనరల్ మేనేజర్ ఎం.మోహన్ రెడ్డి, ఏపీజీబీ జనరల్ మేనేజర్ ఎం.ఆనంద్, జేవీ సత్యనారాయణ, ప్రసాద్, ప్రధాన కార్యాలయ చీఫ్ మేనేజర్లు మస్తానయ్య, జేఎల్ఎన్ ప్రసాద్, కడప రీజనల్ మేనేజర్ వీసీకే ప్రసాద్, బీవీ శివయ్య, నరసింహారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రంగన్న, పీవీ ప్రతాప్‌రెడ్డి, ఓబయ్య, శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.90 కోట్లు దీర్ఘకాలిక రుణం మంజూరుకు సిద్ధం

కడప, కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత వ్యవసాయ సీజన్ కు సంబంధించి జిల్లాలోని రైతులకు రూ.90 కోట్ల మేరకు దీర్ఘకాలిక పంట రుణాల మంజూరుకు సిద్ధంగా వున్నట్లు డీసీసీబీ చైర్మన్ జి.అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దీర్ఘకాలిక రుణాలు రూ.180 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కాగా స్వల్పకాలిక రుణాల మంజూరుకు రూ.25 కోట్లు సిద్ధంగా వున్నట్లు చెప్పారు. రుణాల మంజూరుకు సంబంధించి ఆప్కాబ్ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. మరోవైపు టెక్నాలజీని దృష్టిలో వుంచుకొని రానున్న రోజుల్లో బ్యాంకు లావాదేవీలు విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం టెక్నాలజీ అడప్షన్ ఫండ్ పేరుతో కొంత మొత్తాన్ని పర్సెంటేజీ రూపంలో పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏటీఎంల ఏర్పాటు, యాప్‌ల క్రియేషన్ వంటి సాంకేతిక పరికరాల ఏర్పాటుకు ఈ ఫండ్స్‌ను వినియోగించుకునేందుకు వీలుంటుందన్నారు. అజెండాలోని పలు అంశాలపై పాలక మండలి సభ్యులు తమ ఆమోదాన్ని తెలిపారు. సమావేశంలో నాబార్డు డీడీఎం శ్రీనివాసులు, జిల్లా సహకార శాఖ అధికారి పోమేనాయక్, డీసీసీబీ సీఈవో వెంకటరత్నం, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి

వెండి వాకిళ్ళు వితరణ

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయానికి సుమారు 12 లక్షల విలువ చేసే వెండివాకిళ్ళను దాతలు బహూకరించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యేల్చూరి అశోక్‌కుమార్ తెలిపారు. యేల్చూరి జగన్నాథమ్, మరికొందరు దాతల సహకారంతో కన్యకాపరమేశ్వరి దేవాలయంలోని గర్భగుడికి రెండు వాకిళ్ళను తయారు చేసి ఇచ్చినట్లు అధ్యక్షుడు తెలిపారు. వీటిని బుధవారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం గర్భగుడికి అమర్చారు. గర్భగుడికి వెండి వాకిళ్ళు అమర్చే కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తాదులకు నిర్వాహకులు, సంఘం సభ్యులు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దాతలు ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు డి.రామ్మోహన్ , పెంచూరు సురేష్, నటకల రామకృష్ణ, వలంకొండు చంద్రశేఖర్, యేల్చూరు బాలాజీ, గంధే నాగసత్యనారాయణగుప్త, యేల్చూరి సత్యనరసింహారావు, ప్రాభవులు రాధాకృష్ణమూర్తి, మాగలూరు సత్యప్రకాష్‌గుప్త, భక్తులు పాల్గొన్నారు.



6న చలో తిరుపతి

లింగాల: మధ్యాహ్న భోజన వర్కర్ల కు కనీస వేతనాలు ఇవ్వాలని 6న తిరుపతి బహిరంగ సభకు తరలిరా వాలని మధ్యాహ్న భోజన వర్కింగ్ యూనియన్‌ నాయకుడు చాంద్‌బాష పిలుపునిచ్చారు. బుధవారం లింగాల ఎంఈఓ కార్యాలయం వద్ద మండలం లోని మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సిబ్బందికి కనీస వేతనం, వంట పాత్రలు, ప్రభుత్వ కార్మికులుగా గు ర్తించాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఇది వరకే విద్యార్థులకు కోడిగుడ్లు, గ్యాస్‌ తదితర వాటిపై పోరాడి విజ యం సాధించామన్నారు. సభను విజ యవంతం చేయాలని ఆయన మధ్యా హ్న భోజన కార్మికులను కోరారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : జేడీ

పులివెందుల టౌన్‌: ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ రాయితీలపై ఎంపీఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ తెలియజే యాల్సిన బాధ్యత ఎంపీఈఓలపై ఉందని వ్యవసాయశాఖ జేడీ ఠాకూర్‌నాయక్‌ తెలిపా రు. బుధవారం పట్టణంలోని వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయంలో డివిజన్‌ పరిధిలోని సిబ్బందితో సమావేశంలో ఆయన మాట్లాడు తూ వర్షాభావం కారణంగా జిల్లాలో 1.36లక్ష ల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉంద న్నారు. ఆగస్టులో వర్షాలు కురిసి పంటల సాగుకు అనువైన వర్షపాతం నమోదవుతుం దన్న నమ్మకం ఉందన్నారు. దీంతో 150క్విం టాళ్ల సద్దలు, 350క్వింటాళ్ల కందులు, 2250 క్వింటాళ్ల అలసందలు, 2300క్వింటాళ్ల ఉలవ లు, పశువుల మేత కోసం 200క్వింటాళ్ల జొన్నలు, మరో 150 క్వింటాళ్ల తెల్లజొన్నలకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ విత్తనా లు ఎంత శాతం రాయితీతో ఇస్తారో ఇంకా నిర్ణయించలేదన్నారు. ఆగస్టు చివరిలోపు వర్షం కురిస్తే కంది, పత్తిని సాగు చేసుకోవచ్చ న్నారు. అనంతరం డ్రిప్‌ కింద సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రమణారెడ్డి, ఏఓలు నాగభూషణంరెడ్డి, మధుసూధన్‌ రెడ్డి, శ్రీవాణి, జ్యోత్స్న, ఎంపీఈ ఓలు తదితరులు పాల్గొన్నారు.


డ్రిప్‌ కింద సాగుచేసిన కంది పంటను పరిశీలిస్తున్న జేడీఏ

అమరావతి, పోలవరమే బాబు జపం


విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య

పులివెందుల టౌన్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మూడేళ్లలో తన ఆలోచనలు అన్నీ అమరావతి, పోలవరం చు ట్టూ చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం ఆయ న విలేకరులతో మాట్లాడుతూ అమరావతి, పోలవరం జపంతో రాష్ట్ర సమాగ్రాభివృద్ధికి, వెనుకబడ్డ రాయలసీమ అభివృద్ధికి తీసు కున్న చర్యలు శూన్యమని దుయ్యబట్టారు. వెనుకబడ్డ రాయలసీమను చంద్రబాబు దగా చేస్తున్నారని విభజన హక్కు చట్టంలో ఇచ్చిన హామీలను ఒక్కదానిని కూడా అమ లు చేయలేదన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ఊసే ఎత్తలేదన్నారు. కరువుమీద కరువులు ప్రజల ను, రైతాంగాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయన్నా ప్రభుత్వం మాత్రం కరువు శాశ్వత నివార ణకు చర్యలు శూన్యమని విమర్శించారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశారన్నారు. రుణాలు రీ షెడ్యూల్‌కాలేదని, కరువు రైతాంగాన్ని ఆదుకోవడంలో వైఫల్యం చెందారన్నారు. విభ జన హక్కు చట్టంలో పొందుపర్చిన అంశాల ను అమలు చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మ ణ్యం, జిల్లా సమితి సభ్యులు రాములు, ఏరి యా కార్యదర్శి బాష, రజియా పాల్గొన్నారు.

విద్యార్థులతో రాజకీయం తగదు : టీడీపీ

పులివెందుల టౌన్‌: చదువుకునే విద్యార్థు లతో రాజకీయం తగదని టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, జనార్ధన్‌ రెడ్డి ఆరోపించారు. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేసిన బ్యా గులకు వైసీపీ స్లోగన్‌ లు ఉన్నాయన్నారు. ఆ బ్యాగులపై ఉన్న వైసీపీ లేబుల్‌ను తొలగిం చాలని మండల విద్యాశాఖ అధికారులకు పులివెందుల టీడీపీ నేతలు డిమాండ్‌ చేశా రు. వైఎస్సార్‌ జయంతి సందర్భంగా వైసీపీ బ్యాగులపై పార్టీ లేబుల్‌ ముద్రించి పాఠశా లల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులతో రాజకీయం చేయడం తగదన్నారు. మాజీ సీఎం వైఎస్‌ ఫొటో ఉండవచ్చు కానీ పార్టీ జండాను చూపుతూ బ్యాగులపై ముద్రించ డం వైసీపీకి తగదన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు ఈసందర్భంగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో గార్డులకు గాయాలు

బైకు అదుపుతప్పడంతో ప్రమాదం

వేంపల్లె: కుమ్మరాంపల్లె సమీపంలో జరి గిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ గార్డులకు గాయాలయ్యాయి. బుధవారం రాత్రి వేంపల్లె నుంచి ట్రిపుల్‌ఐ టీకి విధుల నిమిత్తం బైకులో వెళ్తుండగా రోడ్డుపై కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయారు. ఇందులో రాజారెడ్డినగర్‌కు చెందిన హనుమంతు, నందిమండల వాసి నాగేశ్వర్‌రావుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం వేంప ల్లెకు తరలించారు.

బాడీకేర్‌ జిమ్‌ సెంటర్‌ ప్రారంభం

పులివెందుల టౌన్‌: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో ఏర్పాటు చేసిన బాడీకేర్‌ జిమ్‌ సెంట ర్‌ను వైఎస్‌ వెంకటరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిమ్‌ సెంటర్ల వలన బాడీ ఫిట్‌నెస్‌, శారీరక దృఢత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిమ్‌ సెంటర్‌ నిర్వాహకుడు అరుణ్‌కుమార్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జిమ్‌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్‌ వెంకటరెడ్డి

దోభీఘాట్‌ మంజూరు

వేంపల్లె: వేంపల్లెకు దోభీఘాట్‌ మంజూరైంది. రూ. 5.60లక్షలను దోభీఘాట్‌ మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్‌ ఎంపీడీఓ కార్యాలయాలకు ఉత్తర్వులు పంపారు. ఈ నిధులతో పాపాఘ్ని ఒడ్డున దోభీకి నీరు, విద్యుత్‌ , విశ్రాంతి గది, టాయిలెట్లు ఏర్పాటు కోసం కేటాయించారు. స్థానిక రజకుల విజ్ఞప్తి మేరకు శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్‌ సతీష్‌రెడ్డి, వేంపల్లె సర్పంచు విష్ణువర్ధ న్‌ రెడ్డి చొరవతో దోభీఘాట్‌ కలెక్టర్‌కు ద్వారా నిధులు మంజూరు చేయించారని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి నందిమండలం మహేశ్వర్‌బాబు తెలిపారు.

నేడు జిప్సం పంపిణీ

లింగాల: గురువారం రైతులకు ఉచితంగా జిప్సం పంపిణీ చేస్తున్నట్లు ఏఓ నాగభూష ణంరెడ్డి తెలిపారు. 2017లో రైతులు తమ పొలంలో మట్టి పరీక్షలు చేయించుకున్న వా రికే రెండు బస్తాల జిప్సం ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టా దారు పాసుబుక్కు, మట్టిపరీక్షల ధృవీకరణ పత్రం వెంట తీసుకురావాలని కోరారు.

హౌస్‌ జియో ట్యాగింగ్‌పై సమీక్ష

వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధిలో జరుగుతున్న హౌస్‌ జియోట్యాగింగ్‌ సర్వేపై బుధవా రం అధికారులు సమీక్షించారు. ఈఓఆర్డీ శేఖర్‌నాయక్‌, ఈఓ నాగభూషణంరెడ్డి, ఉపసర్పంచు మునీర్‌ తదితరుల ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశంలో సర్వే వివరాలు అడిగి ఎన్యుమరేటర్ల ద్వారా తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం వేగవంతంగా సర్వే నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు ఎన్యుమరేటర్లను ఆదేశించారు. జూనియర్‌ అసిస్టెంట్‌ ప్రసన్నకు మార్‌, బిల్‌కలెక్టర్లు నరసింహులు, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై ప్రాథమిక సర్వే

తొండూరు: మడూరు గ్రామంలోని ఇళ్లకు సంబంధించి ప్రాథమిక సర్వే ఎంపీడీఓ మల్లీశ్వరి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మట్టిమిద్దెలు, స్లాబులు, కొట్టాలు ఎన్నిఉన్నాయని సర్వే నిర్వహించి నివేదిక తయారు చేశారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నేడు మానవత సమావేశం

వేంపల్లె: స్థానిక చైతన్య హైస్కూల్లో గురు వారం సాయంత్రం 5 గంటలకు మానవత స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సమావేశం జరు గుతుందని ఆ సంస్థ ఛైర్మన్‌ చక్రపాణిరెడ్డి తెలిపారు. నూతన కార్యవర్గ ఎంపిక, ప్రమా ణస్వీకారం జరుగుతుందన్నారు. సంస్థ సభ్యులు, ప్రజలు హాజరవాలని ఆయన కోరారు.

చీనీచెట్లకు ప్రీమియం చెల్లించండి

పులివెందుల టౌన్‌: చీనీచెట్ల రైతులు 9వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ అధి కారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీచెట్లు ఉన్న రైతులు హెక్టారుకు రూ. 3750 చొప్పున డీడీలను వాతావరణ ఆధారిత బీమా కింద చెల్లించాలన్నారు. ఈ డీడీలు హెచ్‌ డీఎఫ్‌సీ ఎర్గో జనరల్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీ లిమిటెడ్‌, విజయవాడ పేరుతో తీయాల్సి ఉంటుందన్నారు. ఈ డీడీతో పాటు దరఖాస్తు, 1బి, పట్టాదారు పాసుబుక్కు, బ్యాంకు అకౌంట్‌ జిరాక్సు, ఆధార్‌ కార్డు, వీఆర్వోతో సతకం చేసిన కాపీని జతచేయాలన్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు నమోదు

తొండూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ వద్ద ఎస్‌ఐ శ్రీనివాసులు వాహనాల తనిఖీ నిర్వ హించారు. రెండు డ్రంక్‌ అండ్‌ కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించి నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎర్రగుంట్ల: స్థానిక వేంపల్లిరోడ్డులో రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ము గ్గురికి గాయాలయ్యాయి. రమేష్‌, మరొకరి తో కలిసి మోటార్‌ సైకిల్‌లో వెళుతుండగా వీరాంజనేయులు భార్యతో కలిసి మోటార్‌ బైక్‌లో వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది.

రేపు వరలక్ష్మీ వ్రతం

వేంపల్లె: వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం 4వ తేదీన సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుందని ఆలయ పూజారి శ్రీనాథ్‌ తెలిపారు. భక్తులందరు హాజరై వ్రత పూజల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సినిమాగైడ్‌

పులివెందుల	
మారుతి	: ఫిదా
లక్ష్మీ	: వాసుకి
రాఘవేంద్ర	: వైశాఖం
శ్రీనివాస	: గౌతంనంద
సుజాత	: నిన్నుకోరి
వేంపల్లె	
తిరుమల	: నిన్నుకోరి
వెంకటేశ్వర	: ఫిదా
నూర్జహాన్‌	: పటేల్‌ సర్‌

చీనీచెట్లకు ప్రీమియం చెల్లించండి

పులివెందుల టౌన్: చీనీచెట్ల రైతులు 9వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీచెట్లు ఉన్న రైతులు హెక్టారుకు రూ. 3750 చొప్పున డీడీలను వాతావరణ ఆధారిత బీమా కింద చెల్లించాలన్నారు. ఈ డీడీలు హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, విజయవాడ పేరుతో తీయాల్సి ఉంటుందన్నారు. ఈ డీడీతో పాటు దరఖాస్తు, 1బి, పట్టాదారు పాసుబుక్కు, బ్యాంకు అకౌంట్ జిరాక్సు, ఆధార్ కార్డు, వీఆర్వోతో సతకం చేసిన కాపీని జతచేయాలన్నారు.

కాపు జాతి కోసం కాదు.. జగన్‌కు పదవి కోసమే ఆరాటం

ముద్రగడపై రెడ్యం ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కాపు జాతికోసం పోరాటం చేయట్లేదని, ఆయన ఆరాటమంతా వైసీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డిని పదవిలో కూర్చో బెట్టేందుకేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. దుంపలగట్టులోని రెడ్యం స్వగృహంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచ్చులోంచి బయటపడాలని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ముద్రగడ లేఖ రాయడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. జగన్ కబంద హస్తాల్లోంచి మీరే బయటపడాలని ముద్రగడను రెడ్యం కోరారు. జగన్‌ది ధృతరాష్ట్ర కౌగిలి అన్న విషయం గుర్తెరిగి ప్రవర్తించాలని, లేకుంటే చరిత్ర హీనుడివి కాక తప్పదని ముద్రగడను ఆయన హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలపై , కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు రైట్ అని పవన్ కళ్యాణ్ మాట్లాడడం ఆయన రాజకీయ పరిణితికి ప్రత్యక్ష నిదర్శనమని ఆయన కొనియాడారు. చంద్రబాబు బ్రహ్మాండంగా పనిచేస్తుంటే పవన్ వాటిని తప్పు పట్టాలా, విమర్శించాలా అని ఆయన ప్రశ్నించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపు నల్లేరుపై నడకేనని, చంద్రబాబు అభివృద్ధే భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించి తీరుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు కటారు కృష్ణ, నిగినేని పుల్లయ్య నాయుడు, నంద్యాల సుబ్బయ్య, పల్లె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్ల ద్వారానే ఎరువుల పంపిణీ



డీలర్లకు ఈ-పాస్ యంత్రాల గురించి వివరిస్తున్న లక్ష్మణ్

మైదుకూరు రూరల్ : ఈ-పాస్ మిషన్ల ద్వారానే ఎరువులను పంపిణీ చేయాలని మైదుకూరు మండల వ్యవసాయశాఖ అధికారి లక్ష్మణ్ డీలర్లను ఉద్దేశించి పేర్కొన్నారు.బుధవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మైదుకూరు,చాపాడు, దువ్వూరు, రాజుపాలెం మండలాలకు సంబం ధించి డీలర్లుకు ఈ.పాస్ మిషన్లను పంపిణీ చేశారు. మైదుకూరుకు 21, చాపాడుకు 5, రాజుపాళెం 5, దువ్వూరు 12 మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం మిషన్ల పనితీరును అధికారులు వారికి వివరించారు. ఆధార్‌కార్డు కల్గిన రైతులకు మాత్రమే ఎరువులను విక్రయించాలని తెలిపారు. అంతేకాకుండా సబ్సిడీ కూడా వర్తిస్తుందని తెలిపారు. డ్రిప్ పర్టిలైజర్స్, మైక్రోన్యూట్రియన్స్ పర్టిలైజర్స్‌కు ఈ విధానం వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో ఏ.ఓ ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, డీలర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

బ్రహ్మంగారిమఠం : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర నాయకుడు చెంద్రాయుడు పేర్కొన్నారు. బుధవారం బి.మఠం తహసీల్దార్ కార్యాలయం వద్ద 3వ రోజు రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలను ఉద్దేశించి రాష్ట్ర నాయకుడు చెంద్రాయుడు, జిల్లా నాయకుడు చెన్నయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం దళితులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు దళితులకు ఎస్సీ వర్గీకరణ చేస్తామని, ప్రస్తుతం మాట తప్పారని వారు వాపోయారు. ఎన్నికల హయాంలో దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ప్రతి పక్షనేత జగన్ మోహన్ రెడ్డికి ఇద్దరికీ సహకరించిన విషయాన్ని వారు మరవవద్దని, వెంటనే ఎస్సీవర్గీకరణ చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పీటర్, జిల్లా యువసేన అధ్యక్షుడు క్రిష్ణ, సిద్దు, కేశవ, ఓబయ్య, జోజప్ప, తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిళ్లు ఢీ

ముగ్గురికి గాయాలు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల శివార్లలోని వేంపల్లిరోడ్డులో బుధవారం సాయంత్రం రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్‌కు చెందిన రమేష్, మరొకరితో కలిసి మోటార్ సైకిల్‌లో వేంపల్లివైపు వెళుతున్నాడు. అలాగే వెల్లర్తికి చెందిన మాటిగాళ్ల వీరాంజనేయులు భార్యతో కలిసి ఎర్రగుంట్ల వైపు మోటార్ బైక్‌లో వస్తున్నాడు. సబ్‌స్టేషన్‌కు సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. రమేష్‌కు ముఖానికి గాయాలైనట్లు తెలిపారు. అలా గే వీరాంజనేయులకు కూడా కుడికన్ను కిం ద బాగంలో గాయాయ్యాయని తెలిపారు. వీరాంజనేయులు బైక్‌లో ఉన్న మహిళకు కూడా గాయాలు అయ్యాయి. వారి ముగ్గురిని 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

బ్రహ్మంగారిమఠం : అప్పుడే పుట్టిన పురిటిబిడ్డకు తల్లి ముర్రుపాలను తాపించినట్లు అయితే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బి.మఠం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డి.అగ్రహారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ సరళ, ప్రత్యేకాధికారిని కల్పన మాట్లాడుతూ బిడ్డలను కంగారు పద్దతి ద్వారా పోషించుకున్నట్లు అయితే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుదల చెందుతుందని, అలాగే అంగన్వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్, అంగన్వాడీ టీచర్ సీహెచ్ మల్లీశ్వరి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు నివ్వని వీధి దీపాలు...



అగ్రహారంలో వెలగని వీధి దీపం, మెయిన్‌బజార్‌లో నిరుపయోగంగా వున్న వీధి దీపం

ఖాజీపేట : ఖాజీపేట మేజర్ పంచాయతీ అయినా సమస్యలు వెంటాడుతున్నాయి. రాత్రి అయితే వీధులు అంధకారంలో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సగానికి సగం వీధి దీపాలు వెలుగు నివ్వడం లేదు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కె.సుంకేసుల బైపాస్ దారిలో కె.బుడ్డాయపల్లె, కె.అగ్రహారం, మెయిన్‌బజార్, ఇందిరా కాలనీ, సాయిబాబ గుడి వద్ద తదితర చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎల్ఈడీ బల్బులు దేవుడి కెరుక.. ఉన్న బల్బులను అమర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మోరగుడిలో నగదు, నగలు చోరీ

జమ్మలమడుగు రూరల్: మండలంలోని మోరగుడి గ్రామం తాడిపత్రి రోడ్డు దస్తగిరి స్వామిదర్గా వద్ద సైనాథం రమణమ్మ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. బీరు వా పగులకొట్టి రూ.30 వేలు నగదు, ఆరు గ్రాముల బంగారు దోచుకెళ్లారు. రమణమ్మ ఇంటికి తాళం వేసి జమ్ములమడుగులో ఉన్న తన బిడ్డ ఇంటికెళ్లింది. ఇంట్లో ఎవరూలేని విషయాన్ని గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో కెళ్లి బీరువాలోని రూ.30 వేల నగదు, బంగారాం ఎత్తుకెళ్లారు. రమణమ్మ బుధవారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు అర్థమైంది. వెం టనే జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ప్రవీణ్‌కుమార్, ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

హెచ్చరిక బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిలో బోర్డు నాటుతున్న వీఆర్‌ఓ మధుడేవిడ్

మైదుకూరు రూరల్ : మండలంలోని నంద్యాలంపేట పంచాయతీలోని జీ.వి.సత్రంలో బుధవారం వీఆర్‌ఓ మధుడేవిడ్ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును పాతారు.మధుడేవిడ్ తెలిపిన సమాచారం మేరకు గతంలో గురవయ్య అనే వ్యక్తికి 477-2,477-3 నెంబరులో 6ఎకరాల భూమి ఇవ్వగా, అతను స్థానికుడు కాదని అంకిరెడ్డిపల్లె నారాయణరెడ్డి అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమిని ప్రభుత్వం రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. మైదుకూరు తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఆ భూమిలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు హెచ్చరిక బోర్డును పాతామని మధుడేవిడ్ తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో చోరీల నివారణ

ప్రొద్దుటూరు టౌన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చోరీలను నివారించవచ్చని రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఆధునిక, సాంకేతిక ద్వారా దొంగతనాల నివారణ అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎల్‌హెచ్ఎంఎస్ అనే ఉచిత మొబైల్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. యాప్ విధి విధానాలు విద్యార్థులకు వివరించారు. యాప్ సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జగదీశ్వర్‌రాజు, బాలాంజనేయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల్లో గందరగోళం

● లబ్ధిదారుల్లో ఆందోళన

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: ప్రొద్దుటూరుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన పక్కా గృహాలపై గందరగోళం నెలకొంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చాక మూడేండ్లకు మంజూరైన ఈ ప్రభుత్వ పక్కా గృహాలపై అధికార పార్టీ నాయకులు సమన్వయం లేకుండా ప్రకటనలిస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అమృత్ పథకం కింద ప్రొద్దుటూరు పట్టణంలో సొంత గృహాలు లేని అర్హులైన పేదలందరికి పక్కా గృహాలు వస్తున్నాయి. వీటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సీడీ ఇస్తున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు కూడా ఇప్పించనున్నాయి. వీటిని వ్యక్తిగత, సామూహిక (కాలనీలు) గృహాలుగా నిర్మించనున్నారు. జిల్లాలో మిగతా ప్రాంతాల్లో ఈ గృహాల మంజూరు, కేటాయింపు, నిర్మాణాలు సాఫీగా సాగుతున్నాయి. ప్రొద్దుటూరులో మాత్రం అధికార పార్టీలో ఆధిపత్యపోరుతో గృహాల నిర్మాణం ముందుకు సాగలేదు. అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నంద్యాల వరదరాజులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి వారి వర్గీయులంతా ప్రభుత్వ గృహాలను ప్రొద్దుటూరులోనే నిర్మించాలని కోరుతున్నారు. స్థానిక అమృతానగర్, రామేశ్వరం హౌసింగ్ కాలనీల్లోనే పక్కాగృహాల నిర్మాణం అవుతాయని ప్రకటిస్తున్నారు. బీజేపీ సీనియర్ నేత, ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి కూడా ప్రభుత్వ గృహాలను ప్రొద్దుటూరులోనే నిర్మించాలని కోరుతున్నారు. మరో పక్క రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ చైర్మన్ మల్లెల లింగారెడ్డి వర్గానికి చెందిన ప్రొద్దుటూరు మున్సిపల్ మాజీ ఇన్‌ఛార్జి చైర్మన్ వి.ఎస్.ముక్తియార్, ఆయన వర్గీయులు మాత్రం ప్రొద్దుటూరుకు మంజూరైన గృహాలను జమ్మలమడుగు నియోజకవర్గం పోట్లదుర్తి గ్రామంలోనే నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సీఎం నుంచి ఆదే శాలు సైతం వచ్చినట్లు వారు చెబుతున్నారు. అయితే ఇటువంటి ఆదేశాలేమీ రాలేదని వరదరాజులరెడ్డి వర్గీయులు ఖండిస్తున్నారు. ఇందులో ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో తెలియక లబ్ధిదారులు ఆందోన చెందుతున్నారు.

ఇదే పరిస్థితుల్లో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరులో వార్డుల్లో పర్యటిస్తూ అపార్టుమెంట్స్ టైప్‌లో ప్రభుత్వ గృహాల నిర్మాణం లబ్ధిదారులకు భారంగా మారుతుందని విమర్శిస్తున్నారు. వీటిని ల బ్ధిదారులు తీసుకుంటే అప్పులపాలవుతారని ప్రచారం చేస్తున్నారు. దీంతో ఎక్కడా లేని విధంగా ప్రొద్దుటూరులో మాత్రం ప్రభుత్వ గృహాలపై గందరగోళం ఏర్పడింది.

అంగన్వాడీ గుడ్లపై గుర్తులు

ప్రొద్దుటూరు టౌన్: అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసే కోడగుడ్లపై గుర్తులను ముద్రించి పంపిణీ చేయనున్నారు. అంగన్వాడీలకు పౌష్టికాహారం పంపిణీలో భాగంగా అందిస్తున్న గుడ్డు సక్రమంగా పంపిణీ కావడంలేదని, దుర్వినియోం అవుతున్నాయన్న ఆరోపణలతో స్పందించిన ప్రభుత్వం గుడ్ల దుర్వినియోగాన్ని అరికట్టడానికి గుర్తులను ముద్రించింది. ఐసీడీఎస్, ఎండీఎం, ఏపీ అన్న గుర్తులను నాలుగు రంగుల్లో ముద్రించి ఒక్కోరకం ఒక్కో రంగు గుర్తు ఉన్న గుడ్లను పంపిణీ చేయనున్నారు. మొదటివారం పసుపురంగు గుర్తు ఉన్న గుడ్లను, రెండ వారం బ్లూకలర్ గుర్తు ఉన్న గుడ్లను, మూడవ వారం ఆకుపచ్చరంగు గుర్తు, 4వ వారం ఎరుపురంగు గుర్తు ఉన్న గుడ్లను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 15 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 3621 అంగన్వాడీ సెంటర్లు, 353 మినీ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో ఆరు నెలల నుండి 6 సంవత్సరాలలోపు పిల్లలు, 1,04,300 మంది చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు 50 వేల మంది ప్రయోజనం పొందుతున్నారు. ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టులో 291 సెంటర్లకు గుర్తులున్న గుడ్లు పంపిణీ అయ్యాయి.



అంగన్వాడీ గుడ్లపై గుర్తులు వేసిన దృశ్యం

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ప్రొద్దుటూరు టౌన్: పట్టణంలోని రెండు మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు ఓ విశ్రాంత అధ్యాపకుడు మైక్‌సెట్ వితరణ చేశారు. రిటైర్డు జూనియర్ లెక్చలర్ ఎస్.శివశంకర్‌రెడ్డి తన మనువడి జన్మదినం సందర్భంగా వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు, రెండవ వార్డు మున్సిపల్ హైస్కూలుకు రూ.6 వేలు విలువచేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు. శివశంకర్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఎంఈవోకు ఫిర్యాదు

ప్రొద్దుటూరు టౌన్: ఖాదర్‌బాద్ మండల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల గైర్హాజరుపై పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఖదీర్ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. టీచర్లు రహమతున్నీసా సెలవులో ఉండగా సహోపాధ్యాయురాలు అఫ్రోజ్ ఉదయం 10 గంటలకు కూడా బడికి రాలేదు. విద్యార్థులు బయట ఆడుకోసాగారు. ఈ విషయం గమనించిన ఎస్ఎంసీ చైర్మన్ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. సమీపంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిని ఉర్దూ పాఠశాలకు పం పా రు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.దీనిపై ఎంఈవో సావిత్రమ్మను వివరణ కోరగా హెచ్ఎంసెలవులో ఉన్నారని, ఎస్ఎంసీ చైర్మన్ ఫిర్యాదు చేయడంతో తెలుగుమీడియం పాఠశాల ఉపాధ్యాయుడినిఉర్దూ మీడియం పాఠశాలకు పంపినట్లు తెలిపారు.మరో ఉపాధ్యాయురాలు బడికి ఎందుకు రాలేదో తెలుసుకుంటామని పేర్కొన్నారు.

మొక్కు తీర్చుకున్న వైసీపీ నాయకులు

ముద్దనూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన జమ్మలమడుగు వైసీపీ సమన్వయ కర్త సుధీర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని వైసీపీ నాయకులు సన్నీ ఆధ్వర్యంలో బుధవారం ఆంజనేయస్వామికి మొక్కు తీర్చుకున్నారు. నాలుగు రోజుల క్రితం కర్నూలు జిల్లా డోన్ వద్ద హైదరాబాదుకు వాహనంలో వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. హైదరాబాదు లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. సుధీర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని వైసీపీ నాయకులు స్థానిక ఆంజనేయ స్వామి గుడి వద్ద ప్రదర్శనలు చేసి, 101 టెంకాయ స్వామి వారికి సమర్పించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



టెంకాయలు కొడుతున్న వైసీపీ నాయకులు

అనాథ శవానికి మానవత అంత్యక్రియలు


అనాథ మృతదేహాన్ని పరిశీలిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల మెయిన్ బజార్ రామాలయం వద్ద గుర్తు తెలియని అనాథ మహిళ (50) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు... ఆమె అనారోగ్యంతో బా ధపడుతూ ఈ ప్రాంతంలో సంచరిస్తూ పరి స్థితి విషమించడంతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఆమెకు ఎవరూ లేకపోవడంతో మానవత స్వచ్ఛందసంస్థ సభ్యులు రఘురామిరెడ్డి, మేడా రమేష్, రమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆదరణ స్వచ్ఛంద సంస్థకు చెందిన సంజీవరెడ్డి వైకుంఠ రథంలో తీసుకెళ్లి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా పోలీసులు పంచనామా నిర్వహించి, నగరపంచాయతీ వారికి సమాచారం అందజేశారు.

సినిమా గైడ్

ప్రొద్దుటూరు

సుధ :	గౌతమ్‌నంద
వెంకటేశ్వర :	గౌతమ్‌నంద
బీవీఎస్:	బాహుబలి-2
ఆరవేటి:	మాయామహల్
అర్చన	: తల్లా పెళ్లామా
చాంద్	: అంధగాడు
సినీ హబ్: స్ర్కీన్-1:	ఫిదా
స్ర్కీన్ -2	: దువ్వాడ జగన్నాథం
స్ర్కీన్ -3	: వాసుకి

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

● మీకు సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

- ప్రొద్దుటూరు - 9985411190
- పుట్టపర్తి సర్కిల్, - 9000885325
- క్రైం - 9490633105
- కల్చరల్ - 9966349431
- టౌన్ - 9866885470
- ప్రొద్దుటూరు అర్బన్ -8341751401
- రాజుపాళెం - 9642093626

మధ్యాహ్న భోజన కార్మికులకు

గౌరవ వేతనం చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు గౌరవ వేతనం చెల్లించాలని వంట కార్మికులు కోరుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 90 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వంట కార్మికులకు నెలకు రూ.1000 గౌరవవేతనం చెల్లిస్తున్నారు. 100లోపు విద్యార్థులు ఉంటే ఇద్దరు కార్మికులకు 100 నుంచి 200లోపు ఉంటే ముగ్గురు కార్మికులకు, 200 పైబడి విద్యార్థులుంటే నలుగురు కార్మికులకు గౌరవవేతనం చెల్లిస్తున్నారు. వంట కార్మికులకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఉపఖజానా కార్యాలయంలో ఫ్రీజింగ్ చేయడంతో బిల్లులు నిలిచిపోయాయి. మధ్యాహ్న భోజనం అమలుకు 3, 4 నెలలకొకసారి చెల్లిస్తున్న బిల్లులు సరిపోక అప్పులపాలవుతున్నామన్నారు. ఇటీవల నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగిపోయి అప్పులు కూడా లభించడంలేదని వంట కార్మికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1000 గౌరవ వేతనం ఏ మూలకు సరిపోదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం గౌరవ వేతనంను మంజూరురు చేసిన ఫ్రీజింగ్ పేరుతో సబ్‌ట్రెజరీలో నిలుపుదల చేయడం అన్యాయమని, కలెక్టర్ అయినా చొరవ తీసుకుని వంట కార్మికుల గౌరవ వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలను పరిశీలించిన వైవీయూ టీం



ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల డిగ్రీ కళాశాలను వైవీయూ అఫిలియేషన్ ఇన్స్‌స్పెక్షన్ కమిటీ బుధవారం సందర్శించింది. టీం కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలోని డాక్టర్ జి.కాత్యాయని, డాక్టర్ బి.రమేష్‌లు కళాశాలలోని అధ్యాపకుల వివరాలను అడిగితెలుసుకున్నారు. తరగతి గదులు, తరగతుల నిర్వహణ, ప్రయోగశాలలు పరిశీలించారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

సబ్సిడీ సిలిండర్ల ధర పెంపు ఉపసంహరించుకోవాలి

కడప, వినాయకనగర్ : గృహవినియోగదారుల సబ్సిడీ సిలిండర్లపై ప్రతి నెలా రూ.4లు పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాతీయ చమురు 111 డాలర్ల నుంచి 48 డాలర్లకు పడిపోయిందని, మరో వైపు ప్రధాని పిలుపు మేరకు కోట్లాది ప్రజలు సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవడం జరిగిందని ఈ తరుణంలో పేదలపై భారం మోపడం సరైంది కాదన్నారు. ఒకవేళ గ్యాస్ సబ్సిడీ ధరను పెంచుతూపోతే రానున్న ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

ఉపాధి పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప, వినాయకనగర్ : జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రజాతంత్ర యువ జన సమాఖ్య నాయకులు జగదీష్, శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బాలికల ఐటీఐలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ఇంటికి ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 7వ తేదీన కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య, మల్లి, సురేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

కడప, మారుతీనగర్ : ఎన్నికల హామీలో భాగంగా టీడీపీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుంకేసుల బాదుల్లా డిమాండ్ చేశారు. బుధవారం గుంతబజార్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బాబు వస్తే జాబు వస్తుందని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీని అటకెక్కించడం దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో చుక్కలు చూపించడం ఖాయమన్నారు.

సమస్యల నిలయం రామరాజుపల్లె


మురుగు కాలువల పరిస్థితి ఇలా...

డ్రైనేజీ సమస్తం అస్తవ్యస్తం ●దుర్గంధం వీడటం లేదు



అంటు రోగాలతో బాధపడుతున్నాం

డ్రైనేజీలో మురుగు తియ్యక చెత్త చెదారం పెరుకపోయి వాసన తట్టుకోలేక అనేక రోగాల బారిన పడుతున్నారు. దీంతో వేలాది రూపాయలు ఆసుపత్రులకు ఖర్చు చేయాల్సిన దుస్థితి వచ్చింది. వెంటనే ఫాగింగ్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● పవన్ కుమార్‌రెడ్డి, దుకాణాదారుడు.

రోడ్ల మధ్యలో తవ్వారు పూడ్చ లేదు

రోడ్ల మధ్యలో తవ్వారు కానీ పూడ్చ లేదు. వర్షం వస్తే ఏ గుంత ఎక్కడ ఉందో ఎక్కడ కాలు పెట్టాలో తెలియడం లేదు. చాలా సార్లు కిందపడి పోయాం. తవ్విన రోడ్లకు మోక్షం ఎప్పుడు వస్తుందో ఏమో మరి.


● బీబీ, స్థానికురాలు.

కడప, రవీంద్రనగర్ : కడప నగరం శివారులోని రామరాజుపల్లె సమస్యల నిలయంగా మారింది. కాలువలు సరిగా లేవు. ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరంతా నిలిచిపోయింది. కాసులు ఖర్చవుతున్నా కనీస సదుపాయాలు లేవు, ఏటా నిధుల లెక్కల పెంచుతున్నా పరిశుభ్రత కట్టకడనే ఉంది. 1500 కుటుంబాలు ఉన్న రామరాజుపల్లె అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. నడిరోడ్డులోనే చెత్త వేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు కనిపించలేదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం పగల కొట్టిన రోడ్లు పరిస్థితి దారుణంగా ఉంది. కాలువలలోని మురుగు నీరంగా అక్కడే ఆగిపోయింది. సిమెంటు రోడ్లను పగలగొట్టారు. దీంతో అవి మట్టిరోడ్లుగా మారాయి. వర్షం వస్తే తవ్విన రోడ్లల్లో నీరు నిలబడి నడవడానికి వీల్లేకుండా ఉన్నాయి. ఇళ్ళ మధ్యలో మురుగు కాలువల నీరంతా ఆగిపోయి వాసన తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు. దీనికి తోడు దోమలు దాడిని ఎదుర్కోలేకపోతున్నామని అసహాయతను వ్యక్తం చేస్తున్నారు. దీని వలన చిన్న పిల్లలు,మహిళలు, వృద్ధులు అనేక రోగాల బారిన పడుతున్నారు. అనేక సార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు. ఓట్ల కోసం తప్ప మిగతా సమయాలలో ఇటువైపు కూడా చూడరని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకునే నాధుడే లేడని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడపడితే అక్కడ ఆగిపోయింది. మురుగు కాలువలు తీసేవారు రావడం లేదు. చెత్త తీసుకోపోవడానికి వాహనాలు రావడం లేదు. పారిశుధ్యం అధ్వానంగా మారింది. ప్రజలు ముక్కులు మూసుకుని తిరుగుతున్నారు. రాత్రి వేళల్లో ఈ వాసన మరి ఎక్కువగా వస్తోందని స్థానికులు తెలిపారు. వీటిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.




కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము, నిలిచిన చెత్త చెదారం


ఇళ్ళ మధ్యలో మురుగు నీరు

ఉక్కు పరిశ్రమకు సీమ ఎంపీలు గళమెత్తాలి

కడప, అర్బన్ : జిల్లాలోని ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలంటే రాయలసీమ ప్రాంత పార్లమెంట్ సభ్యులు గళమెత్తి నినదించాలని, లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్,ఎన్ ఆర్ఐ కళాశాల ఛైర్మన్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి అన్నారు. ఉక్కు పోరాట కమిటీ చేస్తున్న నిరాహార దీక్షలు బుధవారం 27వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ సాధనకై పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలన్నారు. ఈ దీక్షలో విద్యార్థి నాయకుడు సాత్విక్ ఆధ్వర్యంలో ఆరుగురు దీక్షల్లో కూర్చున్నవారికి పూల మాలలు వేశారు.

కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్, ఓబయ్య, రాజు, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు, భరత్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షల్లో పాల్గొన్న నాయకులు,తదితరులు

కువైత్ లో జిల్లా వాసి మృతి


టి.మురళీక్రిష్ణ(ఫైల్)

కడప, ఎర్రముక్కపల్లె : రైల్వేకోడూరు ఓబులవారిపల్లెకు చెందిన టి.మురళీ క్రిష్ణ కువైత్ లో మృతి చెందారు. మృతదేహాన్ని భారత్ కు తరలించేందుకు కువైత్ కు చెందిన వైఎస్ఆర్‌సీపీ సేవాదళ్ ఇన్ చార్జి గోవిందరాజు భారత్ రాయబారి కార్యాలయంలో ఎమిగ్రేషన్ పనులు పూర్తి చేసి భారత్ కు తరలించే ఏర్పాటు చేసినట్లు గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ తెలిపారు. మృతదేహాన్ని చెన్నై నుంచి స్వగ్రామానికి తరలించేందుకు రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి ఉచిత అంబులెన్స ఏర్పాటు చేశారన్నారు. అలాగే కువైత్ లో మృతదేహాన్ని వైఎస్ఆర్‌సీపీ సభ్యులు సందర్శించి నివాళులర్పించారు.

ముంపు బాధితులకు న్యాయం చేయండి

కడప, మారుతీనగర్ : ముంపు ప్రాంత బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఒంటిమిట్ట మండలం ఇబ్రహీంపేట పెన్నపేరూరు ముంపు బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. చాలా కాలంగా భూములు పోగొట్టుకొని జీవనం సాగిస్తున్న తమకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే విధంగా చూస్తానని కడప నగరానికి చెందిన పాలెంపల్లె చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి మమ్మల్ని నమ్మించగా కొంతమేర డబ్బులను ఇవ్వడం జరిగిందన్నారు. 2006లో ప్రభుత్వం పూర్తిస్థాయిలో సగం వంతున ఎకరాకు రూ.6లక్షలు నష్టపరిహారం కింద డబ్బులు ఇచ్చిందన్నారు. తమకు వచ్చిన ఆ డబ్బులో నుంచి చంద్రశేఖర్‌రెడ్డి 47శాతం డబ్బులను దండుకొని మిగతా డబ్బులను ఇచ్చారన్నారు. అదే తరహాలో 2017లో ప్రభుత్వం మిగతా సగభాగం చొప్పున అందించిన నష్టపరిహారంలో కూడా 43శాతం డబ్బులను హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఒక్కొక్కరికి ఎకరాకు 14 నుంచి 15లక్షలు వచ్చిందన్నారు. ముంపుబాధితుల నోట్లో దుమ్ముకొట్టేలా మా డబ్బులు అన్యాయంగా హస్తగతం చేసుకున్న అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ముంపు ప్రాంత బాధితులు రామసుబ్బారెడ్డి, ఎన్ .సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, జయరామిరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

మధ్యాహ్నం 2 వరకే కరెంట్ బంద్

గాలివీడు: గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే మండల కేంద్రంలో కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ నరేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విద్యుత్ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యుత్ స్తంభాల లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాడీఫ్రిజర్ వితరణ

రాయచోటిరూరల్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బాడీఫ్రిజర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా గాలివీడు మండలం నూలివీడు వాస్తవ్యులు గఫార్‌సాహెబ్ గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దాతృత్వంతో ప్రజల సౌకర్యార్థం బాడీఫ్రిజర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ మృతుల కోసం బాడీఫ్రిజర్‌ను వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేష్‌కుమార్, రోటరీక్లబ్ అధ్యక్షుడు సయ్యద్ అస్రఫ్‌అలీ, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఖాదర్‌బాషా, సఫీ, అసిస్టెంట్ గవర్నర్ దేవకీసురేష్‌కుమార్, రొటేరియన్లు షబ్బీర్, కుప్పం శివప్రసాద్, సాయినాధ్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



బాడీఫ్రిజర్ వితరణ చేస్తున్న దృశ్యం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శిక్షణా కార్యక్రమానికి హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి

రాయచోటిటౌన్: చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో రాయచోటి ఏరియా పరిధిలోని ఐదు మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ తెలుసుకున్న విషయాలను ప్రతి స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లో శిక్షణ ఇచ్చి వారికి అందుబాటులో ఉండే చిరుధాన్యాల ద్వారా ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా ఆర్థిక సాధికారిత సాధించాలన్నారు. చిరుధాన్యాల ద్వారా ఆహార పదార్థాలు తయారు చేసే వారికి డీఆర్‌డీఏ రుణాలు ఇచ్చి ఆదుకుంటామన్నారు. చిరుధాన్యాల ద్వారా రాగి రొట్టెలు, జొన్న రొట్టెలు, రాగిమాల్ట్, రాగి, జొన్న, పాప్‌కాన్‌లను తదితర 16 రకాల చిరుధాన్యాల ఆహార పదార్థాలను తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీడీ నాగరాజు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వర్ణలత, ఏరియా కోఆర్డినేటర్ వేణుమాధవ్, ఏపీయంలు శైలజ, శ్రీలక్ష్మి, ఆర్ముగం, డీయంజీ ఆనంద్‌బాబు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

గల్ఫ్‌దేశాలకు వెళ్లిన వారు, వెళ్లేవారి సమాచారం ఇవ్వండి

గాలివీడు: గల్ఫ్‌దేశాలైన కువైట్, సౌదీఅరేబియా వంటి దేశాలకు వెళ్లేవారు, ప్రస్తుతం ఆయా దేశాలకు వెళ్లిన వారి పూర్తి సమాచారం వీఆర్‌వోలకు అందజేయాలని తహసీల్దార్ భవానీ పేర్కొన్నారు. బుధవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా బంధం అనే కార్యక్రమం ద్వారా గల్ఫ్‌దేశాలకు వెళ్లినవారు, వెళ్లువారు సమాచారాన్ని సేకరించాల్సిందిగా ఆదేశించిందన్నారు. ఆధార్, రేషన్‌కార్డుల నెంబర్లు, పాస్‌పోర్టు, మొబైల్‌నెంబర్ వారి ఫోటోను వీఆర్‌వోలకు అందించి సహకరించాలన్నారు. ఇలాంటి వారి పూర్తి సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటే గల్ఫ్‌దేశాల్లో వారికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా వారిని ఆదుకోవడానికి చర్యలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యునీత్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌వో రవీంద్రారెడ్డి, పుష్పరాజు, వెంకటనారాయణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న భజరంగ్‌దళ్ సమ్మేళనం

గాలివీడు: ఈనెల 12వ తేదీన రాయచోటిలో రాష్ట్ర భజరంగ్‌దళ్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ మండల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని విశ్వహిందూ పరిషత్ సభ్యులు రావాల్సిందిగా ఆయన సూచించారు. కార్యక్రమానికి వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేంద్రజైన్ హాజరవుతున్నారన్నారు. 13న యాత్ర జరుగుతుందన్నారు.

కేంద్రం నిధులపై రాష్ట్ర ప్రభుత్వ పెత్తనమేంటి?


మాట్లాడుతున్న సర్పంచ్ రవిరాజు

రామాపురం: పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులపై రాష్ట్ర ప్రభుత్వ పెత్తనమేంటని జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రతినిధి, దిన్నెపాడు సర్పంచ్ రవిరాజు ప్రశ్నించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు ఇస్తున్న నిధులపై ఆంక్షలు పెట్టడం తగదన్నారు. రాజ్యాంగంలోని 73వ ఆర్టికల్ ప్రకారం గ్రామ పంచాయతీల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు అందజేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు మంజూరు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. సర్పంచ్‌లపై కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పంచాయతీలకు నేరుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 14వ ఫైనాన్స్‌లో 50 శాతం ఉపాధి హామీ నిధులను గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణాల్లో ఖర్చు చేయించి వాటికి చంద్రన్నబాట పేరు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. సర్పంచ్‌లపై పెత్తనం చెలాయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్ర మంలో మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మున్నీర్‌బాషా, సుబ్బారెడ్డి, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసులు కీలకం


బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీఐ పుల్లయ్య

రామాపురం: సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసు డిపార్టుమెంట్ పాత్ర చాలా కీలకమైనదని లక్కిరెడ్డిపల్లె సీఐ పుల్లయ్య అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బదిలీపై వెళ్లిన ఆరుగురు కానిస్టేబుళ్లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల నడవడికలను ప్రతి ఒక్కరూ గుర్తిస్తుంటారన్నారు. మన ప్రవర్తన, ప్రజల్లో కలిసిపోయే విధానంపై డిపార్టుమెంట్‌కు మంచిపేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న బదిలీపై వెళ్లిన ఓబులేసు, రమేష్‌బాబుబు, రంగయ్య, మహేశ్వర్‌రెడ్డి, సాయినాధ్, బాషను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ క్రిష్ణమూర్తి, ఏఎస్‌ఐ వెంకటయ్య, రాజ్‌కుమార్, నాగరాజు, సుబ్బరాయుడు, జగన్‌నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి హౌసింగ్ గ్రామసభలు

గాలివీడు: ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో హౌసింగ్ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ రెడ్డెయ్య తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 3న గోపనపల్లె, ప్యారంపల్లె, పూలికుంట, పందికుంట, 4న తలముడిపి, కొర్లకుంట, నూలివీడు, 5న గుండ్లచెరువు, గరుగుపల్లె, ఎగువ గొట్టివీడు, 7న అరవీడు, తూముకుంట, 8న గాలివీడు, వెలిగల్లు గ్రామాల్లో తహసీల్దార్ భవానీ, ఎంపీడీవో వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2016లో నిర్వహించిన పల్స్‌సర్వేలో పక్కా గృహాలు లేని వారిని గుర్తించిన జాబితాలను గ్రామసభల్లో తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ బ్రహ్మానందరెడ్డి, తదితరులు ఆపల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణ

సంబేపల్లె: మండల పరిధిలోని సంబేపల్లె-నర్సారెడ్డిగారిపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురైంది. గాండ్లపల్లె వద్ద అదే గ్రామానికి చెందిన వ్యక్తులు రోడ్డు పక్కన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి రాతికూసాలను నాటారు. గతంలో ఇదే స్థలంలో బండరాళ్లు తోలడంతో గ్రామస్తులు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు అప్పుడు వారిని హెచ్చరించి ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమిస్తే కేసులు బనాయిస్తామని చెప్పారు. అయితే కొన్ని రోజులు ఉండి తిరిగి ఆర్‌అండ్‌బీ స్థలంలో కూసాలు నాటి ఆక్రమణకు పాల్పడ్డారు. అధికారులు ఆక్రమణపై సక్రమంగా పట్టించుకోకపోవడంతోనే ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించి స్వేచ్ఛగా విక్రయాలు కూడా చేపడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆర్‌అండ్‌బీ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన నాటిన కూసాలు

అనాథ వృద్ధులకు పింఛన్ల పంపిణీ

గాలివీడు: మండల కేంద్రంలో ఎలాంటి అసరాలేని అనాథ వృద్ధులు ఐదుగురికి బుధవారం నారా లోకేష్ యువసేన ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు. ప్రతి నెల ప్రభుత్వం ద్వారా పింఛన్లు అందని వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.1000 ప్రకారం యువసేన అధ్యక్షుడు రేవనూరి రాజ్‌కుమార్ అందిస్తున్నారు. ఇదే తరహాలో ఈ నెలలో కూడా ఐదుగురికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బాబ్జి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు

● తహసీల్దార్ దేవలానాయక్

రామాపురం: మండలంలో అర్హులైన ప్రతి పేదవారికి పక్కా గృహం మంజూరవుతుందని తహసీల్దార్ దేవలానాయక్, ఎంపీడీవో అబ్దుల్‌రహీం తెలిపారు. మండలంలోని హసనాపురం, గువ్వలచెరువులో బుధవారం పక్కా గృహాలు లేని అర్హులైన వారిని గుర్తించారు. మండలంలో గతంలో నిర్వహించిన సాధికారిత, పల్స్‌సర్వేలో పక్కా గృహాలు లేని వారిని గుర్తించడానికి తహసీల్దార్ టీం, ఎంపీడీవో టీంలు గ్రామంలో పర్యటించి అర్హులైన వారిని గుర్తించి పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. తహసీల్దార్ టీం మండలంలో 3న సరస్వతిపల్లె, రాచపల్లె, 4న నల్లగుట్టపల్లె, 5న సుద్దమళ్ల, ఎంపీడీవో టీం 3న కల్పనాయునిచెరువు, గోపగుడిపల్లె, 4న బండపల్లె, కుమ్మరపల్లె, 5న నీలకంఠ్రావుపేట, కల్పనాయునిచెరువు, 7న చిట్లూరు పంచాయతీల్లో పర్యటించి అర్హులైన వారిని గుర్తిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులరెడ్డి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ అహమ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్ - 5250 నగదు స్వాధీనం

చిన్నమండెం: మండలంలోని శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో మంగళవారం రాత్రి జూదశాలపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి రూ.5250 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మండలంలోని శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో జూదమాడుతున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు జూదరులు పట్టుబడ్డారని తెలిపారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం- మహిళ అరెస్ట్

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ పరిధిలోని గాలివీడు మండలం తూముకుంట తాండాకు చెందిన బుక్కే మంగమ్మ బుధవారం బోరెడ్డిగారిపల్లె క్రాస్ వద్ద 12 మద్యం బాటిళ్లు తీసుకుని వెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్లు సీఐ తేజశ్వర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు చేసిన మహిళను కోర్టుకు అప్పగించినటు ఆయన తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పోరుమామిళ్ల : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని జేవీవీ నాయకులు జమ్మూల్‌బాష, మస్తాన్, నాయబ్‌రసూల్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జేవీవీ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసవించిన గంటలోపే పిల్లలకు ముర్రుపాలు తాపిస్తే వ్యాధి నిరోధకశక్తి వస్తుందన్నారు. నసీంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2017-18 సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి తెలిపారు. 10వ తరగతి పాసైన, ఇంటర్‌ఫెయిల్ అయిన వారు ప్రవేశానికి అర్హులన్నారు. వివరాలకు 9494077885లను సంప్రదించాలన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



కోదండరామస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని కమ్మవారిపల్లె కోదండరామస్వామి ఆలయంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆయన కమ్మవారిపల్లెలో ఇటీవల నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సీఎం బాషా, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఇస్హాక్, సంగా వసంతరాయులు, కలవకూరి వెంకటరమణ, చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట తాగునీటిని సరఫరా చేయాలని ధర్నా నిర్వహిస్తున్న పేదలు

బద్వేలు : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదల కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బుధవారం భూపోరాట కేంద్రం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు 2వేల మంది మహిళలతో భారీ ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూపోరాట కమిటి కన్వీనర్ మహబూబ్‌బాషా, ఇమ్మానియేలు మాట్లాడుతూ 811 సర్వేనెంబర్‌లో మడకలవారిపల్లె పంచాయతీ పరిధిలో గుడిసెలు వేసుకొని 8నెలల నుంచి రాత్రింబవళ్లు అక్కడ ఉంటున్న పేదలకు మున్సిపల్ అధికారులు మంచినీటిని కూడా సరఫరా చేయడం లేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం చెందారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో మౌళాలి, భద్రి, జయరాజ్, నరసింహులు, రవీంద్ర, లక్షుమయ్య, యేసోబు, ప్రసాద్, నూర్జాన్, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాలకు లబ్ధిదారులు ఎంపిక



టి. సంద్రపల్లెలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గోపవరం : మండలంలో పక్కాగృహంలేని వారి వివరాలను సేకరించి వారికి గృహాన్ని మంజూరు చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టి.సంద్రపల్లె పంచాయతీలో హౌసింగ్ ఏఈ రఫికుద్దీన్ ఆధ్వర్యంలో ప్రజాసాధికారిక గ్రామసభ నిర్వహించారు. ఈ పంచాయతీలో ఇళ్లు లేనివారు 102 మంది కాగా, అందులో గ్రామసభకు 90 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 60మంది మాత్రమే వివరాలన్నింటినీ అందజేశారని, మిగతావారు 5వ తేదీలోపు వివరాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. రేషన్ కార్డు, బ్యాంకు పాసుబుక్కు జిరాక్స్ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలు అన్నింటినీ ఈనెల 15కల్లా ఉన్నతాధికారులకు అందజేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్షుమ్మ, మాధవరెడ్డి, హౌసింగ్ వర్కింగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపై నడక సాగేదెలా..?



రాళ్లు తేలిన జొన్నవరం రోడ్డు, సీసీరోడ్లు లేని జొన్నవరం దళితవాడ

అట్లూరు : మండల పరిధిలోని ముత్తుకూరు, జొన్నవరం గ్రామాల్లోని రహదారుల్లో ప్రయాణం సాగించాలంటే నిత్యం నరకయాతన పడాల్సిందే. రహదారులు రాళ్లు లేచి అధ్వానంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు నడవాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్లపై నిలిచి నీరు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని వాపోతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపై గుంతలుపడి ఉన్న ప్రదేశాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రోడ్ల వెంట చిన్నపిల్లలు, వృద్ధులు నడవాలంటే నరకయాతన పడుతున్నారు. మండలంలో సీసీరోడ్లు అన్ని గ్రామాలకు వేస్తున్నారు కానీ, మా గ్రామాలకు మాత్రం వేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగచేసుకొని ముత్తుకూరు, జొన్నవరం గ్రామాల రోడ్లకు మోక్షం కలిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

అట్లూరు : మండల పరిధిలోని ముంపునకు గురైన గ్రామాల్లో కలెక్టర్ బాబూరావు నాయుడు పర్యటించనున్నారని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. ముంపు గ్రామాలైన చింతువాండ్లపల్లె, వరికుంట్ల, రంగంపల్లె గ్రామాలను కలెక్టర్ పరిశీలించడం జరుగుతుందన్నారు. ముంపువాసుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ పరిశీలన ఉంటుందన్నారు. ముంపు గ్రామస్థులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లవచ్చున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ప్రొద్దుటూరు టౌన్: పట్టణంలోని రెండు మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు ఓ విశ్రాంత అధ్యాపకుడు మైక్‌సెట్ వితరణ చేశారు. రిటైర్డు జూనియర్ లెక్చరర్ ఎస్.శివశంకర్‌రెడ్డి తన మనుమడి జన్మదినం సందర్భంగా వైఎంఆర్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు, రెండవ వార్డు మున్సిపల్ హైస్కూలుకు రూ.6 వేలు విలువచేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు. శివశంకర్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీ సెంటర్లను కుదించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

బద్వేలు టౌన్ : అంగన్వాడీ సెంటర్లను కుదించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించాలన్నారు. అంగన్ వాడీ సెంటర్ల పరిధిలో అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించాలని కోరారు. అద్దెలు కూడా చెల్లించడం లేదని, అలాగే 15 నెలల నుంచి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, టీఏ, గ్యాస్ బిల్లులు ఇవ్వని కారణంగా అంగన్వాడీ కార్యకర్తల అప్పులు తెచ్చి సెంటర్లు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పుడు అదనంగా ఏటువంటి అడ్వాన్సులు ఇవ్వకుండా అమృత హస్తం పథకం అమలు చేయాలని బలవంతం చేస్తున్నారన్నారు. ఈ సమస్యలను పట్టించుకోకుండా ఉన్న సెంటర్లను కుదించి అంగన్వాడీ కేంద్రాలను ఎత్తివేయడానికి ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటరమణ, చిన్ని, అంగన్వాడీ కార్యకర్తలు సుభాషిని, హుస్సేనమ్మ, జయప్రద, శ్రీదేవి, రాధమ్మ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేయాలని చూస్తే సమరశంఖం పూరిస్తాం



బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో సిలిండర్లతో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు టౌన్ : బీజేపీ ప్రభుత్వం గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేయాలని చూస్తే సమరశంఖం పూరిస్తామని సీపీఐ ఏరియా, పట్టణ కార్యదర్శులు వీరశేఖర్, చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం స్థానిక జేవీభవన్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు గ్యాస్ సిలిండర్లను భుజానికి ఎత్తుకొని మహిళలతో భారీ ర్యాలీగా వచ్చి విన్నూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ, అనేక ప్రభుత్వ పథకాలను ప్రజలకు దూరం చేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా పేదలకు తెల్లరేషన్ కార్డుల ద్వారా అందిస్తున్న కిరోసిన్, చక్కెరను దూరం చేసిందని, నేడు పేదవారిని మరింత పేదవారిగా మార్చేందుకు కొత్త వ్యూహం రచించి, అందులో భాగంగానే దశలవారీగా వంటగ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేయడానికి ప్రణాళికలను రూపొందించిందని వారు మండిపడ్డారు. పేదల కడుపుకొట్టే నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేసి, బీజేపీ ప్రజా వ్యతిరేఖ విధానాలపై సమరశంఖం పూరిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జకరయ్య, చంద్రమోహన్ రాజు, శ్రీనివాసులు, సంజీవ్, అనిల్, విజయమ్మ, లక్షుమ్మ, సలోమి, బాలమ్మ పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

బద్వేలు	9885304960
బద్వేలుటౌన్	9640614371
బద్వేలు రూరల్	9989552974
పోరుమామిళ్ల	9441284007
కలసపాడు	9491946171
కాశినాయన	9985408967
గోపవరం	8374482744
బి.కోడూరు	9441815476
అట్లూరు	8142454286

సినిమా గ్రాఫ్

బద్వేలు	
శేఖర్	: గౌతమ్‌నంద
నౌషాద్	: ఫిదా
లక్ష్మీనరసింహ	: నిన్నుకోరి
పోరుమామిళ్ల	
వెంకటేశ్వర	: ఫిదా
దేశాయి	: గౌతమ్‌నంద

ప్రొద్దుటూరు ప్రజల సమస్యలన్నీ తీరుస్తున్నాం

● రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రొద్దుటూరు ప్రజల సమస్యలన్నీ తీరుస్తున్నామని ఆ పార్టీ నేత, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రధాన ప్రాథమిక సమస్యలన్నీ తీరుస్తున్నామన్నారు. ప్రొద్దుటూరు ప్రజల తాగునీటి ఎద్దడి నివారణకు మైలవరం డ్యాం నుంచి రూ.132 కోట్లతో పైపులైను పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. పనులు మెగా ఇంజినీరింగ్ కంపెనీకి వచ్చాయని తెలిపారు. ఇందుకు ప్రతి ఏడాది మైలవరం నుంచి ఒక టీఎంసీ నీటి విడుదలకు ప్రభుత్వం నుంచి అనుమతులు కోరామని చెప్పారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కొత్తగా 13000 కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇచ్చామని పేర్కొన్నారు. వీటి వల్ల పెన్షనర్లు, పక్కా ఇళ్లు వారికి వస్తున్నాయన్నారు. అర్బన్ హౌసింగ్ స్కీంలో సుమారు 6200 పక్కా ఇళ్లు మంజూరయ్యాయన్నారు. దీంతో అందరికి సొంత ఇళ్లు వస్తాయన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గంలోని సుమారు 200 మందికి రూ.10 కోటర్ల ఆర్థికసాయం మంజూరైందన్నారు ఇవన్నీ తన కృషి వల్లే వచ్చాయన్నారు. తాను ఎంతో కష్టపడ్డానన్నారు. పలుమార్లు హైదరాబాదు, అమరావతి, ఢిల్లీల చుట్టూ తిరిగానన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ ఇన్‌ఛార్జి చైర్మన్ ముక్తియార్, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం- జడ్జి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న కమలాపురం జడ్జి శివకుమార్‌యాదవ్

ఎర్రగుంట్ల: ఇళ్లకు విద్యుత్ చౌర్యం నేరమని దానికి చట్టపరమైన శిక్షలు తప్పవని కమలాపురం జడ్జి జి.శివకుమార్‌యాదవ్ తెలిపారు. ఎర్రగుంట్ల సబ్‌స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన మండల న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి శివకుమార్‌యాదవ్ మాట్లాడుతూ మీటర్ తిరకుండా చేయడం, చట్ట వ్యతిరేఖమైన చర్యలకు పాల్పడం సరికాదన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడి దొరికితే చట్టపరంగా ఉన్న శిక్షలను ఈసందర్భంగా వివరించారు. కార్యక్రమంలో డీఈ, ఎఈ, ఎస్ఐ వీరబ్రహ్మం, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ పాలకవర్గం
పదవుల పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గం ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవ్వడంతో పోటీకి పలువురు సిద్ధమవుతున్నారు. సుమారు రూ.45.84 కోట్లు డిపాజిట్లు, రూ.15.68 కోట్లు పెట్టుబడులు కలిగిన టౌన్‌బ్యాంక్ పదవులకు ఈసారి గట్టి పోటీ ఏర్పడనుంది. ప్రొద్దుటూరుతోపాటు ఎర్రగుంట్ల, బద్వేలు, కడపలో బ్యాంక్ శాఖలు ఉండటంతో అక్కడ ఉద్యోగాల నియామకాలు సైతం పూర్తిగా పాలకవర్గం చేతుల్లోనే ఉన్నాయి. దీంతో పలువురు బ్యాంక్ డైరెక్టర్, చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. పోటీకి ఆలోచిస్తున్నారు. సిద్ధమవుతున్నారు. చాలాకాలంగా ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్ పాలకవర్గం మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డిల అనుయాయులతోనే ఉంది. వరుసగా డాక్టర్ ఎంవీఆర్ వర్గానికి చెందిన కొర్రపాడు సత్యం, వరదరాజులరెడ్డి వర్గానికి చెందిన కాకర్ల లింగారెడ్డిలు బ్యాంక్ చైర్మన్లుగా కొనసాగారు. వారి తర్వాత ఇప్పటి వరకు చైర్మన్లుగా మెల్లాల కుమార్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఈయన రమణారెడ్డి, వరదరాజులరెడ్డిలకిద్దరికి అనుకూలంగా ఉంటున్నారు. ఇప్పటి వరకు ఆ ఇద్దరు నాయకులు చెప్పిన వారికే బ్యాంకుల్లో ఉద్యోగాలు ఇస్తున్నారు. ఇతరులెవ్వరికి అవకాశాలు ఇవ్వడంలేదు. ఈ పరిస్థితుల్లో బ్యాంకు పాలకవర్గ పదవులపై అందరి దృష్టిపడింది. టీడీపీ, వైసీపీలతోపాటు కాంగ్రెస్, ఇతర పార్టీలవారు, స్వతంత్రులు కూడా ఈ దఫా టౌన్ బ్యాంక్ పదవులకు పోటీకి సిద్ధమవుతున్నారు. ప్రొద్దుటూరు హౌస్‌బిల్డింగ్ సొసైటీ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తుండడంతో అందులోని కొంతమంది టౌన్‌బ్యాంక్ పాలకవర్గంలోకి రావడానికి దారి చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈసారి ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకు పాలకవర్గానికి గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

సదస్సును జయప్రదం చేయండి


ముద్దనూరు:మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఈ నెల 6న తిరుపతిలో జరిగే ఐక్యతా సాధన రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా పిలుపునిచ్చారు. ఉదయం 10గంటలకు గంధమనేని శివయ్య భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో సదస్సు జరుగనున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు హాజరు కావాలన్నారు.

ఎంపీటీసీలకు దక్కని గౌరవ వేతనం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక సంస్థల ప్రతినిధులైన ఎంపీటీసీలకు ఎనిమిది మాసాల నుంచి గౌరవ వేతనం అందలేదు. స్థానిక సంస్థల్లో మధ్యస్తంగా ఉన్న మండల ప్రజాపరిషత్ లో ఎంపీటీసీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మండల ప్రజాపరిషత్ లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఎలాంటి నిధులను మంజూరు చేయడంలేదని ఎంపీటీసీలు వాపోతున్నారు. అభివృద్ధి నిధుల లేమితోపాటు ఎంపీటీసీలకు సకాలంలో గౌరవ వేతనం దక్కకపోవడంపై ప్రజాప్రతినిధులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 559 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ప్రభుత్వం గౌరవ వేతనం అందిస్తోంది. 2016 డిసెంబరు వరకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చారు. అప్పటి నుంచి జూలై ముగుస్తున్నా వేతనం అందడం లేదు. 2015-16 ఆర్థిక ఏడాది చివరిలో మూడు మాసాల బిల్లులను ఎంపీడీవో సిబ్బంది ట్రెజరీ కార్యాలయాలకు అందజేశారు. బడ్జెట్ లేకపోవడంతో బిల్లులు మంజూరు కాలేదని సిబ్బంది తెలిపారు. జిల్లా పరిదిలో ఉన్న 50 మంది జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం సకాలంల అందలేదు. ఒక్కో జడ్పీటీసీకి రూ.6 వేలను ప్రభుత్వం గౌరవ వేతనంగా అందిస్తోంది. జడ్పీటీసీ సభ్యులందరికి గౌరవ వేతనం ఇవ్వాలంటే ప్రభుత్వం తక్కువ నిధులు మంజూరు చేయడంతో ఫిబ్రవరి వరకు వేతనం మంజూరు చేశారు. ఒక నెల వేతనం అందాలంటే రూ.10.38 లక్షలు అవసరం కాగా రూ.5 లక్షలు మాత్రమే మంజూరు కావడంతో ఆ నెల వేతనాన్ని చెల్లించారు. అప్పటి నుంచి నేటికి గౌరవ వేతనం దక్కలేదు. ఎంపీటీసీలతోపాటే ఎంపీపీలకు గౌరవ వేతనం అందలేదు. ఎంపీపీలకు నెలకు రూ.6 వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది. మండల ప్రజాపరిషత్ అభివృద్ధిపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎంపీటీసీలు పేర్కొంటున్నారు.

కాసులు కురిపిస్తున్న
ఇసుక రవాణా నియంత్రణ

పట్టుకుంటే రూ.10 వేలు వసూలు ● మున్సిపాలిటీ ఉద్యోగికి కాసుల వర్షం



ప్రొద్దుటూరు కల్చరల్ : అనుమతి లేని ప్రాంతాల నుంచి ఇసుక రవాణా అరికట్టేందుకు నియమించిన కొందరు సిబ్బంది ఇసుకు నుంచి కాసులు రాల్చుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. పెన్నానది నుంచిఇసుక రవాణా చేస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు రెవెన్యూ శాఖలో వీఆర్వోలతోపాటు మున్సిపాలిటీ శాఖలో కొందరు సిబ్బందిని తహసీల్దారు వెంకటరెడ్డి ఏర్పాటు చేశారు. ఈ టీంలో మున్సిపాలిటీ శాఖ నుంచి ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించబడిన ఓ ఉద్యోగి తనకు కాసులు ఇవ్వని ఇసుక ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. తనకు నిత్యం కాసులు అందించే ట్రాక్టర్లను మాత్రం చూసీచూడనట్లు ఉన్నట్లు తెలుస్తోంది. సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో ఈశ్వర్‌రెడ్డినగర్, రామేశ్వరం, పెన్నానగర్ ప్రాంతాల్లో దాదాపు వందకు పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. ఈ ట్రాక్టర్లలో కొందరు ట్రాక్టర్ల యజమానులు ట్రాక్టర్ నుంచి రూ.500 చొప్పున వసూలు చేసి ఆ ఉద్యోగికి ఇస్తున్నట్లు సమాచారం. ఆ ఉద్యోగి చెప్పిన సమయంలో మాత్రమే ఆ ట్రాక్టర్లు ఇసుకను నింపుకోవాలి. అలాగే తనకు మామూళ్లు ఇవ్వని ట్రాక్టర్ ఇసుక రవాణా చేస్తే ఆ ఉద్యోగి రూ.10 వేలు నుంచి రూ.20 వేల చొప్పున చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ట్రాక్టర్ రెవెన్యూ కార్యాలయంలో స్వాధీనం అయితే వేల రూపాయల జరిమానాతోపాటు నెలల తరబడి ఉంటుందనే ఉద్దేశ్యంతో యజమానులు భయపడి ఆ ఉద్యోగికి ముడుపులు సమర్పించుకోవడం జరుగుతోంది. వారంలో తనకు ఆదాయం కల్పించని ట్రాక్టర్‌ను అధికారులకు పట్టించి తన విధి నిర్వహణను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. కల్లూరు సంఘటనతో వీఆర్ఏ సహాయంతోనిత్యం ఇసుక రవాణాపై వేట సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగికి రాజకీయ పలుకుబడి, అధికార పార్టీ నాయకుల అండదండల కారణంగా పారిశుద్ధ్య విధుల నుండి తొలగించి నిత్యం ఆదాయం కల్పించే విభాగంలో నెలల తరబడి కొనసాగిస్తున్నారు. జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని కొందరు బడా నేతలు ఇటుకల బట్టీల్లో సైతం ఇసుకను గుట్టలుగా నిల్వ చేసుకుంటున్నారు. మైదుకూరు రోడ్డులోని కొన్ని ఖాళీ స్థలాలతోపాటు బడా నిర్మాణాలు చేసే చోట్ల ఇసుక రాసులున్నాయి. ఈ సంఘటనలే ఇసుక రవాణాను నియంత్రించే సిబ్బందికి ఆదాయ మార్గాలుగా ఉన్నట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కన్నా శాశ్విత ఉద్యోగులను నియమించినప్పుడే ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పవచ్చు.

భర్తీకి నోచుకోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టులు

● నష్టపోతున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు టౌన్: బాలికల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. 100పైగా విద్యార్థులున్న జడ్పీ మున్సిపల్ పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్లను నియమిస్తోంది. ప్రభుత్వం ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఆరు సంవత్సరాలుగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టులు భర్తీకాక ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 25 ప్రాథమిక పాఠశాలలు ఉండగా హోమస్‌పేట, శ్రీనివాస నగర్, రామేశ్వరం, డీబీసీఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నాలుగు ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎల్‌ఎఫ్‌ఎల్ (లోఫిమేల్ లిటరసీ) హెడ్మాస్టర్ తన పాఠశాలల పరిధిలో బాలికలను బడిలో చేర్చడం, బలికల అక్షరాస్యతను పెంచడం, విద్యలో వెనుకబడిన ఆడపిల్లలను ప్రోత్సహించడం ప్రధాన బాధ్యత. సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులు ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టుకు అర్హులు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్‌కు రెండు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. గత ఆరు సంవత్సరాల ఎస్‌జీటీ టీచర్లకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్‌గా ప్రమోషన్లు ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్‌గా ప్రమోషన్ పొందాల్సిన టీచర్ గౌస్‌లాజం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడుగా రిటైర్డు కావడంతో ఇంక్రిమెంట్లు, వేతన పెంపును కోల్పోయి నష్టోపోయాడు. అయిదు సంవత్సరాల క్రితమే ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రమోషన్ పొందాల్సిన వెంకటయ్య అనే ఉపాధ్యాయుడు ఎస్‌జీటీగా కొనసాగుతూ ప్రమోషన్ బెనిఫిట్స్ కోల్పోయాడు. ఉపాధ్యాయుల నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

● ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఆరు సంవత్సరాలుగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టులు భర్తీ చేయకపోవడం దారుణమని యూటీఎఫ్ పట్టణాధ్యక్షుడు రవీంద్రుడు, కార్యదర్శి మోహన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్‌గా పదోన్నతి ఇవ్వడం వల్ల కమిషనర్ పూల్‌లో ఉన్న మిగులు ఉపాధ్యాయులు ప్రయోజనం పొందుతారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్లు ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్మాస్టర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు.

4న సామూహిక వరలక్ష్మీ వ్రతం

సంబేపల్లె: మండలంలోని శెల్లిపల్లె గ్రామం అడవికమ్మపల్లె శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు కువైత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

పాలెంపల్లెను పట్టించుకోండి

గుంతలమయంగా వీధులు.. నిలిచిన వర్షపునీరు, వెలగని వీధిలైట్లు ● అవస్థల్లో స్థానికులు

సిమెంటు రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి



గుంతల మయంగా ఉన్న రోడ్డులో వర్షపునీరు నిలబడి పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు వేయించి పుణ్యంకట్టుకోండి. నిత్యం ఏదో ఒక పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్ళాలంటే మురికినీటిలో వెళ్ళాల్సి వస్తోంది. పశువుల కోసం వామిలోకి గడ్డితేవాలన్నా, పొలాల వద్దకు వెళ్ళాలన్నా ఇతర పనులకు వెళ్ళాలంటే ఇబ్బంది ఉంది.

టి.ఓబులేసు, స్థానికుడు

మురికి నీటిలో తిరగలేకున్నాం



మురికి నీటిలో తిరగలేకున్నాం. పిల్లలు బడికెళ్ళాలన్నా, వెళ్ళమని వెయుండి కేస్తున్నారు.కొన్ని సంవత్సరాలుగా అవస్థలు పడుతున్నాం. మా బాధ అర్థం చేసుకుని దారి సౌకర్యం కల్పించండి.

సునీత, స్థానిక మహిళ



కడప, మారుతీనగర్ : నగరానికి కూతవేటు దూరంలో ఉన్న 50వ డివిజన్ పరిధిలోని పాలెంపల్లె గ్రామ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. పాలెంపల్లె నుంచి బచ్చుంపల్లెకు వెళ్ళే దారిలో ఉన్న బీసీ కాలనీ చెన్నకేశవులస్వామి గుడి దగ్గరగల సిమెంటు రోడ్డు నిర్మాణం జరిగి 18 సంవత్సరాలైంది. ఈ మధ్య కాలంలో ఆ రోడ్డు గుంతలమయమై స్థానికులు ప్రధాన రోడ్డుకు చేరుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారు. కాగా ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి జలమయమైంది. దీంతో పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఆ గుంతల్లో దారిపై నడవాలంటే జంకుతున్నారు. బయటకు వెళ్ళాలంటే, పిల్లలు స్కూల్‌కు వెళ్ళాలన్నా.. తదితర ఇతర అవసరాల కోసం బయటకు వెళ్ళాలంటే మురికి నీరులో వెళ్ళాల్సి వస్తోంది. నగరం నుంచి పాలెంపల్లెకు వచ్చే దారి కూడా సరిగ్గాలేదు. ఎక్కడపడితే అక్కడ గుంతలు వెలిశాయి. ఆటోలో గ్రామానికి వెళ్ళేవారి ఒళ్ళు హూనం అయ్యే పరిస్థితి దూరమవుతుంది. విద్యుత్ స్తంభాలు కొన్ని అలంకారప్రాయంగా ఉన్నాయి. వాటికి వీధిలైట్లు అమర్చినా వెలగని దుస్థితి. ఇన్ని సమస్యలున్నా సంబంధిత అధికారులుగానీ, కార్పొరేటర్‌గానీ మాకేందులే అన్నట్లుగా ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నీరు-చెట్టు పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేత

నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరామయ్య



చెక్‌డ్యాం నాణ్యతను పరిశీలిస్తున్న ఈఈ వెంకటరామయ్య

ఆంధ్రజ్యోతి, కడప సిటీ : నీరు-చెట్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిస్తే బిల్లులు నిలిపివేస్తామని నీటిపారుదల శాఖ ఈఈ డి.వెంకటరామయ్య హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని ఎర్రగుంట్ల, పొట్లదుర్తి, కమలాపురం, వల్లూరు మండలాల్లో నీరు-చెట్టు ద్వారా చేపట్టిన చెక్‌డ్యాం పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు కోర్ కటింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.70కోట్లతో వెయ్యి చెక్‌డ్యాంల నిర్మాణానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దంటూ కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడితే బిల్లులను నిలిపేయాల్సిందిగా కలెక్టర్ సూచించారన్నారు.

చైనా ఉత్పత్తులు నిషేధించాలి



కడప, ఎర్రముక్కపల్లె : చైనా ఉత్పత్తులను దేశంలో నిషేధించాలని స్విస్ట్ కళాశాల డైరెక్టర్ రాజోలి సాయిచరణ్ డిమాండ్ చేశారు. చైనా దేశ దురహంకారానికి ప్రతిఘటనగా స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి చైనా ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి, కళాశాల ఛైర్మన్ రాజోలి వీరారెడ్డి అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి 15లోగా దరఖాస్తు చేసుకోండి

కడప, మారుతీనగర్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో మిగిలిన ఖాళీలకుగాను 2వ దఫా ప్రవేశానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ జిల్లా ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఐటీఐలలో సుమారు 400 ఖాళీలు మిగిలివున్నాయన్నారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఎక్కడ చేరదలచుకుంటారో అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు 10వ తరగతి మార్కులిస్టు, కుల ధృవీకరణ పత్రాలు, టీసీ, ఆధార్‌కార్డు, ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్టు సైట్ ఫొటోలతో జిరాక్స్ పత్రాలను జతచేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 15వ తేది సాయంత్రం 5 గంటలలోగా జిల్లాలోని అన్ని ఐటీఐలలో ఇవ్వవచ్చన్నారు. ఇతర వివరాల కు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో సంప్రదించాలన్నారు.

తెలంగాణ మాదిరి విద్యుత్ కార్మికులకు క్రమబద్ధీకరించాలి

కడప, అర్బన్ : తెలంగాణ ప్రభుత్వం మాదిరి ఏపీలో విద్యుత్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యాలయంలో బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్, యూఈఈయు అధ్యక్షులు పుల్లయ్య, సంయుక్త అధ్యక్షతన విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు థర్మల్, ట్రాన్స్‌మిషన్, ట్రాన్స్‌ఫార్మర్స్ విద్యుత్ లైన్లు వ్యవసాయ కనెక్షన్లు తదితర 26 రకాల పనులు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, యూఈఈయూ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ పాల్గొన్నారు.

3211 మెమోను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

కడప, అర్బన్ : 3211 మెమోను రద్దు చేయాలని, ఐసీడీఎస్‌ను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పవద్దని అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. బుధవారం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదురుగా సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో కిలోమీటరు పరిధిలోని సెంటర్లను క్లబ్ చేయడం ద్వారా ప్రీస్కూళ్లకు పిల్లలు రావడానికి ఇబ్బందిగా వుందన్నారు. బాలింతలు, గర్భిణులు రోజు సెంటర్‌కు వచ్చి భోజనం తినాలన్నా ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం హర్షణీయం

కడప, అర్బన్ : మంగంపేట ఏపీఎండీసీ సంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ట్రైనీ కార్మికులకు కేంద్రం కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అమలుకు ఎండీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అలాగే ప్రాజెక్టు అలవెన్స్ 30శాతం కొనసాగించేటట్లు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి కోరారు. స్థానిక హోచ్ మిన్ భవన్ లో బుధవారం విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు.

మద్యపాన నిషేధ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కడప అర్బన్ : ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ పాల్గొంటున్న మద్యపాన నిషేధ సమావేశాన్ని జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బషీరున్నీసా, విజయలక్ష్మీ పిలుపునిచ్చారు. హోచ్ మిన్ భవన్ లోని రా.రా గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారుమాట్లాడారు. ఈ నెల 7న మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో జిల్లాలోని సమాఖ్య సభ్యులందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాల కుదింపు తగదు

● పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి ● నిరసన తెలిపిన అంగన్వాడీ వర్కర్లు

రాయచోటిటౌన్/లక్కిరెడ్డిపల్లె: రెండు, మూడు అంగన్వాడీ కేంద్రాలను కలిపి మోడల్ అంగన్వాడీ కేంద్రం పేరుతో ప్రభుత్వం చేపడుతున్న అంగన్వాడీ కేంద్రాల కుదింపును మానుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలంటూ బుధవారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అలాగే లక్కిరెడ్డిపల్లె అంగన్వాడీ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ప్రభావతమ్మ ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామాంజులు, అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, కార్యదర్శి బంగారుపాప మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల కుదింపు పద్ధతిని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలను వెంటనే ఇవ్వడంతో పాటు 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ, గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే బీఎల్‌వో, ఆన్‌లైన్, స్మార్ట్ సర్వేలను అంగన్వాడీలకు అప్పగించకూడదన్నారు. 400 జనాభా దాటిన మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతో పాటు మినీ అంగన్వాడీ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.750తో కలిసి జీతాలను ఖాతాల్లో జమ చేయాలన్నారు. అంగన్వాడీ సెంటర్లను ప్రైవేటు స్వచ్ఛంధ సంస్థలకు అప్పగిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ గుణభూషణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉపాధ్యక్షురాలు ఖాజాబీ, లీడర్లు లక్ష్మీదేవమ్మ, రమణమ్మ, విజయమ్మ, భారతి, సిద్దమ్మ, శైలజ, నాగమణి, ఓబులమ్మ, సావిత్రి, లక్కిరెడ్డిపల్లె అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కౌశల్యమ్మ, కోశాధికారి సుకుమారి, ఓబులమ్మ, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.





రాయచోటి తహసీల్దార్.. లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

ముగిసిన భజన గురువుల శిక్షణ కార్యక్రమం

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో జులై 15వ తేదీ నుంచి ప్రారంభమైన భజన గురువుల శిక్షణా కార్యక్రమం ఆగస్టు 2వ తేదీ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ బయారెడ్డి, సమరసత సేవా సంస్థ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 15 రోజుల పాటు శిక్షణ పొందిన భజన గురువులు ఆధ్యాత్మిక భావాలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి భగవద్గీత విశిష్టతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం భజన గురువులను, అతిధులను ఆలయ ఈవో మంజుల ఆధ్వర్యంలో అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భజన గురువులు హరినాధ, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



భక్తిపాటలను ఆలపిస్తున్న భజన గురువులు

రాయలసీమకు క్రిష్ణా జలాలు అందించాలి

లక్కిరెడ్డిపల్లె: రాయలసీమకు క్రిష్ణాజలాలను అందించాలని రాయలసీమ విద్యార్థి వేదిక కన్వీనర్ గంగరాజు పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ ప్రాంతాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాయలసీమ ముఖ్యమంత్రులంతా హైదరాబాదును అభివృద్ధి చేశారే తప్ప రాయలసీమ గురించి పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతర దేశాల నుంచి తీసుకొచ్చిన నిధులన్నీ అమరావతి అభివృద్ధికే పంచేస్తున్నాడే తప్ప తాను సీమ గురించి మరిచాడన్నారు. క్రిష్ణా, పట్టిసీమ నీరు రాయలసీమకు అందిస్తే రైతులు వలసలు వెళ్లకుండా నిలబడతారన్నారు. రాయలసీమలోనే కోర్టు, కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గంగరాజు

అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

రాయచోటిటౌన్: పట్టణంలోని కొత్తపేట రామాపురంలో ఉన్న మోడల్ అంగన్వాడీ కేంద్రంలోని 60 మంది విద్యార్థులకు బుధవారం మానవత సంస్థ, వృక్షరక్షణ సమితి, అటవీ శాఖ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్‌రాజు మాట్లాడుతూ మూడు అంగన్వాడీ కేంద్రాలను కలిపి ఒక మోడల్ అంగన్వాడీ కేంద్రంగా ఏర్పాటు చేసి అందులో ఎల్‌కేజీ, యూకేజీ, 1వ తరగతి విభజించి ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యను నేర్పించడం హర్షిందగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, మానవత సంస్థ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, వృక్షరక్షణ సమితి అధ్యక్షుడు తులసీశ్వర్‌రెడ్డి, సీడీపీవో వసంత భాయి, మానవత జిల్లా ఉపాధ్యక్షుడు శివ గంగిరెడ్డి, వృక్షరక్షణ, మానవత సభ్యులు శివారెడ్డి, వెంకటేష్, నారాయణరెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

అభివృద్ధి పథకాలను వేగవంతం చేయండి

● మెప్మా పీడీ రాంమోహన్‌రెడ్డి

రాయచోటిటౌన్: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అభివృద్ధి పథకాలను వేగవంతం చేయాలని మెప్మా పీడీ రాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని చిత్తూరు మార్గంలో ఉన్న స్త్రీశక్తి భవనంలో మున్సిపల్ సిబ్బందితో పాటు స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాలు ఆర్థిక సాధికారిత సాధించాలని సూచించారు. కార్పొరేషన్ల రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పక్కా గృహాలు, పింఛన్లు అందించేందుకు అర్హులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నసిబున్‌ఖానం, కమిషనర్ శివప్రసాద్‌రాజు, మెప్మా అధికారి బాబా, పర్యావరణ ఇంజనీరు రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని జీజీ రాచపల్లె ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీటి సమస్య ఎదురైందని, 70 కుటుంబాలు ఉన్న తమ గ్రామానికి ఒక్క ట్యాంకు నీటిని అందించేవారని, మూడు రోజుల నుంచి ఆ ఒక్క ట్యాంకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని మహిళలు వాపోయారు. ప్రతిరోజు గ్రామానికి రెండు ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి నేటి నుంచి గ్రామానికి రెండు ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.



నిరసన తెలుపుతున్న జీజీ రాచపల్లె ప్రజలు

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

రాయచోటి	9985411187
రాయచోటి టౌన్	9441794427
రాయచోటిరూరల్	9676860131
సంబేపల్లె	9703163108
గాలివీడు	9441049010
చిన్నమండెం	8886297090
లక్కిరెడ్డిపల్లె	8897095884
రామాపురం	9441079032

రేపు సామూహిక వరలక్ష్మి వ్రతం

సంబేపల్లె: మండలంలోని శెల్లిపల్లె గ్రామం అడవికమ్మపల్లె శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీన సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు కువైట్ అసోషియేషన్ సభ్యులు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలు రెండు టెంకాయలు, పసుపు, కుంకుమ, కలశం చెంబు, పూలతో ఉదయం 9 గంటలకు ఆలయానికి చేరుకోవాలన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకోండి

సంబేపల్లె: తల్లిపాల ఆవశ్యకతను ప్రతి మహిళ తెలుసుకోవాలని తహసీల్దార్ చంద్రమ్మ, ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినబిడ్డకు ముర్రుపాలు తాపడం ఎంతో శ్రేయస్కరమన్నారు. పుట్టిన వెంటనే మురిపాలు పట్టిస్తే బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, రమణమ్మ, లలితమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సినిమాగైడ్

రాయచోటి	
ప్రసాద్	: ఫిదా
గౌతమ్	: గౌతమ్‌నంద
సాయి	: డీజే-దువ్వాడ జగన్నాధం
సోనీరాజ్	: ట్యూబ్‌లైట్
గాలివీడు	
పావని	: బాహుబలి-2

బద్వేలులో పనిచేయని నిఘా నేత్రం

బద్వేలు : శాంతిభద్రతల పరిరరక్షణ, నేర, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగానే బద్వేలు పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. కేసుల దర్యాప్తు విషయంలో ఎంతో ఉపకరిస్తాయన్న భావం తో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి, హడావిడిగా బద్వేలు పట్టణంలో ప్రధాన కూడళ్లలో దాదాపు 60వరకు సీసీ కె

నిరుపయోగంగా సీసీ కెమెరాలు

మెరాలు ఏర్పా టు చేశారు. అయితే అవి పనిచేస్తున్నాయా లేదా అని బద్వేలు పోలీసు యం త్రాంగం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. సీసీ కెమెరాల ద్వారా త్వరగా నేరస్తులను గుర్తించవచ్చని, ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన హత్యచేసిన నేరస్థున్ని పట్టుకోవడంలో సీసీ కెమెరా పుటేజీ ఎంతో ఉపయోగపడింది. అయితే బద్వేలు లో సీసీ కెమెరాలను పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బద్వేలు పట్టణంలోని మైదుకూరు రహదారిలో ఉన్న స్టేట్‌బ్యాంకు వద్ద ఎక్కువగా చోరీలు జరిగాయి, బ్యాం కులో డబ్బు డ్రా చేసుకొని బయటకు వచ్చినప్పుడు డబ్బును దొంగలించిన సంఘటనలు అనేకం జరిగాయి. ఇటీవల కాలంలో బ్యాంకు నుంచి డబ్బులు డ్రాచేసుకొని ఓ వ్యక్తి వద్ద నుంచి రూ. 10వేలు చోరీచేసిన సంఘటన చోటు చేసుకుంది. బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరా పనిచేయకపోవడంతో చోరికి పాల్పడిన వ్యక్తిని గుర్తించలేకపోతున్నారు. అదే పట్టణంలోని కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేసినా అగంతుకున్ని సుల భంగా పట్టుకునే అవకాశాలు ఉండేదని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే రాత్రివేళల్లో పోలీసులు గస్తీ తిరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బద్వేలు పట్టణంలో సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసుల నిఘా పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో పనిచేయని సీసీ కెమెరా

పేదల సంక్షేమమే ధ్యేయం... ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాములు

బద్వేలు: నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే జయరాములు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన విలేఖరుల సమావేశంలో మాటాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయమని, బద్వేలు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటిపట్టాతో పాటు, పక్కాగృహం మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. పోరుమామిళ్ల రోడ్‌లో గుడిసెలు వేసుకున్న వారికి, అందులో అర్హులను గుర్తించి పట్టాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బద్వేలు నియోజకవర్గానికి హౌసింగ్ ద్వారా 2,200 పక్కాగృహాలు మంజూరు కాగా, అదనంగా 1730గృహాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణాల్లో జరిగిన అవకతవకల కారణంగా బద్వేలు నియోజకవర్గ పరిధిలో ఎస్సీలు అధికశాతం నష్టపోయారన్నారు. పోరుమామిళ్ల, గోపవరం మండలాల్లో అగ్రకులస్థులు వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, వాటిని గుర్తించి రద్దుచేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్నారు. కాశినాయన మండలం సావిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని అక్కెంగుండ్ల పొలంలో వందల ఎకరాలను స్థానికేతరులు ఆక్రమించుకొని అక్రమపట్టాలు కలిగి ఉన్నారన్నారు. వీటిపై కలెక్టర్ దృష్టిసారించి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, భూ ఆక్రమణలను వెలుగులోకి తేవాలన్నారు. పేదల, దళితుల భూ సమస్యలను పరిష్కరించేందుకు డివిజన్ స్థాయిలో నెలకోసారి సమావేశాలను నిర్వహించాలని ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు. సోమశిల బ్యాక్‌వాటర్ సంబంధించి ఫైల్ ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కావడం లేదని, దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలో పరిష్కారం జరుగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలో 26వార్డుల్లో మంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పోరుమామిళ్ల డబుల్ రోడ్డుకు టెండర్ల ప్రక్రియ ముగిసిందని, త్వరలో పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి నాశాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపవరం జడ్పీటీసీ రమణయ్య, టీడీపీ నాయకులు ప్రతాప్, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మహేశ్వరరెడ్డి, పొట్టి సుబ్బారెడ్డి, కొలవలి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లను రెగ్యులర్ చేయాలి


పోరుమామిళ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పోరుమామిళ్ల : అంగన్వాడీ టీచర్లను రెగ్యులర్ చేస్తూ, రూ.18వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి భైరవప్రసాద్, ప్రాజెక్టు ప్రధానకార్యదర్శి మేరీలు మాట్లాడుతూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలను రద్దు చేయాలన్నారు. ఉన్న 3,126 కేంద్రాలను అమలు చేయాలని, ప్రతి అంగన్వాడీ టీచర్‌ను రెగ్యులర్ చేస్తూ, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వినోదాదేవి, రమాదేవి, రేణుకాదేవి, విజయమ్మ, మేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టం

బద్వేలు : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట సుబ్బమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్-1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణి కాన్పు అయిన గంటలోపు తల్లిపాలను బిడ్డకు పట్టించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిగా పనిచేస్తాయన్నారు. అలాగే తిరువేంగళాపురం అంగన్వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అరుణకుమారి, సుభాషిణి, నరసమ్మ, లక్ష్మీదేవి, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

గోపవరం : అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం ఆరోగ్యకరం అని అంగన్వాడీ టీచర్లు సత్యవతి, విజయలక్ష్మిలు పేర్కొన్నారు. బుదవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గోపవరం, శ్రీనివాసపురం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ సమయంలో తల్లి తీసుకున్న పోషకాహారం, ఔషదాల ద్వారా శిశువుకు ముర్రుపాలు అంది, ఆరోగ్యంగా ఉండేందుకు సహకరిస్తాయన్నారు. ముర్రుపాలను పిల్లలకు ఇచ్చినప్పుడే తల్లిలో పాలఉత్పత్తి పెరుగుతుందని గర్భవతులకు, బాలింతలకు సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, బాలింతలు, గర్భవతులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్యతో పాఠశాలకు దూరం


రెడ్డికొట్టాల కాలనీ సమీపంలో చెట్ల కిందే విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల : రహదారి సమస్య కారణంగా నాలుగు రోజులుగా ఆ విద్యార్థులు పాఠశాలకు దూరమయ్యారు. చెట్ల కిందనే విద్యాభ్యాసం చేస్తూ, అక్కడే భోజనాలు చేస్తున్నారు. కాశినాయన మండలంలోని రెడ్డికొట్టాల యూపీ స్కూల్లో దాదాపు 118మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో దాదా పు 40 మంది విద్యార్థులు ఎస్సీ కాలనీకి చెందిన వారు. ఇటీవల ఆ కాలనీకి సంబంధించి రహదారి సమస్య తలెత్తడంతో తమకు దారి ఏర్పాటు చేసేంత వర కు తమ పిల్లలను బడికి పంపమని వారి తల్లిదండ్రులు భీష్మించుకోవడంతో నాలుగు రోజుల నుంచి కాలనీ సమీపంలోనే రోడ్డువద్ద స్కూలు నడుపుకుంటూ, సొంత ఖర్చులతోనే భోజనాలు చేయించుకుంటూ ఉండిపోయారు. ఈ సమస్యపై అధికారులు విచారించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినా, అవి ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో కాలనీకి చెందిన పిల్లలు రోడ్డుపైనే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా

ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న పాలక మండలి సభ్యులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల వైద్య విధాన పరిషత్తును కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని వైద్యవిధాన పరిషత్తు ప్రభుత్వ ఆసుపత్రి పాలక మండలి చైర్మన్ వంకెల రాజగోపాల్‌రెడ్డి, సభ్యులు బాలస్వామి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలో వైద్యవిధాన పరిషత్తు నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యవిధాన పరిషత్తు పాలక మండలికి తమను ఎంపిక చేసిన ఎమ్మెల్యే జయరాములకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రి అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిదులు సహకరించాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో పచ్చదనం, పరిశుభ్రత లోపించిందని, వైద్యసిబ్బంది కూడా తక్కువగా ఉన్నారన్నారు. రోగులపట్ల వైద్యసిబ్బంది ఓర్పు, సహనంతో ఉండాలన్నారు. డిప్యూటీ సివిల్‌సర్జన్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రి ఆధునీకరణకు రూ.72లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఈనిధులతో హాస్పిటల్ ప్రహరీ, మరమ్మతులు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలక మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. టీడీపీ నాయకులు రాజీవ్‌బాష, బాలిరెడ్డి, రామసుబ్బారెడ్డి, వైద్యులు మొహర్‌ముంతాజ్, శివక్రిష్ణ, వెంకటసుబ్బయ్య, ఇమామ్ హుస్సేన్ , హెల్త్ ఎడ్యుకేటర్ సాదు వెంకటేశ్వర్లు, ఇమామ్‌హుస్సేన్ , ఎంఎస్‌ఎం బాష, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జింక్, జిప్సం పంపిణీ

కొండాపురం : మండలంలో శుక్రవారం నుంచి ఉచితంగా జింక్ సల్ఫేట్, జిప్సంలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మండలానికి 42మెట్రిక్ టన్నుల జిప్సం, 5 మెట్రిక్ టన్నుల జింక్ సల్ఫేట్ గోడౌన్ కు చేరింద న్నారు. వేరుశనగ, పత్తి సాగుచేసిన రైతులకు 4 బస్తాల జిప్సంను, అలాగే వరి సాగుచేసిన రైతులకు 2 బస్తాల జింక్ సల్ఫేట్ ఇస్తామని, ఆధార్‌కార్డును మట్టినమూనా పత్రాలను కార్యాలయానికి తీసుకురావాలని ఏఓ కోరారు.

అవీ.. ఇవీ

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష



జమ్మలమడుగు రూరల్: ఎమ్మార్పీఎస్ నేత మందక్రిష్ణమా దిగ ఆదేశాల మేరకు వర్గీకరణ కోసం జమ్మలమడుగులో గత 14 రోజుల నుంచి స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దారు కార్యా లయం ఎదురుగా చేస్తున్న రిలే నిరాహార దీక్ష 14వ రోజుకు చేరుకుంది. దీక్షల్లో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.గంగరాజు, అంజనాపురం శ్రీను, లింగమూర్తి, పి.రామసుబ్బయ్య, చిన్న లింగమయ్య, రాయుడు, చింతాకు రాముడు కూర్చున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



జమ్మలమడుగు రూరల్: పెన్నానది నుంచి ఇసుక తరలి స్తున్న ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. అర్బన్ ఎస్ఐ హనుమంతుమియా తన సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న ట్లు తెలిపారు. అలాగే పత్రాలు లేని ట్రాక్టర్లను పట్టుకున్నామ న్నారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు వేగం తగ్గించాలని పేర్కొన్నారు.

ఎరువుల డీలర్లకు ఇ-పాస్‌యంత్రాల పంపిణీ



కొండాపురం : మండలంలోని ఆరు మంది ఎరువుల డీలర్లకు ఇ-పాస్ యంత్రాలను బుధవారం వ్యవసాయాధికారి చెన్నారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరు వులు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డును తీసుకొచ్చి బయోమెట్రిక్ విధానం ద్వారా ఎరువులను పొందవచ్చున న్నారు. ఇ-పాస్ మిషన్ల ద్వారా ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే రైతులకు విక్రయించాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలి

మైలవరం: ఎస్సీ వర్గీకరణకు ఈ వర్షాకాల పార్లమెంటు సమా వేశాల్లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయ కులు ఓబులేసు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కేసిగాండ్ల రాముడు డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 6వ రోజుకు చేరాయి. బి.ఇంగాలపల్లెకు చెందిన పెద్దన్న, చెన్నప్ప, వెంకటే శ్వర్లు, ప్రసాద్, జయన్న, బాలస్వామి, బాల అంకయ్యలు నిరా హార దీక్షలో కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని రవి మాదిగ, గండి కోట దస్తగిరి తదితరులు మద్దతు ప్రకటించారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎంత దౌర్భాగ్యం.. ఏమిటీ నిర్లక్ష్యం?

- రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించారు
- లక్షణంగా వదిలేశారు
- అద్దె భవనాల్లో మరికొన్ని కార్యాలయాలు



ఎమ్మార్సీ భవనం



అంగన్వాడీ కేంద్రం

పెద్దముడియం: అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి మండలంలోని పలు ప్రభుత్వ భవనాలే నిలువెత్తు సాక్షం. ప్రజలు ప్రశ్నించరు, ఉన్నతాదికారులు దృష్టి సారించరు. దీని సాకుతో మండలంలోని కొందరు అధి కారులు లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను ఉప యోగించుకోకుండా గాలికొదిలేశారు. మరోవైపు అవస రమైన భవనాలు లేక కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో సాగుతున్నాయి.

ఎమ్మార్సీ భవనానికి తాళం వేసి అయిదేళ్లు

మండలంలోని ఎమ్మార్సీ భవనానికి తాళం వేసి అయి దేళ్లు అయింది. విద్యాశాఖకు ఎమ్మార్సీ భవనం గుండె లాంటిది. అన్ని కార్యకలాపాలు ఇక్కడి నుంచే సాగాలి. భవనానికి తాళం వేసి అయిదేళ్లు గడిచినా అడిగే నాథుడే లేరు. భవనం అన్ని హంగులతో ఉన్నా శిథిలా వస్థకు చేరిందని చెప్పి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ భవ నంలో గత టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు సైకిళ్ల మంజూరు చేసిన సైకిళ్లు కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి . ఇక గుండ్లకుంటలోని ప్రాథమిక పాఠశాల లోని ఓ గదిని ఎమ్మార్సీ భవనంగా మార్చుకుని అక్కడి నుండే కార్యకలాపాలు సాగిస్తున్నారే తప్ప మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వైపు విద్యాశాఖ అధికారులు రావడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎవరు రాన ప్పుడు లక్షలు వెచ్చించి ఈ భవనాలు ఎందుకు నిర్మిం చారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా తరగతి గది

చాలా చోట్ల పాఠశాలలో అవసరమైన గదులు లేక ఆవరణలోచెట్లు, వరండాలో చదువులు సాగుతుం టాయి. మండల కేంద్రమైన పెద్దముడియంలోని ప్రాథమిక పాఠశాలకు సంబంధించి ఓ అదనపు గది నిరుపయోగంగా దర్శనమిస్తోంది. పాఠశాలకు దూ రంగా గదిని నిర్మించారన్న సాకుతో ఉపాధ్యాయులు ఆ గదిని ఉపయోగించుకోవడంలేదు. మరో పక్క ప్రాథ మిక పాఠశాలలో గదుల కొరత కారణంగా వరం డాలో చదువులు సాగడం గమనార్హం.

అంగన్వాడీ భవనందీ అదే దారి

అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నిర్వాకం కారణంగా పెద్దపసుపుల గ్రామంలో ఓ అంగన్వాడీ భవనం ఎందుకు పనికిరాకుండా పోయింది. దాదాపు రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఒకే ఆవరణంలో రెండు అంగన్వాడీ భవ నాలు ఉండరాదన్న నిబంధన ఉన్నా అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి ఎస్.కొట్టాలపల్లె రస్తాలో ఒకే ఆవర ణంలో రెండు భవనాలు నిర్మించారు. ఒకటి ఉపయో గించుకుంటుండగా మరోదాన్ని నిరుపయోగంగా మార్చారు. మరోవైపు గ్రామంలో మూడు అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండడం విశేషం.

అద్దె గదుల్లో వెలుగు కార్యాలయం

వెలుగు కార్యాలయం అద్దె భవనంలో నడుస్తోంది. అదే ఉపాధి సిబ్బంది కూడా ఎంపీడీవో కార్యాలయంలోని ఓ గదిలోనే విధులు నిర్వహిస్తున్నారు. భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న వెలుగు, ఉపాధి సిబ్బందికి పక్కనే నిరుపయోగంగా ఎమ్మార్సీ, తరగతి అదనపు గదులను ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్షని ఐసీడీఎస్ చిలమకూరు సెక్టార్ సూపర్‌వైజర్ కళావతి పేర్కొన్నారు. బుధవారం అంగన్వాడి కార్యకర్తలు, ఆవా లతో, తల్లులతో, గర్భవతులతో కలిసి ఆమె తల్లిపాల వారోత్సవాలపై సున్నపు రాళ్లపల్లె, ఆర్టీపీపీలో ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ అన్నఅమృతహస్తం గురించి వివరించారు. ఆర్టీపీపీ-2 సెంటర్‌లో కూ రగాయల విత్తనాలు నాటారు. అంగన్వాడీ కేంద్రానికివచ్చిన పాలప్యాకెట్లను గాలి వెలుతురు వచ్చేట్లు ఉంచాలన్నారు. కార్యకర్త పాలప్యాకెట్లను జాగ్రత్తగా పరిశీలించాలని చెడిపోయిన పాలను వాడరాదన్నారు. సున్నపురాళ్లపల్లెలో హెచ్ఎం శైలజ, టీచర్‌సుబ్బారెడ్డి, హెల్పర్ నాగమ్మ, ఆర్టీపీపీ కార్యకర్త రజిని, శివజ్యోతి,ఆయా మరియమ్మలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో.. స్థానికవేంపల్లిరోడ్డులోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలవా రోత్సవాలపై కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ జహరా తెలిపారు.

నేడు తలమంచిపట్నంలో రైతు సేవలో రెవెన్యూ శాఖ

మైలవరం: మండల పరిధిలోని తలమంచి పట్నం పరిధిలో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ సభ జరుగనుంది. గత శుక్రవారం మండ లంలో రామచంద్రాయపల్లెలో జరిగిన గ్రామ సభలో 1బి అడంగల్, రికార్డులు లేకుండానే రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహిం చారు. అయితే రైతులు పలు సమస్యలపై అధి కారులకు వినతి పత్రం అందించారు. అధికా రులు గ్రామసభకు రికార్డులు చేయకపోవ డంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోలార్ భూములకు సంబంధించి రామచం ద్రాయపల్లె, దొడియం, తలమంచిపట్నం, కొన అనంతపురం పంచాయతీలకు చెందిన 1బి అడంగల్, ఇతర రికార్డులు రెవెన్యూ శాఖకు సంబంధించిన రికార్డులు జమ్మలమడుగు ఆర్డీవో గతంలో స్వాధీనం చేసుకున్నారు. ఆ రికార్డులన్నీ ఇప్పటికీ ఆర్డీవో కార్యాలయంలోనే ఉన్నాయి. దీంతో గ్రామాల్లో జరిగే గ్రామసభ లకు రెవెన్యూ అధికారులు రికార్డులు లేకుం డానే ఖాళీ చేతులతో గ్రామసభలకు హాజరవు తున్నారు. రైతు సమస్యలు పరిష్కరించే దుకు రికార్డులు అధికారులు గ్రామాల్లోకి తీసు కురాకపోవడం వలన సమస్యలు పరిష్కారం కావడంలేదని, ఇబ్బందులు పడుతున్నామని, రికార్డులు తీసుకురాని అధికారులు గ్రామసభ ఎలా జరుపుతారని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. నేడు, రేపు గ్రామసభలకైనా ఆర్డీవో కార్యాలయంలో ఉన్న 1బి అడంగల్, ఇతర రికార్డులను గ్రామసభలకు తీసుకొచ్చే విధంగా కలెక్టర్ చొరవ చూపాలని ఆయా గ్రామ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదమరిస్తే ఆస్పత్రికే



జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు పట్టణంలోని మెయిన్‌బజార్ వెళ్లే ప్రధాన రోడ్డు మలుపు వద్ద కాలువ ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, సైకిళ్లలో వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వా హనదారులు ఆదమరిస్తే కాలువలోపడి గా యాలపాలై ఆస్పత్రికి వెళ్లాల్సిందేనని స్థాని కులు వాపోతున్నారు. కాలువపై బండలు పెట్టి దుర్గంధం రాకుండా చూడాలని స్థాని కులు విజ్ఞప్తి చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఇదే సమస్యలపై నగర పంచా యతీ వైస్‌చైర్మన్ ముల్లాజానీ అధికారులకు తెలిపారు. డ్రైనేజీ కాలువ ప్రమాదకరంగా ఉందని, వెంటనే పరిశీలించాలని ఆయన కూడా కోరారు.

మానవ అక్రమరవాణాను ప్రతిఘటించాలి

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను




పర్వీన్‌బానుకు సన్మానం చేస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్, హాజరైన విద్యార్థులు

కడప,అర్బన్: మానవ అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బాను అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ యుగవాణి నేతృత్వంలో విద్యార్థినులతో ముఖాముఖిలో ఆమె మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితులు, నిరక్షరాస్యత తదితర కారణాల వల్ల ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు మహిళలు వెళుతున్నారన్నారు. అలా కాకుండా ప్రతి ఒక్కరూ నాణ్యమైన విద్య అభ్యసించి స్థానిక పరిసరాల్లోనే ఉపాధి ఎంచుకుంటే జీవితాలు సుఖమయంగా వుంటాయన్నారు. బాల్యవివాహాలు చేయడం శోచనీయమన్నారు. ఐసీడీఎస్ ఇన్ చార్జి పీడీ మమత మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో జీవనోపాధికి విద్య ముఖ్యమని అందుకు ప్రతి ఆడపిల్ల ఇష్టపడి చదవాలన్నారు. డీసీపీఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లి కష్టాల పాలు కాకుండా అవగాహన పొందాలన్నారు. అనంతరం కమిషన్ సభ్యురాలు స్థానిక చెమ్మమియాపేటలోని ఆదర్శ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి అన్న అమృతహస్తం పథకంపై అక్కడ వున్న గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్షుమ్మ, ఐసీడీఎస్ అదనపు పీడీ శ్రీదేవి, సీడీపీఓ అరుణకుమారి, ఎన్ ఎస్ ఎస్ పీఓ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

జీఎన్ ఎస్మూర్తి మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

కడప, అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ టీయూసీ మాజీ నాయకుడు జీఎన్ ఎస్ మూర్తి మృతదేహానికి బుధవారం ఎమ్మెల్యే అంజాద్ బాష, వైసీపీ సీనియర్ నాయకుడు అఫ్జల్ ఖాన్, హరూన్ బజాజ్ అధినేత అహ్మద్‌బాష పూలమాల వేసి ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కార్పొరేటర్లు షఫీ, హరూన్ బాబు, పంపిర్, పాకా సురేష్, చైతన్య, టీయూసీ అధ్యక్షుడు మహబూబ్‌బాష, అల్తాఫ్, రఫీ, పీరా, పవర్ అల్తాఫ్, జిల్లా నగర నాయకులు తదితరులు మూర్తి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

వృద్ధులకు 'బాసట' అన్నదాన కార్యక్రమం

కడప, అర్బన్ : నగర పరిధిలోని చిన్నచౌకులో వున్న బాసట సేవా సంస్థ దాతలు, సభ్యులు, మిత్రుల పుట్టినరోజులను పురస్కరించుకొని వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. హైదరాబాదుకు చెందిన శ్రీలక్ష్మీనారాయణ పుట్టినరోజు పురస్కరించుకొని బుధవారం నగర శివారులోని పద్మావతమ్మ వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బాసట అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాలాజీరావు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం పుణ్యకార్యమని వృద్ధులు మిత ఆహారం తీసుకొని ఆరోగ్యంగా వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంజునాద్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వేతన సవరణ చేయాలి

కడప, అర్బన్ : ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ ఎల్ఐసీ సంస్థ సాధించిన ప్రగతి ఉద్యోగుల ఉత్పాదకత చెల్లింపు సామర్థ్యం ఆధారంగా పరిశీలించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాధరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం దేశవ్యాప్త పిలుపు మేరకు నిర్వహించిన భోజన విరామ ప్రదర్శనలో పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఇన్సూరెన్స్ సంస్థల్లో 5, 4 శాతం వృద్ధిరేటు సాధిస్తే గత ఆర్థిక సంవత్సరం ఎల్ఐసీ 27శాతం సాధించిందన్నారు. 2012లో ఒక్కొక్క ఉద్యోగి 2600 పాలసీదార్లకు సేవలందిస్తుంటే 2017లో 3700 పాలసీదార్లకు సేవలందిస్తున్నారన్నారు. భోజన విరామ ప్రదర్శనలో ఎంజేపీ బేగ్, అజయ్, రఘు, పారిజాతమ్మ, డీవో యూనిట్ నాయకులు అవధానం శ్రీనివాస్, కుమార్, రమణ, అయ్యవారరెడ్డి, పక్కీరయ్య, శ్రీనివాసులు, నరసయ్య, శ్రీకృష్ణ, పెన్షన్ స్కీమ్ డిపార్టుమెంట్ నేత కల్యాణ్ కుమార్ పాల్గొన్నారు.



ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

వ్యక్తి అదృశ్యం

కడప, క్రైం : కడప నగరం అశోక్‌నగర్‌కు చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు అశోక్‌నగర్‌కు చెందిన కస్తూరి జయప్రసాద్ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవాడు. గత నెల 2వతేదీన హైదరాబాద్ వెళుతున్నట్లు చెప్పి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. భార్య మేరీ ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు పట్టివేత

కడప, క్రైం : ఖాజీపేట వద్ద దుంపలగట్టు ప్రాంతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఖాజీపేట ఫారెస్టు అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి తనిఖీ నిర్వహిస్తుండగా 9 ఎర్రచందనం దుంగలు వున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని ఆర్ఐ అలీబాష తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ అమీర్, శంకర్, కుమార్, స్వామి, నరసింహ నాయుడు, రవిశంకర్, ఖాజీపేట ఫారెస్టు అధికారి గురప్ప పాల్గొన్నారు.

సినిమా గైడ్

కడప సినిమాలు

మురళి	: గౌతమ్‌నంద
రవి	: ఫిదా
సుధ	: నాకునేనే
ప్రతాప్	: వాసుకి
అమీర్	: దండుపాళ్యం-2
రమేష్	: గౌతమ్‌నంద
తాహెర్	: ముబారకన్
అప్సర	: శమంతకమణి
రాజా	: డీజే
ఎస్ఆర్	: నిన్నుకోరి

ప్రైవేటు విద్యాసంస్థల అరాచకాలను అడ్డుకుంటాం

కడప, ప్రకాష్‌నగర్ : జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల అరాచకాలను అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. పాతబస్టాండు వద్ద ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ సరైన వసతులు లేకుండా వున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు విద్యాసంస్థలు పని చేస్తున్నాయన్నారు. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు బంద్‌లు, ర్యాలీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రైవేట్ స్కూల్స్ సర్వే

నేటి నుంచి ప్రైవేటు స్కూల్‌లో విద్యార్థులు వసతులు, అధిక ఫీజుల వసూళ్లపై సర్వే చేస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 7 నుంచి రాత్రి 8 వరకు విద్యాభ్యాసం పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు అక్రమాలను ఆపకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మనోహర్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు గురప్ప, నాగార్జున, వలరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరు మారకపోతే

ఆందోళన తప్పదు



వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

కడప, అర్బన్ : భూయజమాని ఆమోదంతో నిమిత్తం లేకుండా అర్హులైన రైతులందరికీ కౌలుకార్డులు మంజూరు చేయాలని పంపిణీలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వీడాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ ప్రేమంతకుమార్‌ను కలిసి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. గ్రామసభల్లో కౌలుదారులకు కౌలుకార్డులు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, బాలచంద్రయ్య, కొండయ్య, మునెయ్య పాల్గొన్నారు.

ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలికి అభినందనల వెల్లువ



కమిషన్ సభ్యురాలికి బొకే అందజేస్తున్న మల్లెల శ్రీవాణి తదితరులు

కడప, అర్బన్ : ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బానును టీడీపీ మహిళా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజులుగా కడపలో పర్యటిస్తున్న ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బానును బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ సభ్యురాలితో మల్లెల శ్రీవాణి మహిళల సమస్యలపై చర్చించారు. తమ నియోజకవర్గమైన రాజంపేటలో కూడా పర్యటించాలని ఆమెను కోరారు.

మైనార్టీ మహిళలను ఆదుకోవాలి

మైనార్టీ మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని టీడీపీ మైనార్టీ మహిళా నాయకులు ఆసియాబేగం కోరారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏపీమహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ బానును టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి ఆధ్వర్యంలో ఆసియా తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

4 నుంచి హౌసింగ్ లబ్ధిదారుల ఎంపిక

సింహాద్రిపురం: హౌసింగ్ లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలు 4వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. స్మార్ట్‌పల్స్ సర్వేలోని హౌసింగ్ లబ్ధిదారుల జాబితా ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. సర్వే ప్రకారం అర్హులా అనర్హులా అనేది సభలో తెలియజేస్తామన్నారు. 4న బలపనూరు, బొజ్జాయిపల్లె, కోవరంగుట్టపల్లె, కాంబల్లె, 5న రావులకొలను, సుంకేసుల, తెలికి, నంద్యాలంపల్లె, 7న పైడిపాళెం, చవ్వారిపల్లె, వై కొత్తపల్లె, గురిజాల, 8న బిదినంచెర్ల, బి చెర్లోపల్లె, హిమకుంట్ల, అంకాళమ్మగూడూరు, 9న కసనూరు, దుద్దెకుంట, లోమడ, 10న సింహాద్రిపురం పంచాయతీల్లో ఎంపీడీఓ, తహసీల్దార్ బృందాలు గ్రామసభల్లో పాల్గొననున్నాయి. ప్రజలు హాజరవాలని కోరారు.

సెంటర్ల కుదింపు ఉపసంహరించుకోవాలి

పులివెందులలో అంగన్వాడీల ర్యాలీ, నిరసన

పులివెందుల టౌన్: మున్సిపల్, పట్టణాల్లో అంగన్వాడీ సెంటర్లను కుదించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం ర్యాలీగా వచ్చి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు కేవలం ప్రీస్కూల్ కోసమే ఏర్పాటు చేసినవి కావని పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం కూడా అంగన్వాడీ సెంటర్ల లక్ష్యమన్నారు. మున్సిపల్, పట్టణాల్లో అంగన్వాడీ సెంటర్లను కుదించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పట్టణాల్లో 3126 అంగన్వాడీ సెంటర్లను 1026 సెంటర్లుగా కుదించాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని ఆయా సెంటర్లలో అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించాలని కోరుతున్నామన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి 400 నుంచి 800 మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో మెయిన్ అంగన్వాడీ సెంటర్, 150 నుంచి 400 జనాభా పరిధిలో మినీ అంగన్వాడీ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఆయా పరిధుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆరు రకాల అంగన్వాడీ సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సెంటర్లను కుదించడంతో ప్రీస్కూలుకు వెళ్లే పిల్లలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. గర్భిణులకు, బాలింతలకు అందే సేవలు దూరమవుతాయన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించడం మానుకోవాలన్నారు. ప్రభుత్వం సెంటర్ల కుదింపు నిర్ణయాన్ని మానుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

బీమా కోసం శాసనసభాపక్ష నేతకు వినతిపత్రం


బీజేపీ శాసనసభ పక్షనేత కిషన్‌రెడ్డికి పంటల బీమాపై వినతిపత్రం సమర్పిస్తున్న రామచంద్రారెడ్డి

చక్రాయపేట: మండలానికి 2012 నుంచి 2017 వరకు పంటల బీమా అందలేదని వెంటనే పంటల బీమా అందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి అంబర్‌పేట్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభ పక్షనేత కిషన్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. కిషన్ రెడ్డి ద్వారా ఆలిండియా క్రాప్ ఇన్సూరెన్స్ జనరల్ మేనేజర్‌కు చక్రాయపేట మండలానికి ఇన్సూరెన్స్ ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. ఐదేళ్లుగా చక్రాయపేట మండలంలో వర్షాలు రాక వేసిన పంటలు ఎండిపోతున్నా ప్రీమియం కట్టించుకుని పంటల బీమా ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని రామచంద్రారెడ్డి కిషన్ రెడ్డికి తెలియజేశారు. దీంతో స్పందించిన కిషన్ రెడ్డి వెంటనే ఆలిండియా ఇన్సూరెన్స్ అధికారులను కలిసి చక్రాయపేట మండలానికి ఇన్సూరెన్స్ వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు.

బిడ్డకు ముర్రుపాలు వరం

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సర్పంచు కుళాయమ్మ, అంగన్వాడీ టీచర్ లక్ష్మీశైలజ
విలేకరులతో మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర నేత గిరిధర్‌మూర్తి

తొండూరు: కాన్పు అయిన అరగంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాపించాలని సర్పంచు కుళాయమ్మ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తొండూరు అంగన్వాడీ సెంటర్- 2లో తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచు మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు తాపిస్తే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నిర్వహించారు. బిడ్డ మెదడు బాగా అభివృద్ధి చెందడమే కాకుండా తల్లికి కూడా రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుకోవచ్చన్నారు. 9 నెలల నుంచి 15 ఏళ్లలోపున్న పిల్లలకు ఎంఆర్ టీకాను వేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలకు ఎంఆర్ టీకాను వేయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మిశైలజ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

వేంపల్లెలో...

వేంపల్లె: తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు తెలిపారు. వేంపల్లెలో గురువారం జేవీవీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు గిరిధర్ మూర్తి విలేకరులతో మాట్లాడుతూ 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. బాలింతలు తప్పకుండా పిల్లలకు తల్లిపాలు తాపించాలన్నారు. రోగ నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డాక్టర్ కరిముల్లా, కేశవులు, అశోక్, ఫరీద, రేష్మ, మౌళాలి పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ సరిగా నిర్వహించండి : జడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి

సింహాద్రిపురం: 11వ విడత ఉపాధి పనులపై 4 నుంచి ప్రారంభమయ్యే సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించాలని జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఉపాధి సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందానికి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ ఆడిట్ బృందం కేవలం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై రికవరీ చేయాలనే దృష్టి కాకుండా పనుల విషయమై, నిధులు దుర్వినియోగంపై గమనించాలన్నారు. చిన్నచిన్న తప్పిదాలను చూపి రికవరీ చేశామని లేకుండా ఆడిట్ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ విజయభాస్కర్, ఉపాధి సిబ్బంది, సోషల్ ఆడిట్ డీఆర్పీలు, ఎస్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుపై గ్రామసభలు

లింగాల: ఇటీవల ఎన్టీఆర్ గృహకల్ప కింద మండలంలో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వాటిపై గ్రామసభలు నిర్వహించారు. బుధవారం పెద్దకుడాలలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గతంలో ఇళ్లు మంజూరు కాకపోతే ప్రస్తుతం ఇళ్లు మంజూరు అవుతుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి అర్హులకు మంజూరు చేస్తామన్నారు.

కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్, తహసీల్దార్ ఖాసీంఖాన్, సర్పంచు, ఎంపీటీసీ ఈశ్వరయ్య, జన్మభూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఇళ్లపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు పేర్కొన్నారు. బుధవారం పెద్దరంగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో దోమకాటుపై అనర్థాలు అనే అంశంపై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమ కాటు వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూ కళాశాల అకడమిక్ ఇన్ చార్జి శేషమహేశ్వరమ్మ, జేవీవీ జిల్లా నేతలు రామగోపాల్, పాఠశాల అభివృద్ధి కమిటీ నేతలు రాజశేకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందరాజులు తదితరులు

రూ.1.20 లక్షలు చెక్కు పంపిణీ

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామానికి చెందిన రామిరెడ్డి వీరలక్షుమ్మ అనే బాధితురాలికి తహసీల్దారు పుల్లారెడ్డి బుధవారం రూ.1.20 లక్షలు పంపిణీ చేశారు. ఆమె భర్త జయరామిరెడ్డి అప్పుల బాధతో రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వం వారి కుటుంబానికి రూ.3.5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు త హసీల్దారు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి మిగతా డబ్బును విడతల వారీగా వీరలక్షుమ్మకు ఇస్తామని తెలిపారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు

నాశిరకంగా చెక్‌డ్యాంల నిర్మాణం

● మండల సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు బాలనరసింహారెడ్డి, పాల్గొన్న సభ్యులు

చాపాడు : మండలంలోని పలు గ్రామాల వద్ద కాంట్రాక్టర్లు నాశిరకంగా చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు బాలనరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మండలాధ్యక్షురాలు వెంకటలక్షుమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ కుందూ నదిలో నాణ్యతలేని ఇసుకను చెక్‌డ్యాంలకు కాంట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ ఏఈ రాజ్‌కుమార్ దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఇవ్వడంలేదని విమర్శించారు. ఇటీవల సబ్సిడీపై పంపిణీ చేసిన జీలుగలు, పెసలు తదితర విత్తనాల సమాచారాన్ని ఇవ్వకపోవడం ఏవో బాధ్యతారహితమన్నారు. మొరాయిపల్లెలోని మినీ అంగన్వాడీ కేంద్రంలో ముగ్గురు పిల్లలు ఉన్నప్పటికి ఆ కేంద్రాన్ని ఎలా నిర్వహిస్తున్నారని అడిషనల్ సీడీపీవోను జడ్పీటీసీ ప్రశ్నించారు. వెదురూరు పశువైద్య అధికారి లక్షుమయ్య వారానికి ఒక రోజు మాత్రమే విధులకు హాజరవుతున్నారని ఆగ్రామ ఎంపీటీసీ యల్లారెడ్డి ఆరోపించారు. మరో ప్రైవేటు వ్యక్తితో పశువులకు వైద్యం చేయిస్తున్నారని చెప్పారు. కేతవరం దళితవాడలోని ఇళ్లకు కేతవరం విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి కరెంటు సరఫరా చేయాలని ఎంపీటీసీ జ్ఞానమ్మ కోరారు. కాగా చుక్కల భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తున్నట్లు తహసీల్దారు పుల్లారెడ్డి తెలిపారు. రైతులు భూమి శిస్తు కచ్చితంగా చెల్లించాలని కోరారు. చాపాడు దళితులకు శ్మశానం కోసం వంక వద్ద కేటాయించిన భూమిని సీతారామపురం గ్రామానికి చెందిన ఒక రైతు చదును చేశారని ఎంపీటీసీ శ్రీపతి భారతి తహసీల్దారుకు వివరించారు. రైతు రథం, ఇతర పథకాల కింద ట్రాక్టర్లను అధికారులు పక్షపాతంగా ఇస్తున్నారని ఉపమండలాధ్యక్షుడు సానా నరసింహారెడ్డి, చియ్యపాడు ఎంపీటీసీ, మహేష్‌లు విమర్శించారు. సాగునీటికోసం ప్రభుత్వం భవానీనగర్, మడూరు గ్రామాలకు రూ.4లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ చెప్పారు. వెదురూరు దళితవాడలకు, రాజకొట్టాలు గ్రామానికి నీటి ట్యాంకుల కోసం రూ.20లక్షలు చొప్పున ప్రతిపాదనలు పంపామన్నారు. కేసీ కెనాల్ పరిధిలో కాలువల్లో దెబ్బతిన్న సిమెంటు లైనింగ్‌ను రిపేరు చేయాలని ఏఈ రేష్మాను సభ్యులు అడిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామదాసు, పశువైద్య అధికారిణి గీతాప్రియ, ఏపీవో పార్వతమ్మ, ఎంఈవో సుబ్బరామయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మైదుకూరు రూరల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని డీవైఎఫ్ఐ మైదుకూరు డివిజన్ కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఈనెల 7 తేదీ కడప కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని, ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాపై నిర్లక్ష్యం చూపుతోందన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారని, కడపలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పితే నిరుద్యోగ సమస్య కొంత వరకేనా తీరుతుందని ఆయన తెలిపారు. ఉక్కు పరిశ్రమ స్థాపనే ధ్యేయంగా 7వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జగన్, నరసింహులు, కాశీనాయక్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారులతో మాట్లాతున్న తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి

దువ్వూరు : మండల పరిధిలోని వెంకుపల్లె గ్రామ పంచాయతీలో బుధవారం తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించారు. కచ్చితంగా ఇంటి నిర్మాణం చేపట్టే వారి వివరాలు సేకరించారు. త్వరలో అనుమతి పత్రం అందిస్తామని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వీరన్న, ఎంపీటీసీ సభ్యుడు సీమన్, ఆర్ఐ బాలనారాయణస్వామి, వీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏడుగురు మట్కా బీటర్లు అరెస్టు

దువ్వూరు : మండల పరిధిలోని నేలటూరు సమీపంలో మంగళవారం మట్కా నిర్వహిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు దువ్వూరు ఎస్ఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. రాబడిన సమాచారం మేరకు దువ్వూరు, నేలటూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన ఏడుగురు మాట్కా పట్టీలు రాయడం, గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన జక్కల ఆనంద్‌రావు, నేలటూరుకు చెందిన కొత్తపల్లె కృష్ణయ్య, ఇడమడకకు చెందిన వెంకటేశ్వర్లు, దూదేకుల దస్తగిరి, నీలాపురానికి చెందిన రామచంద్రుడు, తాలు నరసింహులు, జేష్ఠాది వినోద్‌లను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి రూ.45,650 నగదు, 940గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

నేడు రైతు సేవలో రెవెన్యూ శాఖ

దువ్వూరు : రైతు సేవలో రెవెన్యూశాఖ సదస్సును గురువారం నేలటూరు, పెద్దజొన్నవరం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులు భూ సమస్యలను సభదృష్టికి తేవాలన్నారు. పరిష్కారం కాక నిలబడి ఉన్న భూ సమస్యలను సభ దృష్టిలో ఇరు వర్గాల సమక్షంలో పరిష్కరిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్ వాడీ స్కూళ్లను
నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర



కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

మైదుకూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగన్‌వాడీ సెంటర్లను నిర్వీర్యం చేయటంలో భాగంగా ప్రీస్కూల్స్‌ను తెర మీదకు తీసుకొచ్చారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ సెంటర్లను ప్రీస్కూల్ పేరుతో క్లబ్ చేయటాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యలయం వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ మూడు అంగన్‌వాడీ సెంటర్లను ఒకే చోటికి చేర్చడం ద్వారా పిల్లలను సెంటర్లకు రాకుండా చేయడమేనని అన్నారు.అంగన్‌వాడీ వ్యవస్థను నారాయణ విద్యా సంస్థలకు అప్పచెప్పడం కోసం చంద్రబాబు తొందర పడుతున్నారని మండిపడ్డారు. క్లబ్ చేయడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు మూడు నెలలుగా వేతనాలు రావ డం లేదని, వెంటనే జీతాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ క్రిష్ణారెడ్డికి వినతి పత్రాన్ని వారు అందచేశారు. కార్యక్రమంలో సంఘం గౌర వ అధ్యక్షురాలు సుబ్బమ్మ, ధనలక్ష్మి, భారతి, రిజ్వానా, ఉషా, శోభ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణ గురించి వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మైదుకూరు రూరల్ : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని ప్రమాదాల నుంచి బయట పడాలని మైదుకూరు ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ కె.వరదరాజులు పేర్కొన్నారు. స్థానిక వీణావిజయనగర్ కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదాలపై స్థానికులకు అవగాహన సదస్సును ఫైర్ సిబ్బంది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలనే విషయంపై తెలిపారు. ఇంట్లో గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేశారు.

సర్వేకు సహకరించండి

జమ్మలమడుగు: నగర పంచాయతీ సమగ్రాభివృద్ధికి పట్టణంలో జీఐఎస్ సర్వే చేపట్టామని, సర్వేకు సహకరించాలని కమిషనర్ లక్ష్మీరాజ్యం అన్నారు. బుధవారం కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి నగర పంచాయతీకి వీలుంటుందన్నారు. సర్వేలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఇంటి నంబర్లు మార్పు చేసి శాస్త్రీయ పద్ధతిలో కేటాయించారన్నారు. ఇన్యుమరేటర్లు సర్వేచేసేందుకు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు వారికి కావాల్సిన సమాచారం అందించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆమె విన్నవించారు.

మోరగుడిలో నగదు, నగలు చోరీ



బీరువా పగులకొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

జమ్మలమడుగు రూరల్: మండలంలోని మోరగుడి గ్రామం తాడిపత్రి రోడ్డు దస్తగిరి స్వామిదర్గా వద్ద సైనాథం రమణమ్మ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. బీరువా పగులకొట్టి రూ.30 వేలు నగదు, ఆరు గ్రాముల బంగారు దోచుకెళ్లారు. రమణమ్మ ఇంటికి తాళం వేసి జమ్మలమడుగులో ఉన్న తన బిడ్డ ఇంటికెళ్లింది. ఇంట్లో ఎవరూలేని విషయాన్ని గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకెళ్లి బీరువాలోని రూ.30 వేల నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. రమణమ్మ బుధవారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు అర్థమైంది. వెంటనే జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ప్రవీణ్‌కుమార్, ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఈ సందర్భంగా యన తెలిపారు.

మోటార్‌సైకిళ్లు ఢీ - ముగ్గురికి గాయాలు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల శివార్లలోని వేంపల్లి రోడ్డులో బుధవారం సాయంత్రం రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్‌కు చెందిన రమేష్, మరొకరితో కలిసి మోటార్ సైకిల్‌లో వేంపల్లివైపు వెళుతున్నాడు, అలాగే వెల్దుర్తికి చెందిన మాటిగాళ్ల వీరాంజనేయులు భార్యతో కలిసి ఎర్రగుంట్ల వైపు మోటార్ బైక్‌లో వస్తున్నాడు. సబ్‌స్టేషన్‌కు సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రమేష్‌కు ముఖానికి గాయాలు అయినట్లు తెలిపారు. అలాగే వీరాంజనేయులకు కూడా కుడికన్ను కిందబాగంలో గాయాలు అయినట్లు తెలిపారు. వీరాంజనేయులు బైక్‌లో ఉన్న మహిళకు కూడాగాయాలు అయ్యాయన్నారు. వారి ముగ్గురిని 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసునమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చినుకు రాలదు.. ఆశ చావదు

ఎండుతున్న ఖరీఫ్ పైర్లు - ఆందోళనలో అన్నదాతలు





పత్తి చేలో కలుపు తీస్తున్న రైతులు

ఎండుతున్న కంది పంట

రాజుపాళెం: జూలై నెలలో అరకొర వర్షాలతో ఖరీఫ్ పంటలు అయిన పత్తి, మినుము, కంది పంటలు రైతులు సాగు చేశారు. 20 రోజులు అవుతున్నా వర్షం లేకపోవడంతో మొలక దశలోనే పంటలు ఎండుతుండడంతోపాటు పంటలను వదులుకోలేక, వర్షం కోసం ఎదురుచూడలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తిసాగులో కలుపు తీసుకుంటూ ఊరుస్తున్న మోడాలను చూస్తూ రైతులు ఇంకా పంటలపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. అయితే పంట వేసి 20 రోజులు దాటుతుండడంతో పత్తి పంటలో పెరుగుదల పూర్తిగా నిలిచిపోయింది. 40 రోజుల్లో పూత దశకు వచ్చే పత్తిపంట భూమికి బెత్తడు కూడా పెరగకుండా ఉండడంతో కొంతమంది రైతుల్లో నిరాశ ఏర్పడింది. అర్కటవేముల, సోమాపురం, వెంగళాయపల్లె, గాదెగూడూరు గ్రామాల్లో ఇసుక పొలాలు కావడంతో ఎండ తీవ్రతకు పంటలు పూర్తిగా వాడుముఖం పట్టాయి. ఏది ఏమైనా రైతులు మాత్రం వర్షం పడుతుందనే ఆశతో పంటలను సంరక్షించుకుంటూ పంట పొలాల్లో నిమగ్నమై ఉన్నారు. ఆగస్టు 10, 15 రోజుల్లో వర్షం కురవకపోతే ఖరీఫ్ పంటలు వదులుకునే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా కొంతమంది వర్షం వస్తే పంటలకు రక్షణ అని లేకపోతే రబీ పంటలపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

దోమల నివారణకు డీడీటీ పిచికారీ



డీడీటీ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ముద్దనూరు: దోమలు వృద్ధి చెందకుండా, నివారణకోసం డీడీటీ మందు పిచికారీ చేస్తున్నట్లు సీహెచ్ఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో బుధవారం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీడీటీ మందు పిచికారీ చేశారు. చింతకుంట గ్రామంలో గత ఏడాది జ్వరాలు రావడంతో ముందు జాగ్రత్తగా డీడీటీ మందు పిచికారీ చేశామన్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వం వసతి గృహాల్లో మందు పిచికారీ చేశామన్నారు. జ్వరాలు రాకుండా ముందుజాగ్రత్త కోసం డీడీటీ మందు చల్లుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వరప్రసాద్, ఏఎన్ఎంలు ఓబులేసు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

- మీ సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.
- ఎర్రగుంట్ల - 9441112349
- ముద్దనూరు - 8099575259
- జమ్మలమడుగుటౌన్ - 9948300003
- జమ్మలమడుగురూరల్- 9848855313
- మైలవరం - 9912265711
- పెద్దముడియం - 9494835608
- కొండాపురం- 9440941345

సినిమా గైడ్

జమ్మలమడుగు

టీపీఆర్:	దండుపాళ్యం
టీఎన్‌ఆర్:	ఫిదా
సాయిరాం :	దువ్వాడ జగన్నాథమ్

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఎర్రగుంట్ల నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల: మున్సిపల్, పట్టణాల్లో అంగన్వాడీ సెంటర్లను కుదించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎర్రగుంట్ల నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ లక్ష్యానికి విరుద్ధంగా మున్సిపల్ పట్టణాల్లో 3126అంగన్వాడి సెంటర్లను 1026సెంటర్లుగా కుదించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లు కేవలం ప్రీ స్కూల్‌కోసమే ఏర్పాటు చేసినవి కావని, సెంటర్ పరిదిలోని మత్య, శిశుమరణాలను తగ్గించడానికి పిల్లల్ని బడికి అలవాటు చేసేందుకు ఏర్పాటు చేసినవని అన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, లక్ష్మిదేవి, కుసుమావతమ్మ,లక్ష్మికళావతి, సుబ్బలక్షుమ్మ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రేపు పొలతలలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

పెండ్లిమర్రి: జిల్లాలో ప్రముఖశైవక్షేత్రమైన పొలతల మల్లికార్జున స్వామి సన్నిధిలో శుక్రవారం ఉదయం వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణానాయక్, ఆలయ చైర్మన్ శంకర్‌రెడ్డి తెలిపారు. వ్రతానికి హాజరయ్యే మహిళలు కడప నగరంలోని పొలతల దేవస్థాన కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దేవస్థానం వారు పూజా సామాగ్రిని ఉచితంగా అందిస్తారన్నారు.

జిరాక్సు కాపీలను అందజేయాలి

వీరపునాయునిపల్లె: 2016 సంవత్సరంలో ప్రభుత్వం వేరుశనగ పంటకు అందించిన పెట్టుబడి రాయితీ జాబితాలో పేర్లు లేని రైతులు తమ సమాచా పత్రాలను ఈనెల 5వ తేదీలోపు ఏవో కార్యాలయంలో అందించాలని ఏవో అరవింద్ నాయక్ తెలిపారు. జాబితాలో లేని పేర్లను సంబంధిత పంచాయతీ కేంద్రాలలో, మీసేవ కేంద్రాలలో అతికించడం జరిగిందని ఏఓ తెలిపారు. రైతులు పట్టాదారు బుక్కు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్కు జిరాక్సులను అందజేయాలన్నారు.

పంట నమోదు వివరాలను పక్కాగా చేపట్టాలి



రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ ఠాగూర్‌నాయక్

పెండ్లిమర్రి: రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని జెడీఏ ఠాగూర్‌నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఏవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ సమన్వయంతో వ్యవసాయశాఖ సిబ్బంది పంటల క్షేత్రాలను సందర్శించి వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి వారం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని చేపట్టి పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన మెలకువలు, వివరాలు, పద్ధతులను తెలియజేయాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి పొలంబడి కార్యక్రమంలో భాగంగా గంగనపల్లె గ్రామ పరిధిలో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఏవో కార్యాలయంలో రైతులకు జింక్, జిప్సమ్‌ను జెడీఏ, ఏడీఏ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో నాగఅర్చన, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ - కేసులు నమోదు

పెండ్లిమర్రి: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై బుధవారం ఎస్ఐ రోషన్ సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన వారిపై, అలాగే మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 31 లైసెన్సులేని కేసులు, 2 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి ఆర్‌సీ తదితర రికార్డులు లేని వాటికి నాలుగు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్ఐ

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు పరిశీలనకు బృందం రాక



కార్తికేయ అసోసియేట్ బృందంతో మాట్లాడుతున్న చైర్మన్ శివారెడ్డి

చెన్నూరు: మేజర్ గ్రామ పంచాయతీ అయిన చెన్నూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ఏర్పాటు కోసం హైదరాబాదుకు చెందిన కార్తికేయ అసోసియేట్స్ బృంద సభ్యులు వెంకటేష్, కుమార్ బుధవారం చెన్నూరుకు చేరుకున్నారు. వీరు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి, కడప మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.శివారెడ్డి, మండల ఇంజనీర్ సుధాకర్‌రెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ చెన్నూరులో దాదాపు 15 రోజుల పాటు ఈ బృందం వీధులను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఏయే వీధులలో ఎలా ఏర్పాటు చేయాలి, లెవెల్స్ ఎలా తీయాలి, ఎక్కడెక్కడ ఎంత లెవెల్ వుండాలన్న విషయాలను పరిశీలిస్తారన్నారు. అనంతరం నివేదిక తయారు చేసి కార్తికేయ అసోసియేట్స్‌కు పంపి అక్కడ యూజీడీకి సంబంధించి డిజైన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపితే నిధులు మంజూరు కాగలవన్నారు. ఇటీవల కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో చెన్నూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయిస్తానని చెప్పడం జరిగిందన్నారు. కార్తికేయ అసోసియేట్స్ సభ్యులు ఎంత త్వరగా నివేదిక ఇస్తే అంత మేలన్నారు. మండల ఉపాధ్యక్షుడు పంచాయతీరాజ్ ఏఈ మాట్లాడుతూ చెన్నూరుకు యూజీడీ రావడం ఒక వరమేనన్నారు. ఇప్పటి వరకు వున్న మురుగు కాల్వలలో క్లీనింగ్ సమస్యలు ఎక్కువగా వున్నాయని, యూజీడీ వల్ల ఎంతో మేలు జరిగి గ్రామం పరిశుభ్రంగా వుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బుజ్జన్న, లేవాకు శివారెడ్డి, షబ్బీర్, కొండాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

కమలాపురం రూరల్: అంగన్ వాడీ మినీ అంగన్ వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి, మండల కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అన్ని ఆవాస ప్రాంతాలలో అంగన్ వాడీ సేవలు అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని, 15 నుంచి 400జనాభా వున్న ప్రాంతాలలో మినీ అంగన్ వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు వున్నాయని, అందులో ఒక్క వర్కరు మాత్రమే పనిచేస్తుందని పనిభారమంతా ఆమెపై పడుతుందని అందుకు తోడు రాష్ట్ర ప్రభుత్వంఅన్న అమృతహస్తం కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఈ సెంటర్లలో సహాయకులు లేరని, కావున మినీ అంగన్ వాడీ సెంటర్లలో సహాయకులను నియమించాలన్నారు. 1500 జనాభా వున్న ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మినీ అంగన్ వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంగన్ వాడీ వర్కర్లకు వర్తించే సదుపాయాలు వీరికి అందించాలన్నారు. గత నాలుగు నెలల నుంచి జీతాలు, భవనాల అద్దెలు, టీఏ ఇవ్వలేదని, వెంటనే విడుదల చేయాలన్నారు. మినీ అంగన్ వాడీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.750 వేరియాల్ ఇవ్వాలన్నారు. అంగన్ వాడీ సెంటర్ నిర్వాహణ ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మీదేవి, రమణ, శివశంకర్ ప్రసాద్, సాయి సుధాకర్, అలేఖ్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

సికెదిన్నె: ప్రపంచంలో యువత అధికంగా ఉన్న దేశం భారతదేశమేనని, దేశ భవిష్యత్తు, దిశ, దశను నిర్ణయించేది యువతేనని, యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా సన్మార్గంలో పయనించాల చిన్నయ్య మిషన్ ప్రెసిడెంట్ ఆచార్య బి.ఆర్.షౌనక్ చైతన్య పేర్కొన్నారు. రాయచోటి రోడ్‌లోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాంకేతిక పరివర్తన అభివృద్ధిపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో పరివర్తన రావడం కోసం శాస్త్రీయంగా విజ్ఞానమైనటువంటి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. శారీరక పరివర్తన, మానసిక పరివర్తన, సాంస్కృతిక పరివర్తన, మేధోపరివర్తన గురించి వివరించడంతో పాటు వివిధ రకాల ప్రజెంటేషన్సలతో, ఉదాహరణలతో ఆటల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎన్.శశికుమార్, అధ్యాపకురాలు వై.ఉమాదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



షౌనక్ చైతన్యను సన్మానిస్తున్న దృశ్యం, హాజరైన విద్యార్థులు

చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులదే బాధ్యత

చెన్నూరు: తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వుంటే చిన్నారులు ఆరోగ్యవంతులుగా వుంటారని సీహెచ్ సీ వైద్యాధికారి జి.శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఆర్ టీకాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ టీకాపై కల్పించిన అపోహలను, భయాన్ని తొలగించాల్సింది తల్లిదండ్రులేనన్నారు. ప్రాణాంతక వ్యాధులైన మీజిల్స్, రూబెల్లా 15 ఏళ్ళలోపు చిన్నారులకు దరి చేరవన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ జయరామ్, మాధవీలత, అనసూయా, సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది

కమలాపురం రూరల్: పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, అందువలన తల్లిపాలు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, ఓబులమ్మ తెలిపారు. బుధవారం గంగవరం, పెద్దచెప్పలి గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలన్నారు. కొంతమంది పిల్లలకు ఆరు నెలల్లోపు ఆహారం అందిస్తుంటారని, ఇది మంచిది కాదన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు జీర్ణవ్యవస్థ అభివృద్ధి చెందదని, పాలు తప్ప ఇతర ఆహార పదార్థాలు అరగాయించుకోలేరని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్న అమృతహస్తం ప్రవేశపెట్టిందని, ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు ప్రతిరోజు పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం చిన్నయ్య, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి రైల్వేస్టేషన్ ను పరిశీలించిన తులసిరెడ్డి

పెండ్లిమర్రి: కడప-బెంగుళూరు రైల్వే లైను నిర్మాణంలో భాగంగా పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసిన రైల్వేస్టేషన్ ను పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్లిమర్రి నుంచి రైల్వేస్టేషన్‌కు పోయే దారి చాలా అధ్వానంగా వుందని, వెంటనే రోడ్డును వేయాలన్నారు. అలాగే రైల్వే ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించి త్వరగా రైల్వేలైను పూర్తి చేయాలన్నారు. భూసేకరణలో భూములు కోల్పోయే రైతులకు వీలైనంత ఎక్కువ నష్టపరిహారం అందజేయాలని కోరారు.

ఆధార్ అనుసంధానం కాక ఖాతాదారుల ఇక్కట్లు

పెండ్లిమర్రి: నందిమండలం గ్రామంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కొంత మంది ఖాతాదారులకు ఆధార్ నెంబరు అనుసంధానం కాక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాలయ్యగారిపల్లెకు చెందిన ఖాతాదారుడు మాట్లాడుతూ బ్యాంక్ వద్దకు వెళ్ళి ఆధార్‌కార్డు జిరాక్స్ ఇచ్చి తన ఖాతాకు అనుసంధానం చేయడానికి ఇప్పటికే చాలాసార్లు ఇచ్చామన్నారు. ఐతే మరల ఉదయాన్నే చెక్ చేసుకుంటే ఇన్ యాక్టివ్ అని చెబుతున్నారని వాపోయారు. ఈ విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలుపగా తమ చేతుల్లో ఏమి లేదని చెబుతున్నారు. ఇలా కొంత మంది ఖాతాదారులు ఆధార్‌నెంబరు ఫీడింగ్ కాక ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులు జమకాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు తమ ఖాతాలో జమ అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

అన్నదానం పుణ్యకార్యం

సికెదిన్నె: అన్నదానం పుణ్యకార్యమని, ప్రతి ఒక్కరూ అన్నదానం చేయాల్సిన అవసరం ఉందని బృందా వృద్ధాశ్రమం నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ఆజాద్‌నగర్‌లో బృందా వృద్ధాశ్రమంలో బుధవారం మామిడి రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తెలు చంద్రకళావతి, రమాదేవి, అల్లుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, శాలువాలు, ఇడ్లికుక్కర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దాత రామసుబ్బారెడ్డి చలికాలంలో రాబోతుండడంతో ముందుగానే వృద్ధుల సమస్యను గుర్తించి వారికి శాలువాలు అందించడం అభినందనీయమాన్నరు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి కుటుంబసభ్యులు, ఆశ్రమం వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కమలాపురం	
ప్రదీప్	: గౌతమ్‌నంద
చెన్నూరు	
కృష్ణ	: గౌతమ్‌నంద